www.jagritiweekly.com
సంపుటి : 75 సంచిక : 51 పుటలు : 52

# జాగృతి

కలి 5125 - శ్రీ శోభకృత్ భాద్రపద బహుళ దశమి
09-15 అక్టోబర్ 2023
వెల : ₹20/-



నవ దుర్గా నమోస్తుతే..! 26



శ్రీలంక... బంగరు నెలవంక 32



## దేశం ఆకలిదప్పుల గురించి పొలాలకు చెప్పాడు

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

75 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

# వచ్చే జనవరి 26 తరువాత అయోధ్యలో దర్శనాలు

## వందరోజులలో రామమందిరం సిద్ధం

ప్రపంచ హిందువుల చిరకాల స్వప్నం అయోధ్య రామమందిరంలో కేవలం వందరోజులలోనే బాలరాముడి దర్శనం కాబోతున్నది. మందిర నిర్మాణం శరవేగంతో సాగుతున్నది. రామమందిర నిర్మాణ సంఘం అధ్యక్షుడు నృపేంద్ర మిశ్రా సెప్టెంబర్ 28న ఏఎన్ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయం వెల్లడించారు. సంక్రాంతికే అన్ని పనులు పూర్తి అయినప్పటికీ రామయ్యను ప్రశాంతంగా దర్శనం చేసుకోవడానికి జనవరి 26 తరువాత అనువుగా ఉంటుందని ఆయన చెబుతున్నారు. తొలిదశ నిర్మాణం ఈ డిసెంబర్ మాసాంతానికి పూర్తికావస్తున్నది. కింది అంతస్తులో ఐదు మంటపాలు ఉంటాయి. ఇక్కడే గర్భాలయం కూడా నిర్మించారు. ఇందులో విగ్రహాల ప్రతిష్టకు కూడా ఇంకా ముహూర్తం ఖరారు కాలేదు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరవుతారు. ప్రాణప్రతిష్ట వంటి కార్యక్రమాల తరువాత చక్కని దర్శనం కోసం జనవరి 26, 2024 నుంచి సానుకూలంగా ఉంటుందని మిశ్రా అభిప్రాయపడుతున్నారు. 2.6 ఎకరాల స్థలంలో ఆలయం రూపుదిద్దుకుంటున్నది. 160 స్తంభాలు నిర్మించారు. ప్రతి స్తంభం మీద 25 విగ్రహాలు చెక్కారు. గోడల మీద వాల్మీకి మహర్షి విరచిత రామకథను చిత్రించారు. 2019లో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుతో శతాబ్దాలుగా వివాదంలో ఉన్న మందిర నిర్మాణానికి అవకాశం కలిగింది. ఆలయ నిర్మాణానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం అయోధ్య శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌ను నియమించింది. ఆగస్ట్ 5,2020న ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ★



# ఇది 'జాగృతి' అమృతోత్సవం



- వేయేళ్ల బానిసత్వం తరువాత ఆగస్ట్ 15, 1947న స్వరాజ్యం వచ్చింది.
- కాందిశీకుల ఆర్తనాదాలు దేశాన్ని కలచివేస్తున్న తరుణంలో... స్వరాజ్యం వచ్చిన రెండున్నర నెలలకే దాయాది పాకిస్తాన్‌తో యుద్ధం చేసింది భారత్.
- మూడు నెలల తరువాత... సరిహద్దులలో సైన్యం భీకరంగా పోరాడుతుండగానే అశనిపాతం వంటి వార్త... దేశ రాజధానిలో గాంధీ మహాత్ముడి హత్య.
- మరొకపక్క కశ్మీర్, హైదరాబాద్, జునాగఢ్ సంస్థానాలలో రక్తపాతం. ఇలాంటి పరిస్థితులలో ఆనాటి భారతీయ సమాజం ఎలా వ్యవహరించింది?
- గాంధీజీ హత్య నింద ఆర్‌ఎస్‌ఎస్ మీద పడింది! ఆ దారుణ ఆరోపణ నుంచి సంఘం ఎలా బయటపడింది? ఎంత పోరాటం చేసింది? లక్షకు పైగా స్వయంసేవకులు జైళ్లలో ఎలాంటి చిత్రహింసలకు గురయ్యారు? స్వతంత్ర భారతదేశపు ఆ తొలిరోజుల రక్తపుటడుగుల సంక్షుభిత చరిత్రను చదివి తెలుసుకోండి!

**2023 నవంబర్ 13-19**

**దీపావళి ప్రత్యేక సంచికలో!**

## త్వరపడండి!

అదనపు కాపీల కోసం పాఠకులు, ఏజెంట్లు అక్టోబర్ 31లోగా జాగృతి కార్యాలయానికి 9959997013 నంబరుకు ఫోన్ చేసి లేదా వాట్సప్‌లో సంప్రదించవచ్చు.

- 10 నుంచి 25 కాపీలు ఆర్డరు చేసిన వారికి 30 శాతం
- 26 నుంచి 99 కాపీలు ఆర్డరు పెట్టుకున్న వారికి 35 శాతం
- 100, ఆ పైన కాపీలకు 40 శాతం డిస్కౌంట్ లభిస్తుంది.

jagritiweekly.com facebook.com Jagriti Telugu Weekly youtube.com/@Jagrititv 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.

**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

**జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013**

## చందాదారులకు విన్నపం

జాగృతి వారపత్రికలను క్రమంతప్పకుండా అందజేయుటకు తపాలశాఖ వారు ఈ మధ్యనే **'మ్యాగజైన్ పోస్ట్'** అనే పేరుతో **'ట్రాకింగ్ సిస్టం'** ప్రవేశ పెట్టారు. ట్రాకింగ్ ఉంటుంది కాబట్టి పత్రిక తప్పనిసరిగా అందుతుంది. చందాదారునికి పత్రిక పోస్ట్ చేసిన తేదీ, పత్రిక అందజేసిన విషయం ఎస్ఎంఎస్ ద్వారా తపాలా శాఖవారు తెలియజేస్తారు. జాగృతి వారపత్రికను **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పొందుటకు అదనంగా సంవత్సరానికి **రూ. 624/-** (వారానికి రూ. 12/-) తపాలాశాఖకు చెల్లించాల్సి ఉంటుంది. కాబట్టి ఈ సదుపాయం పాఠకులు వినియోగించుకోవాలని విన్నపం. అందుకోసం జాగృతి అకౌంట్‌కు అదనంగా రూ. 624/- చెల్లించగలరు. ప్రస్తుత చందా దారులు రాబోయే వారాలకు తగిన మొత్తం (వారానికి రూ. 12/- చొప్పున) పంపిన వివరాలతోపాటు తమ చందా నెంబరు వివరాలు, పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెంబరు తెలుపగలరు. ఈ వివరాలు అందిన 15 రోజుల నుండి **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పత్రిక పంపే ప్రక్రియ మొదలవుతుంది.

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust,**
**920010061405325, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

**మరిన్ని వివరాలకు**

**040-27561453/9959997013** నెంబర్లలో సంప్రదించవచ్చు.

– సర్క్యులేషన్ మేనేజర్

**విడి ప్రతి రూ.20**

**5 సం॥ల చందా రూ.4000** | **సంవత్సర చందా రూ.850**

**చందా పంపవలసిన చిరునామా :**

✦ 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

కె. దుర్గారెడ్డి సబ్ ఎడిటర్ | అసోసియేట్ ఎడిటర్ **9959991304**

డిజైనర్ : సిహెచ్. కుమార్

గతంలో ఒకసారి చెప్పుకున్నట్టు కేరళలో ఏం జరిగినా దానిని వర్ణించడానికి మాటలు చాలవు. ఏదైనా సంచలనమే మరి! అక్కడ చర్చ్ ప్రభావం చాలా ఎక్కువ. వీటి గురించి వెలువడే సమాచారం ఎప్పుడూ సంచలనమే. ముస్లిం మతోన్మాదం ఆ విషయంలో ఏ మాత్రం వెనుకబడి లేదు. క్రీస్తును చేరడానికి వారికి అనేక చర్చ్‌లలో, వర్గాలను బట్టి అనేక విధానాలు ఉన్నాయి. అలాంటిదే ఇదుక్కి డయోసిస్ సైరో మలబార్ చర్చ్. ఈ చర్చ్ యాజమాన్యమే సరిగ్గా గాంధీ జయంతి రోజున ఫాదర్ కురియకోస్ మట్టంను 'వికార్' బాధ్యతల నుంచి తొలగించింది. వికార్ అంటే ఎవరు? బిషప్-ప్రధాన మత గురువు తరువాతి స్థానంలో ఉండేవారు. మంకువ సెయింట్ థామస్ చర్చ్‌లో కురియకోస్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గాంధీ జయంతికే ఈ ముహూర్తం ముంచుకు వచ్చింది. ఎలాగంటే, కురియకోస్ ఆ రోజున బీజేపీలో చేరారు. ఇందుకు ఆగ్రహించిన సదరు చర్చ్ యాజమాన్యం కొన్ని గంటలలోనే పదవి నుంచి పీకేసింది. ఇదుక్కి జిల్లా బీజేపీ అధ్యక్షుడు కేఎస్ అజీ ఫాదర్ కురియకోస్‌కు పార్టీ ప్రాథమిక సభ్యత్వం ఇచ్చారు. కానీ ఫాదర్ కురియకోస్‌ను తాత్కాలికంగానే బాధ్యతలను నుంచి తప్పించామని బుల్లి వివరణ కూడా ఇచ్చుకుంది యాజమాన్యం.

కేనన్ చట్టం ప్రకారం ఒక చర్చ్‌లో మత గురువుగా పనిచేస్తున్న వ్యక్తి ప్రత్యక్ష రాజకీయాలలో ఉండరాదు. అందుకే ఈ చర్య అని చెప్పాడు ఆ చర్చ్ అధికార ప్రతినిధి. ఇదో పచ్చి అబద్ధం. గతంలో తమ మతస్థుడికి పార్టీ టికెట్ ఇమ్మని పాలక్కాడ్ క్రైస్తవ మతగురువు సాక్షాత్తు రాష్ట్ర సీపీఐకి లేఖ రాశారు. వామపక్ష ద్వయానికీ, చర్చ్‌కీ అక్కడే గట్టి అనుబంధమే ఉంది. ఇంతకీ కురియకోస్ వయసు 74 ఏళ్లట. కొన్ని మాసాలలోనే పదవీ విరమణ చేయబోతున్నారట. దేశ పరిస్థితులు బాగా ఆకళింపు చేసుకున్నారు కాబట్టి కురియకోస్ బీజేపీలో చేరారని జిల్లా అధ్యక్షుడు అజీ ట్వీట్ చేశారు. కురియకోస్ వివరణ ఇంకా చక్కగా ఉంది. బీజేపీలో చేరడానికి నాకు ఎలాంటి అభ్యంతరాలు కనిపించలేదు అన్నారాయన. కానీ మణిపూర్ హింసాకాండను

**శాలివాహన 1945 శ్రీ శోభకృత్ భాద్రపద బహుళ దశమి**

**లోపలి పేజీలలో...**



ముఖపత్ర కథనం

**దేశం ఆకలిదప్పుల గురించి**

**పాలాలకు చెప్పాడు**

6లో



జాతీయం

**తమిళ తెరపై కొత్తచిత్రం**

12లో



ధారావాహిక నవల

**మహా సంకల్పం**

– పి. చంద్రశేఖర ఆజాద్

20లో

# జాగృతి

## సంపాదకీయం

కేరళ చర్చ్‌లు విమర్శిస్తున్న కాలంలో కురియకోస్ ఇంతపని చేయడమే వాటికి జీర్ణం కావడం లేదు.

మన దేశంలో చర్చ్ వైఖరి ఇలా ఉంటే, మన ఇరుగు పొరుగు అఫ్ఘానిస్తాన్‌ను ఇష్టారాజ్యంగా ఏలుతున్న తాలిబన్ మంత్రి ఏమన్నాడో కూడా గమనిద్దాం. రెండూ ఏకకాలంలో జరిగాయి! షరియా ప్రకారం పురుషులు, స్త్రీలు సమానం కాలేరు అంటున్నాడు ఉన్నత విద్యాశాఖ మంత్రి నేదా మహమ్మద్ నాదిమ్. స్త్రీ పురుషులు సమానమేనని పాశ్చాత్య దేశాలు పనీపాటా లేక అంటూ ఉండవచ్చు. కానీ కాదంతే అంటున్నాడు ఈయన. స్త్రీ పురుషుల మధ్య తేడాను ప్రవక్త అల్లా

# సరికొత్త అంటరానితనం

తెలియచేశాడు. పురుషుడు పాలకుడు. అతడే సర్వంసహాధికారి. పురుషుడిని గౌరవించాలి. అతడి ప్రపంచాన్ని స్త్రీలు వినమ్రంగా ఆమోదించాలి అని బగ్లాన్ విశ్వవిద్యాలయంలో ఉపదేశించాడు నాదిమ్. ఆ దేశంలో బాలికలు, యువతులు విద్యాలయాలకి వెళ్లకుండా నిషేధించి చాలా కాలమే అయింది.

భారతదేశంలో అంటరానితనం ఉంది. కానీ ఆ దురాచారం కొనసాగడానికి భారతీయ సమాజంలోని సంస్కర్తలు అంగీకరించలేదు. అందుకోసం ఉద్యమాలు జరిగాయి. సజీవంగా ఉండే లక్షణం, సంప్రదాయం ఉన్నది కాబట్టి సమాజంలోని ఇలాంటి ఒక ప్రాణాంతక వ్యాధిని నిర్మూలించడానికే భారతీయ సమాజం నిజాయతీగా ఆరాటపడింది. చాలావరకు విజయం సాధించింది. కానీ అంటరానితనమే సాకుగా ఈ దేశంలో క్రైస్తవ మిషనరీలు కొన్ని శతాబ్దాలుగా మతాంతరీకరణలను యథేచ్ఛగా సాగిస్తున్నాయి. ఈశాన్య భారతంలో మిషనరీలు సాగించిన ఇలాంటి నిర్వాకం గురించి ఇప్పుడు దేశ ప్రజలు నమ్మకం తప్పడం లేదు. మతాంతరీకరణలో జాతీయ విద్వేషం ఉందని ముందునుంచీ సంఘ పరివార్ చెబుతూనే ఉంది. ఇప్పుడు కురియకోస్ ఉదంతంతో అది మరొకసారి రుజువైంది. బీజేపీ భిన్నత్వంలో ఏకత్వాన్ని ఆరాధించే సంస్థ. జాతీయ విలువలు, దేశభక్తి, హిందువుల ఐక్యత అవసరాన్ని గుర్తించిన ఆర్‌ఎస్‌ఎస్ బీజేపీకి స్ఫూర్తి. అలాంటి పార్టీలో చేరిన ఒక క్రైస్తవ మతగురువును ఆగమేఘాల మీద చర్చ్ పూజా బాధ్యతల నుంచి తప్పించడం ఎందుకు? భారతీయత మీద ఇంత వ్యతిరేకత ఏమిటి? మెజారిటీ ప్రజల విశ్వాసాల మీద ఇంత నిరసన ఎందుకు? ఇది కొత్తరకం అంటరానితనానికి అంకురార్పణ కాదనడం ఎలా? నిజం చెప్పాలంటే కొత్త అంటరానితనానికి భారత్‌లో చర్చ్ ఎప్పుడో బీజాలు వేసింది. హిందువులలో అగ్రకులస్థులు, నిమ్నకులస్థులు కూడా క్రైస్తవం స్వీకరిస్తున్నారు. అయితే మతాంతరీకరణ తరువాత అదే దూరం అక్కడ కూడా కొనసాగుతున్న మాట పరమ సత్యం. ఈ అంశం గురించి ఇంకొంచెం లోతుకు వెడితే కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుందన్న రీతిలోనే ఉంటుంది.

కానీ భారతదేశంలో కొన్ని రాజకీయ పక్షాలు, స్వయం ప్రకటిత మేధావులు చేస్తున్న పని ఏమిటి? బుజ్జగింపుతో, హిందూద్వేషంతో స్త్రీ పురుషునితో సమం కాదు అని చెబుతున్న మతం ఇక్కడ వ్యాప్తి కావడానికి దోహద పడడం కాదా? సరికొత్త అంటరానితనానికి బాటలు వేస్తున్న క్రైస్తవానికి సాగిలబడడం కాదా? సనాతన ధర్మాన్ని నిర్మూలించాలి అంటూ ప్రగల్భిస్తున్నది వీటి ప్రాపకం కోసం కాదా? ఆ క్రమంలో అడ్డుగోలుగా చేసే వాదనలకు, కుసంస్కారంతో చేసే దూషణలకు భావ ప్రకటనా స్వేచ్ఛ అని పేరు పెట్టడం లేదా? ఏమైనా కేరళ చర్చ్ దేశ ప్రజల ముందు తన గురించి తానే పెద్ద చర్చకు అవకాశం ఇచ్చింది. జాతీయ భావాలకు చర్చ్‌లు దూరమన్న ప్రచారం నిజమేనా? అన్న ప్రశ్నకు తావిచ్చింది. ఈ విషయాన్ని భారతీయులు సమ్యక్ దృష్టితో ఆలోచించాల్సిన అవసరం ఇప్పుడు ఉంది. ★

09 అక్టోబర్ 2023, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ - బృహదారణ్యకోపనిషత్



40లో

కథ

**గోరక్షకుడు**

– కల్హణ





| | | |
|---|---|---|
| మోదీ వరాల జల్లు.. రాష్ట్రానికి పసుపు బోర్డు (తెలంగాణ) | - | 14 |
| ప్రభుత్వ విధానాలపై 'కాగ్' కన్నెర్ర (వేదిక) | - | 16 |
| నవ దుర్గా నమోస్తుతే...! (ప్రత్యేక వ్యాసం) | - | 26 |
| ఆరోగ్య భాగ్య 'కాటలిన్' (మహిళ) | - | 28 |
| రేనాటిసీమకు చందమామ (సాహిత్యం) | - | 30 |
| అగ్రరాజ్యాలకు జైశంకర్ పాఠాలు (అంతర్జాతీయం) | - | 35 |
| ఆసియా క్రీడల్లో 'తెలుగు వెలుగులు!' (క్రీడ) | - | 43 |
| సంక్రాంతికి మహా రంజుగా... (సినిమా) | - | 50 |

వారంలో ఒక పూట భోజనం మానేయండి అంటూ సాక్షాత్తు నాటి దేశ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి పిలుపునిచ్చిన రోజులవి. పిఎల్-480 కార్యక్రమం కింద యుఎస్ఎ నుంచి గోధుమలతో వచ్చే ఓడల కోసం నిత్యం ఎదురు చూస్తున్న రోజులు కూడా అవే. ఓడ రావాలి. కడుపు నిండాలి. రుతుపవనాలలో అస్థిరతలు, విత్తనాల కొరత, మట్టిలో తక్కువ ఉత్పాదక శక్తి వెరసి తీవ్ర దుర్భిక్ష పరిస్థితుల నడుమ నిత్య జీవితం గడుస్తున్న రోజులు కూడా అవే. ఒక పక్కన పాకిస్తాన్‌తో యుద్ధం, మరొకవైపు కరవు పరిస్థితులు… ఇటువంటి ప్రతికూలతలో అటు రైతాంగానికీ, ఇటు పోరాడుతున్న జవాన్లకీ స్ఫూర్తినిచ్చేందుకు శాస్త్రి 'జై జవాన్.. జై కిసాన్' అంటూ 1965లో నినాదాన్ని ఇచ్చారు. ఆ నేపథ్యమే దేశంలో 'హరిత విప్లవానికి' బీజాలు వేసింది. మనం ఆ యుద్ధాన్నీ గెలిచాం, కొద్ది సంవత్సరాలలో ఆహార భద్రతనూ సాధించాం. భారత ఆర్థిక చరిత్రలో ఇదొక ప్రత్యేక ఘట్టం. ఈ ఘట్టానికి కేంద్రబిందువుగా కనిపించే శాస్త్రవేత్త మాన్‌కొంబు సాంబశివన్ స్వామినాథన్ (ఆగస్ట్ 7, 1925-సెప్టెంబర్ 28, 2023). రైతుల ఆత్మహత్యల నేపథ్యంలో ఆయన రూపొందించిన సిఫారసులు కూడా చరిత్రాత్మకమైన పాత్రను నిర్వహిస్తున్నాయి. వ్యవసాయశాస్త్రం క్షేత్రస్థాయిలో దుష్పరిణామాలకు కారణమవుతుంటే, సంస్కరించడానికి వెనుకాడని వాస్తవిక దృష్టి ఉన్న శాస్త్రవేత్త స్వామినాథన్.



# దేశం ఆకలిదప్పుల గురించి పొలాలకు చెప్పాడు

శతాబ్దాల వలస పాలన దేశాభివృద్ధినీ, వ్యవసాయాన్నీ ప్రతికూలంగా ప్రభావితం చేసింది. జాతి నిర్మాణానికి, వ్యవసాయ రంగ అభివృద్ధికి వనరులు తగ్గాయి. ఫలితమే–ఆహార ధాన్యాల దిగుమతుల కోసం అమెరికా వంటి దేశాల వైపు చూడడం.

నాటి భారత ప్రధానులు, లాల్ బహదూర్‌శాస్త్రి, ఇందిరా గాంధీ కాలంలోనే హరిత విప్లవ బీజాలు పడి మొలకలు వచ్చాయి. దానికి సూత్రధారులు నోబెల్ గ్రహీత నార్మన్ బోర్లాగ్, ఎంఎస్ స్వామినాథన్. పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో 1968లో హరిత విప్లవం ప్రారంభమైంది. అత్యధిక పంట దిగుబడిని ఇచ్చే గోధుమ విత్తనాలతో ప్రారంభమైన ఈ విప్లవం దేశంలో ప్రతి ఒక్కరి ఆకలినీ తీర్చే ప్రయత్నం చేసింది. అందుకే స్వామినాథన్‌ను హరిత విప్లవ పితామహుడిగా



పిలుస్తారు. ఈ పరిణామం మీద కొన్ని వ్యతిరేకాభిప్రాయాలు ఉన్నాయి. అవి కొట్టి పారేయలేనివే కూడా. అయినా ఒక విపత్కర దశ నుంచి రైతాంగాన్ని కాపాడిన పరిణామంగా హరిత విప్లవానికి స్థానం ఉంది. దేశాన్ని మిగులు ఆహారధాన్యాల దశకు తీసుకువెళ్లిన పరిణామంగా కూడా ఖ్యాతి గడించింది.

### హరిత విప్లవం

అధిక దిగుబడినివ్వగల విత్తన రకాలు, తగిన సాగునీటి సౌకర్యాలు, ఎరువులు ఇచ్చే అవకాశం హరిత విప్లవం కల్పించడంతో పంజాబ్, హరియాణా, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లలోని సేద్యం నాటకీయంగా మెరుగుపడింది. “1947లో భారత్ స్వాతంత్ర్యాన్ని సాధించిన సమయంలో ఏడాదికి 6 మిలియన్ టన్నులను మాత్రమే ఉత్పత్తి చేసేవారం. 1952 నాటికి అది ఏడాదికి 10 మిలియన్ టన్నులకు పెరిగింది. కానీ 1964–1968 మధ్య గోధుమల వార్షిక ఉత్పత్తి 10 మిలియన్ టన్నుల నుంచి 17 మిలియన్ టన్నులకు పెరిగింది. అది ఒక్కసారిగా వచ్చిన మార్పు, అందుకే దీనిని విప్లవాత్మక చర్యగా పిలుస్తా”రని, స్వామినాథన్ అనేవారు. ఇది రైతులలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. అంతకుముందు, విదేశీ నిపుణులు భారత్‌ను ‘షిప్ టు మౌత్ ఎగ్జిస్టెన్స్” (నౌక నుంచి నోటికి) అంటూ తక్కువ చేసి మాట్లాడేవారు.

ఒకవైపు వరి, మరొకవైపు గోధుమల అధిక దిగుబడి రకాల రూపకల్పనపై స్వామినాథన్ సహ పలువురు పరిశోధకులు, శాస్త్రవేత్తలు పనిచేశారు. అయితే, భారతదేశంలో హరిత విప్లవానికి ఆధార భూతమైన ఎక్కువ నీరు, ఎరువులకు ప్రతిస్పందించే నూతన జన్యు రకం లేదా నారు రకాన్ని పరిచయం చేయాలన్న ప్రాథమిక వ్యూహాత్మక దార్శనికత మాత్రం స్వామినాథన్‌దేనని ఒక పత్రిక పేర్కొనడాన్ని ఎవ్వరూ కొట్టి పారేయలేరు. కాగా, స్వామినాథన్ తొలుత వరి, గోధుమ రకాలపై చేసిన పరిశోధనలలో కొన్ని విఫలం అయ్యాయి. పొట్టి రకం వంగడాలను అభివృద్ధి చేయాలన్న ఆయన ప్రయత్నం విఫలమైంది. ఎందుకంటే, నారు పొట్టిదైతే, గింజ కూడా పొట్టిదే అవుతుంది.

ఈ క్రమంలో పొట్టి రకం గోధుమ విత్తనాలను అభివృద్ధి చేసిన అమెరికన్ సైంటిస్టు ఆర్విల్ వోగెల్‌ను కలుసుకున్నారు. ఆయనే నార్మన్ బోర్లాగ్‌ను కలువవలసిందిగా స్వామినాథన్‌కు సూచించారు. అప్పటికే బోర్లాగ్ మెక్సికోలో వోగెల్ లాగానే గోధుమ రకాలను తయారు చేసి, ప్రయోగాలు చేస్తున్నారు. అవి భారతదేశానికి సరిపోతాయని సూచించడంతో, స్వామినాథన్ భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ (ఇకార్)లో ఈ గోధుమల పెంపకం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ రకంగా, 1963లో పొట్టిరకం గోధుమ పెంపకం కార్యక్రమాన్ని ప్రారంభించడం, ఐదేళ్లలోనే అది ‘గోధుమ విప్లవం’గా రూపుదాల్చింది. ఈ విజయానికి గుర్తుగా నాటి ప్రధాని ఇందిరా గాంధీ ప్రత్యేక స్టాంపును విడుదల చేశారు.

### సేద్యం, ఆరోగ్యంపై దృష్టి

హరిత విప్లవం ప్రారంభమైన ఒక దశాబ్ద కాలంలోనే భారత్ ఆహార కొరత దేశం నుంచి ఆహారధాన్యాల మిగులు దేశంగా అవతరించింది. ఈ రకంగా ఆహార కొరత సమస్యను పరిష్కరించిన అనంతరం స్వామినాథన్ నాటి పాలకులు విస్మరిస్తున్న అంశాలపై తన దృష్టి ఇతర అంశాలపైకి మళ్లించారు. పౌష్టికాహార కొరత కారణంగా, మహిళల్లో, పిల్లల మరణాల రేటు పట్ల విధానకర్తల దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేశారు. దీనితోపాటు, తక్కువ బరువుతో జన్మిస్తున్న నవ జాత శిశువుల విషయాన్ని కూడా ఆయన ప్రభుత్వం దృష్టికి తెచ్చే ప్రయత్నం చేశారు. భారతదేశం, దక్షిణాసియాలోని పలు దేశాలలో పుడుతున్న శిశువుల్లో ప్రతి మూడవ శిశువు తక్కువ బరువుతో ఉంటోంది. తల్లికి, గర్భంలో పిండంగా ఉన్న సమయంలో వారికి సరైన పౌష్టికాహారం లభించకపోవడంతో ఇటువంటి శిశువులు జన్మిస్తున్నారని, ఇటువంటి వారిలో మెదడు సరిగా అభివృద్ధి చెందకపోవడం సహా, వయోజన జీవితంలో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయని ప్రభుత్వాన్ని అప్రమత్తం చేశారు.

### హరితవిప్లవ దుష్పరిణామాలు

భారతదేశం తగినంత ఆహారాన్ని అందివ్వడంలో గొప్ప పాత్రను పోషించినప్పటికీ, హరిత విప్లవం పలు అంశాలలో విమర్శలను ఎదుర్కొంది. ముఖ్యంగా, దానిని అత్యధిక ఉత్పాదకత ఉన్న రాష్ట్రాలలో ప్రవేశపెట్టడంతో అది అప్పటికే సంపన్నులైన రైతులకు తోడ్పడిందనే విమర్శ

# బెంగాల్ కరవును చూసి చలించి....



నార్మన్ బోర్లాగ్‌తో...

మద్రాస్ ప్రెసిడెన్సీలోని కుంభకోణంలో స్వామినాథన్ ఎం. సాంబశివన్, పార్వతి తంగమ్మళ్‌కు జన్మించారు. కేరళలోని అలప్పుఝ జిల్లాకు చెందిన సాంబశివన్ కుంభకోణంలో జనరల్ సర్జన్. కొడుకు కూడా తండ్రిలాగే డాక్టర్ కావాలని కన్నవారు కోరుకున్నా, స్వామినాథన్ మాత్రం జంతుశాస్త్రం ప్రధానాంశంగా ఉన్నత విద్యను ప్రారంభించారు. కానీ 11 ఏళ్ల వయసులోనే స్వామినాథన్ తండ్రిని కోల్పోయారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో, 1943లో సంభవించిన బెంగాల్ మహా కరవు ప్రభావాలను, యావత్ దేశంలోనూ బియ్యం కొరతతో అల్లాడుతున్న ప్రజలను చూసిన తర్వాత ఆయన వ్యవసాయంపై దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్నారు. ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ ప్రచురించిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, "అది 1942లో గాంధీజీ క్విట్ ఇండియా ఉద్యమానికి పిలుపునిచ్చిన కాలం. 1942–43లోనే బెంగాల్ కరవు వచ్చింది. మేం చాలామందిమి ఆ కాలంలో ఆదర్శవాదులుగా ఉన్న విద్యార్థులం, స్వతంత్ర భారతదేశానికి తామేమివ్వగలమని మమ్మల్ని మేము ప్రశ్నించుకున్నాం. కేవలం బెంగాల్ కరవు కారణంగా, వ్యవసాయ విద్యనభ్యసించాలని, వైద్య కళాశాలకు బదులు కోయంబత్తూరులోని వ్యవసాయ కళాశాలకు వెళ్లాను," అన్నారు. బెంగాల్ కరవులో మూడు మిలియన్ల మంది వరకూ మరణించారని అధికారిక లెక్కలు చెప్తున్నా, వాస్తవంలో ఆ లెక్క ఎన్నో రెట్లు ఎక్కువ. ఈ కరవు, కృత్రిమమైనది. రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న సైనికులకు ఆహారధాన్యాలను తన వలస కాలనీల నుంచి సేకరించాలన్న బ్రిటిష్ విధానాల ఫలితంగా సంభవించింది.

చిన్న రైతు అయినా పెద్ద రైతు అయినా లబ్ధి పొందేలా విత్తనాలు తయారు చేయడం తన లక్ష్యంగా ఉండేదని స్వామినాథన్ చెప్పారు. ఐరోపా, యుఎస్‌లలోను పని చేశారు. సారవంతమైన నేల, నీటి నిర్వహణలకు ప్రతిస్పందించగల అత్యధిక దిగుబడిని ఇచ్చే రకాలను అభివృద్ధి చేసే పని 1954లో ఆయన కటక్‌లోని సెంట్రల్ రైస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ చేరాక ప్రారంభించారు.

వినిపించింది. ఈ విషయాలను స్వామినాథన్ 1968లోనే గుర్తించి, దేశవాళీ విత్తనాలను వదిలి అత్యధిక దిగుబడిని ఇచ్చే కొత్త వంగడాలను వేస్తూ, నేల సారాన్ని పరిరక్షించకపోతే, మిగిలేది ఎడారులే నని అప్పుడే హెచ్చరించారు. ముఖ్యంగా విచక్షణా రహితంగా పురుగు మందులు, ఎరువులు వంటి వాటిని ఉపయోగించడం, భూగర్భజలాలను అశాస్త్రీయంగా వాడడం వంటివన్నీ అంతిమంగా నష్టాలను కలిగిస్తాయని హెచ్చరించారు.

ఆయన అప్పుడు చేసిన హెచ్చరికలను రైతులు పెడచెవిన పెట్టడంతో నేడు పంజాబ్ వంటి రాష్ట్రాలలో ప్రజలు తీవ్ర ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. దేశంలో వాణిజ్య పంటలను పండించే పలు రాష్ట్రాలలో కూడా విచక్షణా రహితంగా భూగర్భ జలాలను వాడడంతో నీటికి కరవు వచ్చి అవి ఎడారులలా మారుతున్న వైనాన్ని మనం చూస్తున్నాం.

## నేషనల్ కమిషన్ ఆన్ ఫార్మర్స్

**(ఎన్‌సిఎఫ్– రైతాంగ సమస్యలపై జాతీయ కమిషన్)**

వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడం, అప్పులలో చిక్కుకు పోవడం, ప్రభుత్వం తగిన చేయూతనివ్వకపోవడం వంటి కారణాలతో 1990ల నుంచి, 2000వ దశకం దాకా దేశవ్యాప్తంగా రైతుల ఆత్మహత్యలు నిత్యకృత్యంగా మారాయి. ఈ సమస్యలను పరిశీలించి, అందుకు తగిన పరిష్కారాలను సూచించవలసిందిగా 18 నవంబర్ 2004లో ఎంఎస్ స్వామినాథన్ నాయకత్వంలో నేషనల్ కమిషన్ ఆన్ ఫార్మర్స్‌ను నాటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఎన్‌సిఎఫ్ నాలుగు నివేదికలను (డిసెంబర్ 2004లో, ఆగస్టు 2005లో, డిసెంబర్ 2005లో, ఏప్రిల్ 2006) అందించింది. ఐదవది, అంతిమ సిఫారసుల దస్త్రాన్ని అక్టోబర్ 4, 2006లో సమర్పించింది. వేగవంతమైన, మరింత సమ్మిళిత వృద్ధిని సాధించేందుకు కమిటీ సూచనలు చేసింది. ఈ సిఫారసులకు విశేష ప్రాధాన్యం ఉంది.

## స్వామినాథన్ కమిటీ పరిశీలనలు, సూచనలు

వ్యవసాయ సంక్షోభం రైతాంగ ఆత్మహత్యలకు దారి తీస్తోంది. వ్యవసాయ సంక్షోభానికి ప్రధాన కారణాలలో – భూ సంస్కరణల అజెండా పూర్తి చేయకపోవడం, నీటి నాణ్యత, పరిమాణం, సాంకేతిక శ్రమ, అలసట, వ్యవస్థాగత రుణాలు తగినంతగా, సమయానికి అందుబాటులో లేకపోవడం, మార్కెటింగ్ అవకాశాలకు హామీ లేకపోవడం కారణమని ఆ సిఫారసులు తేల్చి చెప్పాయి. వీటితో పాటుగా వాతావరణ పరిస్థితులు కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయని కమిటీ తెలిపింది. దీనికి పరిష్కారంగా రైతులకు భూమి, జలం, జీవ వనరులు, రుణం, బీమా, సాంకేతిక, విజ్ఞాన నిర్వహణ, మార్కెట్లు వంటి ప్రాథమిక వనరుల అందుబాటుపై రైతులకు నియంత్రణ ఉండాలని సూచించారు. వ్యవసాయాన్ని ఉమ్మడి జాబితాలో చేర్చాలని ఎన్‌సిఎఫ్ సూచించింది.

## భూ సంస్కరణలు

పంటలు పండించడానికి, పశువుల మేత కోసం కూడా భూమి అందుబాటులో ఉండాలంటే భూసంస్కరణలు అవసరమని కమిటీ సూచించింది. భూ యాజమాన్యంలో అసమానత ప్రతిఫలించడాన్ని పట్టి చూపింది. 1991–92లో గ్రామీణ కుటుంబాలలో సన్న, చిన్నకారు రైతుల యాజమాన్యంలో ఉన్న భూమి 3శాతంగా ఉండగా, భూస్వాముల



నాటి ప్రధాని శాస్త్రీజీతో..

యాజమాన్యంలో ఉన్న భూమి దాదాపు 10 నుంచి 54శాతం వరకూ ఉందని పేర్కొంది. దీనికి సీలింగ్, మిగులు, బీడు భూముల పంపిణీతో పాటు మంచి వ్యవసాయ భూములను, అటవీ ప్రాంతాలను వ్యవసాయేతర ప్రయోజనాల కోసం కార్పొరేట్ రంగానికి మళ్లించడాన్ని నిరోధించాలని కూడా కమిటీ కోరింది. ఉమ్మడి వనరుల ఆస్తికి గిరిజనులు, పశుపాలకులకు కాలానుగుణంగా అడవులలోకి ప్రవేశించేందుకు, పశువులను మేపే హక్కులకు హామీ ఇవ్వడం, వాతావరణం, పర్యావరణం, ప్రదేశం, నిర్దిష్ట కాలాన్ని బట్టి భూమిని ఉపయోగించే నిర్ణయాలను అనుసంధానం చేయగల సామర్థ్యం ఉండే జాతీయ భూ వినియోగ సలహా సేవా సంస్థ ఏర్పాటు చేయడం కూడా అవసరమని తెలియచేసింది. వ్యవసాయ భూమి పరిమాణం, ప్రతిపాదిత వినియోగ స్వభావం, కొనుగోలుదారు వర్గం ఆధారంగా వ్యవసాయ భూముల అమ్మకాలను క్రమబద్ధం చేసేందుకు ఒక యంత్రాంగం ఏర్పాటు చేయాలని సూచించింది.

**నీటి పారుదల**

మొత్తం 192 మిలియన్ హెక్టార్ల స్థూల వ్యవసాయ భూమిలో 60 శాతం మాత్రమే వర్షాధార భూమి. ఇది మొత్తం వ్యవసాయ ఉత్పత్తిలో 45 శాతానికి దోహదం చేస్తోంది.

రైతులందరికీ నిలకడగా, సమానంగా నీరు అందుబాటులోకి తెచ్చి తోడ్పడేందుకు సమగ్రమైన సంస్కరణలు అవసరమని ఈ సిఫారసులు చెప్పాయి. వర్షపు నీటిని సంరక్షించి, నీటి సరఫరాను పెంచడం, జలాశయాలు నిండేలా చూడడం తప్పనిసరి ప్రక్రియగా పరిగణించాలని అవి సూచించాయి. నిర్దిష్టంగా ప్రైవేటు బావులను లక్ష్యంగా చేసుకొని 'మిలియన్ వెల్స్ రీఛార్జి' కార్యక్రమాన్ని ప్రారంభించ డమూ అవసరమని తేల్చాయి. 11వ పంచవర్ష ప్రణాళికలో నీటిపారుదల రంగంలో పెట్టుబడులను తగినంతగా పెంచాలనీ, ఇందులో ఉపరితల జల వ్యవస్థలు, భూగర్భ జలాల రీఛార్జి కోసం మైనర్ ఇరిగేషన్, ఇతర నూతన పథకాలను అమలు చేసేలా నిధులను అందించాలని కోరింది.



ప్రధాని మోదీతో..

**వ్యవసాయ ఉత్పాదకత**

భూమి విస్తీర్ణంతో పాటుగా, ఉత్పాదక స్థాయిలు రైతు ఆదాయాన్ని నిర్ధారిస్తాయి. అయితే, భారతదేశ వ్యవసాయ యూనిట్ ఉత్పాదకతను ఇతర దేశాలతో పోలిస్తే అత్యంత తక్కువగా కనిపిస్తుంది. వ్యవసాయ ఉత్పాదకతలో అధిక వృద్ధిని సాధించడం కోసం ఎన్‌సిఎఫ్ సూచనలు చేసింది. నీటిపారుదల, మురుగునీటి వ్యవస్థ, భూమి అభివృద్ధి, జల సంరక్షణ, పరిశోధనాభివృద్ధి, రహదారి అనుసంధా నత తదితర వ్యవసాయ సంబంధిత మౌలిక సదుపాయాలలో ప్రభుత్వ పెట్టుబడుల గణనీయంగా పెంచడం అందులో ఒకటి. సూక్ష్మపోషకాల లేమిని కనుగొనే ఏర్పాట్లతో ఆధునిక భూపరీక్షా ప్రయోగ శాలల జాతీయ నెట్‌వర్క్ ఏర్పాటు చేయడం మరొ కటి. నేల ఆరోగ్యం, నీటి పరిమాణం, నాణ్యతను, జీవవైవిధ్యాన్ని సంరక్షించడంతో పాటు రైతు కుటుంబాలకు కూడా తోడ్పడే విధంగా వ్యవసా యాన్ని ప్రోత్సహించాలి. చిన్న, సన్నకారు రైతులకు సమయానికి, తగినంత రుణాన్ని అందించడం అన్నది ప్రాథమిక అవసరమని ఈ సిఫారసులు పేర్కొన్నాయి.

**ఆహార భద్రత**

ఆహారభద్రతకు సార్వత్రిక ప్రజా పంపిణీ వ్యవస్థ అమలు చేయాలి. ఇందుకు అవసరమయ్యే మొత్తం నబ్బిడీకి స్థూలదేశీయ ఉత్పత్తిలో ఒక్కశాతం సరిపోతుందని సూచిం చింది. ఇంకా–పంచాయ తీలు, స్థానిక సంస్థల భాగస్వామ్యంతో జీవిత కాలం పోషకాహార మద్దతును అందించే కార్యక్రమాలను పునర్ వ్యవస్థీకరించాలని సిఫారసులు చెప్పాయి. సమగ్ర ఆహార, రక్షణ పద్ధతి ద్వారా సూక్ష్మ పోషకాల లోపం వల్ల సంభవించే దాగి ఉన్న ఆకలిని తొలగించాలి. ధాన్యం నిల్వ, ప్రతిచోటా నీరు అన్న సూత్రం ఆధారంగా మహిళా స్వయం సహాయక బృందాలు కమ్యూనిటీల ద్వారా ఆహారం, జల బ్యాంకుల ఏర్పాటు, నిర్వహణను ప్రోత్సహించాలి. వ్యవసాయ సంస్థల లాభ దాయకతను, చిన్న, సన్నకారు రైతుల ఉత్పాదకత, నాణ్యతను మెరుగు పరిచి, గ్రామీణ వ్యవసాయేతర జీవనోపాధులకు ఏర్పాట్లు చేయాలి. పనికి ఆహారపథకం, ఉపాధి హామీ పథకంలోని ఉపయుక్తమైన అంశాలను కొనసాగిస్తూ జాతీయ ఆహార భద్రతా చట్టానికి రూపకల్పన చేయాలి. నిరుపేదల వినియోగం పెంచడం ద్వారా ఆహార ధాన్యాలకు డిమాండ్‌ను పెంచి, వ్యవసాయ పురోగతిని ముందుకు తీసుకువెళ్లేందుకు అత్యవసరమైన ఆర్థిక పరిస్థితులను సృష్టించవచ్చు.


అబ్దుల్ కలాంతో..

**రైతుల ఆత్మహత్యల నివారణ**

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ, పంజాబ్, రాజస్తాన్, ఒరిస్సా, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో స్వామినాథన్ కమిటీ ఏర్పాటుకు ముందు దశాబ్దం పాటు రైతుల ఆత్మహత్యలు అత్యధిక సంఖ్యలో నమోదు అయ్యాయి. ఆ నేపథ్యంలో రైతాంగం సమస్యలకు ప్రాధాన్యమిచ్చి పరిష్కరించవలసిందిగా ప్రభుత్వాలకు ఎన్‌సిఎఫ్ సూచించింది. సరసమైన రీతిలో ఆరోగ్య బీమాను అందించి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పునరుద్ధరించాలి. జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్‌ను ప్రాధాన్యతాంశంగా పరిగణించి ఆత్మ హత్యలు జరుగుతున్న ప్రాంతాలకు విస్తరింప చేయాలి. రైతాంగ సమస్యలకు ప్రభుత్వం నుంచి సత్వర ప్రతిస్పందన కోసం రైతుల ప్రాతినిధ్యంతో రాష్ట్ర స్థాయి రైతాంగ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి.

ఉపాధికి ఆర్థిక సహాయం అంటే రుణంతో పాటుగా సాంకేతికత, నిర్వహణ, మార్కెట్ల అందుబాటు, వంటి అంశాలలో సేవలను అందించే విధంగా సూక్ష్మ ఆర్థిక విధానాలను పునర్వ్యవస్థీకరించాలి. ప్రతి పంటకూ బీమాను వర్తింపచేయడం, దీనిని మూల్యాంకన చేసే యూనిట్‌గా బ్లాక్‌ను కాక గ్రామాన్ని ఆధారంగా చేసుకోవడం అవసరమని కమిటీ అభిప్రాయపడింది. వృద్ధాప్య తోడ్పాటు, ఆరోగ్య బీమా ప్రొవిజన్‌తో సామాజిక భద్రతను కల్పించాలి. చెరువులకు పునర్ వైభవం తేవాలి. పానీ పంచాయితీలుగా జల స్వరాజ్‌ను సాధించే లక్ష్యంతో ప్రతి గ్రామం పని చేయాలి. నాణ్యమైన విత్తనాలు, ఇతర ఎరువులు సరైన సమయంలో, సరైన ప్రదేశంలో సరసమైన ధరలలో అందుబాటులో ఉంచాలి. రైతులకు గరిష్ట ఆదాయాన్ని అందించే తక్కువ రిస్కు, తక్కువ ఖర్చుతో కూడిన సాంకేతికతలను సూచించాలి. ఎందుకంటే, బీటి పత్తి వంటి అత్యధిక ఖర్చుతో కూడిన సాంకేతికతలను ఉపయోగించిన రైతులు పంట విఫలమైతే తేరుకోలేరు. మెట్ట ప్రాంతాలలో జీలకర్ర వంటి జీవనాధార పంటలకు మార్కెట్ జోక్యానికి సంబంధించిన పథకాలు కావాలి. ధరల హెచ్చు తగ్గుల నుంచి రైతులను కాపాడేందుకు ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలని కమిటీ కోరింది. ఈ సిఫారసు ఎంతో ఆదరణ పొందింది. అంతర్జాతీయ ధరల నుంచి రైతులను సంరక్షించేందుకు దిగుమతి సుంకాలపై తక్షణ చర్యలు తీసుకోవాలి. రైతాంగ సంక్షోభం ఏర్పడిన ప్రదేశాలలో గ్రామ విజ్ఞాన కేంద్రాలు లేదా జ్ఞాన్ చౌపల్‌ల ఏర్పాటు చేయాలి. ఇవి వ్యవసాయం, వ్యవసాయేతర ఉపాధులకు సంబంధించి డిమాండ్ ఉన్న విషయాల గురించి సమాచారమివ్వడమే కాకుండా, మార్గదర్శక కేంద్రాలుగా కూడా పని చేస్తాయి. ఆత్మహత్య పోకడలను త్వరగా గుర్తించేందుకు ప్రజా అవగాహనా ప్రచారాలు నిర్వహించాలి.

రైతులలో పోటీతత్వాన్ని ప్రోత్సహించేందుకు కనీస మద్దతు ధరల అమలును మెరుగుపరచాలని కమిషన్ సిఫారసు చేసింది. వరి, గోధుమలకే కాక ఇతర పంటలకు కూడా మద్దతు ధరను కల్పించేందుకు ఏర్పాట్లు చేయాలని కూడా చెప్పింది. అలాగే, చిరుధాన్యాలను, ఇతర పోషకాహార పప్పు దినుసులను పిడిఎస్‌లో శాశ్వతంగా జోడించాలి. సగటు ఉత్పత్తి వ్యయం కంటే ఎంఎస్‌పీ 50శాతం ఎక్కువగా ఉండాలి. మార్కెటింగ్, నిల్వ, వ్యవసాయ ఉత్పత్తి శుద్ధి వంటివన్నీ కూడా గ్రేడింగ్, బ్రాండింగ్, ప్యాకేజింగ్‌ను ప్రోత్సహించి, స్థానిక ఉత్పత్తులకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లను సృష్టించడం ద్వారా భారతీయ మార్కెట్ ఒకే దిశగా పయనించేందుకు రాష్ట్ర వ్యవసాయ ఉత్పత్తి మార్కెటింగ్ కమిటీ చట్టాలు (ఎపిఎంసి చట్టాలు)



మన్మోహన్ సింగ్ నుంచి పురస్కారం...

భారతదేశంలో కార్మికులకు సంబంధించిన వ్యవస్థాగత మార్పులు చాలా నిదానంగా జరుగుతున్నాయి. 1961లో వ్యవసాయంలో ఉన్న కార్మికశక్తి 75.9 శాతం కాగా, 1999-2000 నాటికి అది 59.9శాతానికి పడిపోయిన సంగతితో ఇది అర్థమవుతుంది. గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయమే



ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా..

అత్యధికంగా ఉపాధిని కల్పించే రంగం. కనుక, భారతదేశంలో ఉపాధి వ్యూహం ద్విముఖంగా ఉండాలని స్వామినాథన్ కమిషన్ అభిప్రాయపడింది. ఇందుకు ఆర్థిక వ్యవస్థ వృద్ధిని వేగవంతం చేయాలి. కార్మిక శక్తి ఎక్కువ అవసరం అయిన రంగాలపై దృష్టి పెట్టి, ఈ రంగాలు వేగంగా వృద్ధి చెందేలా చూడాలి. మౌలిక కార్మిక ప్రమాణాలకు చేటు లేకుండా అవసరమైన మార్పులు చేసి కార్మిక మార్కెట్ల పనితీరును మెరుగుపరచాలి. అలాగే వ్యవసాయేతర ఉపాధిని ప్రోత్సహించేందుకు వాణిజ్యం, రెస్టారెంట్లు, హోటళ్లు, రవాణా, నిర్మాణం, మరమ్మతులు, నిర్దిష్ట సేవలలో ఉపాధి అవకాశాలను అభివృద్ధి చేయాలి. రైతులు ఇంటికి తీసుకువెళ్లే నికర ఆదాయం, ప్రభుత్వోద్యోగులతో పోల్చదగినదిగా ఉండాలి.

**జీవవనరులు**

తమ పౌష్టికాహారం కోసం, ఉపాధి భద్రత కోసం భారతదేశంలోని గ్రామీణ ప్రజలు విస్తృతమైన స్థాయిలో జీవవనరులపై ఆధారపడతారు. అందుకు



ప్రతిభా పాటిల్ నుంచి పురస్కారం..

స్వామినాథన్ నివేదిక ఇలాంటి సూచనలు చేసింది. ఔషధ మొక్కలు, చమురు దిగుబడినిచ్చే మొక్కలు, లాభదాయకమైన సూక్ష్మజీవులు సహా కలపయేతర అటవీ ఉత్పత్తులకు వంటి జీవవైవిధ్యంలో ప్రాముఖ్యం కలిగి ఉన్న సంప్రదాయ హక్కులను పరిరక్షించాలి. పంటలను, వ్యవసాయానికి ఉపయోగపడే జంతువులతో పాటు, చేపల పెంపకం సహా పరిరక్షించడం పెంచడం జరగాలి. దేశీయ జాతులను ఎగుమతి చేయడం, ఉత్పత్తిని పెంచుకునేందుకు తగిన జాతులను దిగుమతి చేసుకోవడం ద్వారా సంకర జాతి పశువుల ఉత్పాదకతను పెంచేందుకు అనుమతించాలి కూడా.

**స్వామినాథన్‌ను వరించిన అవార్డులు, బిరుదులు**

భారతదేశ హరిత విప్లవ పితామహుడిగా మన్ననలు అందుకున్న స్వామినాథన్ మొట్టమొదటి వరల్డ్ ఫుడ్ ప్రైజ్‌ను 1987లో అందుకున్నారు. అందులో భాగంగా ఇచ్చిన 250,000 డాలర్ల ధనాన్ని ఆయన చెన్నైలో తారామణిలో ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ ఏర్పాటుకు ఉపయోగించారు. ఇది వ్యవసాయ పరిశోధనపై ప్రపంచ స్థాయి సంస్థ మాత్రమే కాదు థింక్ ట్యాంక్ కూడా. ప్రజాసేవకు భారతదేశంలో ఇచ్చే అత్యున్నత పురస్కారాలు అయిన పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్‌ను పొందిన స్వామినాథన్‌కు దాదాపు 90 గౌరవ డాక్టరేట్లు ఉన్నాయి. స్వతంత్రం రాక ముందు ప్రపంచమంతా కూడా భారత్‌కు గౌరవ మర్యాదలు ఉండేవంటే అందుకు కారణం మన శాస్త్రవేత్తలు, కళాకారులు. సంక్షోభాలతో నిండిన స్వతంత్ర భారతావని కూడా శాస్త్రసాంకేతిక రంగాలలో వెనకబడిపోకుండా ఉండడానికి కూడా కారణం వారే. సీవీ రామన్, శ్రీనివాస రామానుజన్, జేసీ బోస్, హెూమీ జే బాబా, ఏపీజే అబ్దుల్ కలాం వంటివారు ఈ ప్రతిష్టను నిలిపారు. ఆ కోవలోని వారే డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్. ★

# మన వనౌషధి సంపద – మన పశు సంపద

సువిశాలమైన మన దేశంలో భూసార, వాతావరణ పరిస్థితులలో విపరీతమైన మార్పు ఉండటంవల్ల, ఏ ఇతర దేశాలలోనూ లేనన్ని వృక్షజాతులు ఇక్కడ ఉన్నాయి. ఇటువంటి వృక్షజాతులు సుమారు 20,000 మన దేశంలో ఉన్నట్లు అంచనా వేశారు. భారతదేశం కంటే విస్తీర్ణంలో పెద్దదైన ఏ ఇతర దేశంలోనూ ఇన్ని వృక్షజాతులు లేవు.

ఉష్ణమండలం, ఉప ఉష్ణమండలం , సమశీతోష్ణ మండలం ప్రాంతాలు మన దేశంలో ఉండటం వల్ల ఇన్ని వృక్షజాతులు వృద్ధి చెందే అవకాశం కలిగింది. అంతేకాక, పగటి, రాత్రి ఉష్ణోగ్రతలలో వ్యత్యాసం, వేసవి, శీతాకాలాల మధ్య శీతోష్ణ పరిస్థితులలో విపరీతమైన భేదం కూడా ఇన్ని వృక్షాలు, వనస్పతులు వృద్ధి చెందేందుకు కారణమయ్యాయి.

మన దేశంలో కలపనిచ్చే సుమారు 4,000 రకాల చెట్లు ఉన్నాయి. వీటిలో 50 రకాలు అత్యంత ఉపయోగకరమైన కలపనిస్తున్నాయి. మన అడవుల నుంచి సాలీనా 129 లక్షల ఘన మీటర్ల వంటచెరుకుగా పనికివచ్చే కర్ర, 89 లక్షల ఘనమీటర్ల పారిశ్రామికోపయోగాలకై పనికి వచ్చే మేలైన కర్ర లభిస్తోంది.

అటవీ ప్రాంతాలలోనూ, ఏజెన్సీ ప్రాంతాలలోనూ నివసించే జాతులు సుమారు 500 రకాల వృక్షజాతులను వివిధ దైనందిన ఉపయోగాలకై వినియోగించుకుంటున్నాయి.

ఇక వ్యవసాయం ద్వారా తోటలను పెంచి, వృద్ధి చేస్తున్న వృక్షజాతులు సుమారు 250 వరకు ఉన్నాయి. ఇవిగాక, వరి, చెరకు, ఆవ, పత్తి, జనుము, వివిధ రకాల కాయధాన్యాలు, వంగ, దోస, ఆనప, పెండలం, మిరియాలు, పసుపు, మామిడి, అరటి, నిమ్మ, పనస, ఉసిరి, నేరేడు మొదలైన ఫలజాతులు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి. కొత్త ప్రపంచం అని పిలిచే ఉత్తర, దక్షిణ అమెరికాల నుంచి ప్రవేశపెట్టిన మొక్కజొన్న, మిరప, బంగాళదుంప, దోస రకాలలో కూడా అనేక కొత్త రకాలను మన దేశంలో రూపొందించారు.

ఈశాన్య హిమాలయ ప్రాంతంలో వరి, మొక్కజొన్న, నిమ్మరకాలలో లెక్కకు మిక్కుటమైన జాతులు ఉన్నాయి. గారో కొండలలో పొడవైన కాయలు ఉండే ప్రత్తి రకం ఒక విశేషమని చెప్పాలి. మేఘాలయలోని జొవాయ్ అనే ప్రాంతంలో సుమారు 100సంవత్సరాల నుంచి కాపు కాచే చీనా నారింజ రకాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా సరిహద్దులలో ఉండే జయపుర ప్రాంతంలో అనేక వరి రకాలను పండిస్తున్నారు. అమూల్యమైన ఔషధి జాతులను కూడా అడవుల నుంచి సేకరించి, ఒక క్రమపద్ధతిలో పండించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

మన వృక్ష సంపదవలెనే పశుసంపద కూడా అపారమైంది. 1966 లెక్కల ప్రకారం 1760 లక్షల పశువులు, 580 లక్షల గేదెలు, దున్నలతో సహా మొత్తం 3440 లక్షల జంతువులు మనకే ఉన్నాయి.

మనకు లభ్యమయ్యే పాలలో 60 శాతానికి పైగా 234 లక్షల ఆవులు, గేదెల నుంచి లభిస్తున్నాయి. అయితే, వీటిలో అత్యధికంగా పాలిచ్చే ఆవులు, గేదెలు యూరప్, అమెరికా దేశాలలో విరివిగా పాలిచ్చే ఆవులు, గేదెల దిగుబడిలో 4వ వంతు పాలను మాత్రమే ఇస్తున్నాయి.

ప్రపంచంలోని గొర్రెలలో 42 శాతం గొర్రెలు మన దేశంలో ఉన్నాయి. 1966 లెక్కల ప్రకారం మన దేశంలో 420 లక్షల గొర్రెలు ఉన్నట్లు తేలింది. వీటిద్వారా ఉన్ని, మాంసం, పాలు లభించటమే కాక, 155 లక్షల యూనిట్ల చర్మాలు, 21 లక్షల యూనిట్ల ఎరువు లభిస్తోంది.

మన కోళ్ల సంపద కూడా విస్తారమైనదే. 1966 లెక్కల ప్రకారం మన దేశంలో సుమారు 1100 లక్షల కోళ్లు ఉన్నాయి.

మన వ్యవసాయ పనులకై పశువుల ద్వారా రోజుకు 280 లక్షల హార్స్‌పవర్ శక్తి లభిస్తోంది. ఆంధ్రప్రదేశ్, పంజాబ్, హరియాణా, తమిళనాడు మొదలైన రాష్ట్రాలలో మేలైన పశువుల జత ద్వారా 8 గంటలు పని చేసిన ఆ రోజుకు ఒక హార్స్‌పవర్ శక్తి వంతున లభిస్తోంది. అదే తూర్పు ప్రాంతపు రాష్ట్రాలలో దానిలో సగం శక్తి మాత్రమే లభిస్తోంది. హెక్టారు నేలకు 2 టన్నుల పంటను పండించాలంటే సగటున రోజుకు 3/4 హార్స్ శక్తి కావలసి ఉంటుంది.

**(పటేల్ స్మారకోపన్యాసం నుంచి/ 9.9.1974 జాగృతి)**

## నెల్లూరు జిల్లా జ్యేష్ఠ కార్యకర్త వేణుగోపాలరెడ్డికి నివాళి



నెల్లూరు జిల్లా జ్యేష్ఠ స్వయంసేవక్ తమ్మిరెడ్డి వేణుగోపాలరెడ్డి సెప్టెంబర్ 29న చెన్నైలో తుదిశ్వాస విడిచారు.ఆయన పాత నెల్లూరు విభాగ్ కార్యవాహ, విభాగ్ సంఘచాలక్ సేవలందించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం సెనేట్ సభ్యునిగా, గూడూరు తాలూకా, గోవిందపల్లి గ్రామ సర్పంచ్‌గా సేవలందించారు. 1950 దశకంలో నెల్లూరు పట్టణ ప్రచారక్‌గా కీ.శే. సోమయ్య, జిల్లా ప్రచారక్‌గా దేశ్‌పాండే (నాగపూర్) ఉండేవారు. వారితో వేణుగోపాలరెడ్డి సన్నిహితంగా ఉంటూ జిల్లా సంఘ అభివృద్ధికి పాటుపడ్డారు.నెల్లూరు జిల్లాలో సంఘ్ కార్యానికి బలమైన పునాదులు వేసిన వారు స్వర్గీయ దేశ్‌పాండే. ఆ పునాదులపై సంఘానికి స్థిర రూపం ఇచ్చిన వారు ఆనాటి జిల్లా ప్రచారకులు సోమేపల్లి సోమయ్య. వైసి రంగారెడ్డి, సూరారెడ్డి,తమ్మిరెడ్డి వేణుగోపాలరెడ్డి, పరంధామరెడ్డి, యరగుడిపాటి నరసయ్య, సవెరా మొదటితరం స్వయంసేవకులు. జీవితాంతం పనిచేసిన ప్రముఖులు. సంఘ్‌ను మొదటిసారి నిషేధించినప్పుడు ఒక బృందంతో కలసి వేణుగోపాలరెడ్డి సత్యాగ్రహం చేశారు. ఆయనతో పాటు సత్యారావు, చెంగయ్య, ఆర్.సుబ్బయ్య వంటివారిని కూడా పోలీసులు తీసుకుపోయి గుంటూరు జిల్లా, మాచర్ల అటవీప్రాంతంలో చొక్కాలు విప్పించి బాగా కొట్టి అర్ధరాత్రి వదలిపెట్టారు. మొదటి నిషేధ సమయంలో వివేకానంద స్పోర్ట్స్ క్లబ్ అని పేరుతో వేణుగోపాలరెడ్డి స్వయంసేవకులను కలుస్తుండేవారు. 1973లో ప.పూ.శ్రీ గురూజీ దివంగతులైనప్పుడు 40వ రోజున నాగపూర్‌లో జరిగిన శ్రద్ధాంజలి సభకు నెల్లూరు విభాగ్ తరపున ఆయనే హాజరయ్యారు.

1975 అత్యవసర పరిస్థితి విధింపునకు ముందు ఆ నాటి నెల్లూరు విభాగ్ (ప్రకాశం, నెల్లూరు,చిత్తూరు జిల్లాలకు) కార్యావాహగా, అనంతరం విభాగ్ సంఘ్ చాలక్‌గా వేణుగోపాలరెడ్డి పనిచేశారు. వారు నిరంతర అధ్యయనశీలి. ప్రజా సంబంధాలు కొనసాగించడంలో దిట్ట. కేంద్ర ప్రతినిధిగా ఎక్కువ సంవత్సరాలు ప్రతినిధి సభకు హాజరయ్యారు. పైకి మితభాషిగా అనిపించినా కొన్ని అంశాలు లోతుగా నిర్మోహ మాటంగా చర్చించేవారు. దూరదృష్టి, ప్రశాంత చిత్తంతో దేశ రాజకీయ పరిస్థితులను విశ్లేషిస్తూ నిర్మాణాత్మక అభిప్రాయాలను వెల్లడించగల బుద్ధిజీవి. ఆ రోజుల్లోనే గూడూరు తాలూకా నుండి వై.సి. రంగారెడ్డి(ఎమ్.ఎల్.సి), బండి వెంకురెడ్డి ప్రచారకులుగా వచ్చారు. ఇబ్బందుల్లో ఉన్న కార్యకర్తలను సాయం అందిస్తూ అందరి ఆదరాభిమానాలు పొందిన వేణుగోపాలరెడ్డి ఆత్మకు సద్గతులు కలగాలని ఆశిద్దాం.



# తమిళ తెరపై కొత్తచిత్రం

**రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరు. శాశ్వత ప్రయోజనాలు మాత్రమే ఉంటాయి. రాజకీయ ప్రయోజనాలు, అవసరాలు మాత్రమే రాజకీయ శత్రుమిత్ర సంబంధాలను నిర్దేశిస్తాయి. అవసరం అనుకుంటే మూడుముళ్లు వేస్తుంటాయి, వేసిన ముళ్లను విడదీస్తుంటాయి. ఎన్నికల పొత్తుల గురించి, అందరూ ఏకాభిప్రాయంతో అంగీకరించే మూల సూత్రాలలో ఇదొకటి.**

అయితే, ఇప్పుడు తమిళనాడులో అన్నా డీఎంకే, బీజేపీల మధ్య తెగిన బంధం కూడా అంతేనా అంటే, అంతే. కాదంటే కాదు.. అనే విశ్లేషణలు వినిపిస్తు న్నాయి. స్థూలంగా చూస్తే అంతే. సూక్ష్మంగా చూస్తే కాదు. అవును, సాధారణ పొత్తులు, తెగతెంపుల తంతుకు; అన్నా డీఎంకే, బీజేపీతో తెగతెంపులు చేసుకుని, ఎన్డీఏ నుంచి వైదొలుగుతూ తీసుకున్న నిర్ణయానికి మధ్య కొంత తేడా ఉందని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు.

సహజంగా, రెండు పార్టీల మధ్య ఎన్నికల పొత్తు ఏర్పడినప్పుడు, లేదా పొత్తులు తెగిపోయినప్పుడు, ఆ ప్రభావం ఆ రెండు పార్టీలపై మాత్రమే ఉంటుంది. ఆ పార్టీల జయాపజయాలను మాత్రమే అది ప్రభావితం చేస్తుంది. కానీ, ఇప్పుడు అన్నా డీఎంకే తీసుకున్న నిర్ణయం ప్రభావం ఆ రెండు పార్టీలకు మాత్రమే పరిమితం కాదు. ఒక విధంగా చూస్తే, రాష్ట్ర రాజకీయ స్వరూప, స్వభావాలపైనా, సైద్ధాంతిక పునాదులపైనా ప్రభావం చూపబోవడమే ఇప్పుడు చర్చ. అంతేకాదు, ఈ తెగిన బంధం రాష్ట్ర రాజకీయ కథా కథనాన్ని, కథా గమనాన్ని (స్టేట్స్ పొలిటికల్ నెరిటీవ్) ప్రభావితం చేస్తుందని విశ్లేషకులు అంటున్నారు. ఇంతవరకు తమిళ రాజకీయాలను శాసిస్తున్న ద్రవిడ రాజకీయాలకు, బీజేపీ హిందూ జాతీయ వాదం ఒక ప్రత్యామ్నాయంగా తెరపైకొచ్చింది.

ఈ నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కుమారుడు, రాష్ట్ర మంత్రి ఉదయనిధి స్టాలిన్ లేవనెత్తిన 'సనాతనధర్మ' వివాదానికి కొనసాగింపుగా చోటు చేసుకున్న అన్నా డీఎంకే–బీజేపీ పొత్తు రద్దు వ్యవహార ప్రభావం కేవలం ఆ రాష్ట్ర రాజకీయాలపైనే కాదు, జాతీయ రాజకీయాలపైనా ఉంటుందని అంటున్నారు.

**ద్రవిడమే ..**

ఎవరు ఔనన్నా, కాదన్న తమిళనాడు రాజకీయాలు, జాతీయ రాజకీయాలకు కొంత భిన్నంగా, దూరంగా ఉంటాయనేది కాదనలేని నిజం. ముఖ్యంగా ద్రవిడ రాజకీయ పార్టీలు, అవసరార్థం జాతీయ పార్టీలతో పొత్తులు పెట్టుకున్నా జాతీయ భావజాలంతో మమేకం అయిన సందర్భాలు లేవు. రాజాజీ, కామరాజ్ వంటి జాతీయనేతల కాలంలో తమిళ, జాతీయ రాజకీయాల మధ్య మరీ ఇంత దూరం లేదు. ముఖ్యంగా, 1965 హిందీ (హిందూ) వ్యతిరేక ఆందోళన నేపథ్యంగా ద్రవిడ వాదం బలపడిన తర్వాత, తమిళనాడు రాజకీయాలలో ప్రాంతీయవాదం, బలం పుంజుకుంది. అలాగే, తమిళ రాజకీయాల్లో బ్రాహ్మణ (హిందూ) వ్యతిరేక నాస్తికవాదం, వ్యక్తి ఆరాధన (పర్సనాలిటీ కల్ట్) వంటి ప్రత్యేకతలు పెద్దపీట వేసుకు కూర్చున్నాయి. ఈ నేపథ్యంలోనే 1967లో దేశంలోనే మొట్ట మొదటి ప్రాంతీయ పార్టీ ప్రభుత్వం మద్రాస్ (తమిళనాడు) రాష్ట్రంలో కొలువు తీరింది. ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే) అధికారంలోకి వచ్చింది. ఇక అప్పటి నుంచి రాష్ట్రంలో ద్రవిడ రాజకీయమే రాజ్యమేలు తోంది. గడచిన మూడు దశాబ్దాల కాలంలో కరుణానిధి, జయలలిత వంతుల వారీగా అధికారాన్ని పంచుకున్నారు.

ఆ ఇద్దరూ కాలం చేసినా, ద్రవిడ పార్టీలదే పైచేయిగా ఉంది. అంతే కాదు, డీఎంకే, అన్నా డీఎంకేలతో పాటుగా మరో డజనుకు పైగానే, ఉప ప్రాంతీయ పార్టీలు కీలకంగా ఉన్నాయి. ఇందులో పరిమిత స్థాయిలోనే అయినా, ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయగల పార్టీలు కూడా ఉన్నాయి. ఎన్ని ప్రాంతీయ, ఉప ప్రాంతీయ పార్టీలున్నా, అన్ని పార్టీల సూత్రం మాత్రం ఒక్కటే– ద్రవిడవాదం. అయితే, ఇటీవల కాలంలో తమిళ ప్రజలు మార్పును కోరు కుంటున్న సంకేతాలు స్పష్టమవుతూ వస్తున్నాయి.

**బీజేపీ ప్రత్యేక దృష్టి**

తమిళనాడుపై పట్టు బిగించేందుకు గతంలో జాతీయ పార్టీలు ఎందుకనో గట్టి ప్రయత్నాలు పెద్దగా

చేయలేదు. ద్రవిడ పార్టీలతో పొత్తులకే పరిమిత మయ్యాయి. కాగా, ఇటీవల కాలంలో బీజేపీ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, ఆ దిశగా అడుగులతో మొదలు పెట్టి పరుగులు తీస్తోంది. ఈ నేపథ్యంలో అన్నా డీఎంకే, బీజేపీతో తెగతెంపులు చేసుకోవడం అనూహ్య పరిణామం కాదు. నిజానికి, గత కొంత కాలంగా చోటు చేసుకుంటున్న పరిణామాలను గమనిస్తే, ఆ రెండు పార్టీల పొత్తు ఎప్పుడైనా పుటుక్కుమనవచ్చనే ఊహాగానాలు వినిపిస్తూనే ఉన్నాయి. చివరకు అదే జరిగింది.

అయితే, పొత్తు విచ్ఛిత్తికి, అన్నా డీఎంకే నేతలు చెపుతున్నట్లుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, ద్రవిడ పార్టీ పూర్వ నేతలు పెరియార్ రామ స్వామి, ఎంజీఆర్, జయలలిత.. ప్రస్తుత పార్టీ ప్రధాన కార్యదర్శి పళనిస్వామిని ఉద్దేశించి చేసిన విమర్శలు, ఇందుకు సంబంధించి తాము చేసిన ఫిర్యాదుల విషయంలో బీజేపీ జాతీయ నాయకత్వం చూపుతున్న ఉదాసీన వైఖరి కారణమా? లేక అన్నామలై దూకుడు, ఆయన సారథ్యంలో బీజేపీ అనూహ్యంగా ఎదుగు తున్న తీరు కారణమా? అంటే, అదీ, ఇదీ ఏది కారణం అయినా, అన్నా డీఎంకే తీసుకున్న నిర్ణయంతో, జయలలిత మరణం తర్వాత, ఆ పార్టీ ఎదుర్కొన్న అంతర్గత సంక్షోభం నేపథ్యంగా, ఇరుపార్టీల మధ్య ఏర్పడిన స్నేహబంధం ముగిసింది.

ఇప్పుడు అసలు ప్రశ్న అది కాదు. ఎన్నికల పొత్తులు వస్తుంటాయి, పోతుంటాయి. గతంలో అటల్ బిహారీ వాజపేయి ప్రభుత్వాన్ని ఒక్క ఓటు తేడాతో పడగొట్టడంలో కీలక పాత్ర పోషించిన అన్నా డీఎంకేనే, జయలలిత చనిపోయిన తర్వాత, అంతర్గత సంక్షోభం నుంచి బయటపడి, అధికారాన్ని నిలుపుకునేందుకు బీజేపీని శరణు వేడింది. ఇప్పుడు అదే అన్నా డీఎంకే, మిత్రపక్షం ఎదుగుదలను జీర్ణించుకోలేక, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై మిత్రధర్మాన్ని పాటించడం లేదనే ఆరోపణను సాకుగా చూపి, స్నేహబంధాన్ని తెగతెంపులు చేసుకుంది.

అయితే, అన్నామలై ఎప్పుడో చేసిన వ్యాఖ్యలు లేదా విమర్శలకు ఇంత కాలానికి స్పందించడం ఏమిటి? అంటే, ఆ 'అన్నా' నేతల నుంచి సరైన సమాధానం లేదు. అప్పుడలా, ఇప్పుడిలా అంటూ ఏవేవో పాతముచ్చట్లు ఏకరవు పెడుతున్నారే కానీ 'క్లియర్ కట్'గా 'ఇదిగో ఇదీ కారణం, అన్నామలై సారథ్యంలో బీజేపీ ఎదుగుదలే తెగతెంపులకు అసలు కారణం'అనే నిజాన్ని, అన్నా డీఎంకే నేతలు ఎందుకనో నిర్భయంగా చెప్పలేక పోతున్నారు.

**దూకుడు కారణమా?**

అన్నా డీఎంకే కొంత కాలంక్రితం బీజేపీ ముఖ్య కార్యకర్తలు కొందరిని ప్రలోభ పెట్టి తమ పార్టీలో చేర్చుకోవడం ద్వారా మిత్రధర్మం గీత దాటింది. కాని, 'మొగుడిని కొట్టి మొగసాలకు ఎక్కినట్లు' ఆ పార్టీ నేతలు అసలు నిజాలను దాచి పెట్టి, బీజేపీనే మిత్రధర్మం పాటించడం లేదని ఆరోపిస్తున్నారు. తెగతెంపులకు అదే కారణంగా చూపిస్తున్నారు.

ఆ పార్టీ నేతలు చెబుతున్న, చూపుతున్న కారణాలు ఏవైనా, అసలు కారణం మాత్రం రాష్ట్రంలో బీజేపీకి పెరుగుతున్న ప్రజాదరణ. ముఖ్యంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై దిగ్విజయంగా సాగిస్తున్న పాదయాత్రకు లభిస్తున్న ప్రజాదరణ మింగుడు పడకనే అన్నా డీఎంకే, బీజేపీతో తెగతెంపులు చేసుకుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అంచెలంచెలుగా సాగుతున్న అన్నామలై పాదయాత్ర, అన్నా డీఎంకేకు పట్టున్న ప్రాంతాల్లోనూ ప్రభంజనం సృష్టిస్తోంది.

మరోవంక, 2021 ఎన్నికల్లో అధికారం కోల్పోయిన అనంతరం, అన్నా డీఎంకేలో అంతర్గత విభేదాలు పతాక స్థాయికి చేరాయి. మాజీ ముఖ్యమంత్రి పళనిస్వామి, మాజీ ఉప ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం వర్గాల మధ్య విభేదాలు కోర్టు వరకు వెళ్లాయి. చివరకు పళనిస్వామి పార్టీపై పట్టు సాధించినా, పన్నీర్ సెల్వంను పార్టీ నుంచి బయటకు




పంపినా, పార్టీలో అంతర్గత విభేదాలు సద్దుమణగ లేదు. మరోవంక జయలలిత సన్నిహిత సహచరి శశికళ, జయలలిత మేనల్లుడు దినకరన్ తమ రాజకీయాలు తాము చేస్తున్నారు. బీజేపీకి దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే పన్నీర్ సెల్వం వర్గం కూడా బీజేపీకి దగ్గరయ్యే ప్రయత్నాలు సాగిస్తోంది. మరోవంక అన్నామలై పాదయాత్ర పళనిస్వామికి కంటిలో నలుసు, కాలిలో ముల్లులా బాధిస్తోంది. అయితే, అన్నా డీఎంకే నేతలు మాత్రం, అన్నామలై మిత్రధర్మాన్ని పాటించక ఒంటరిగా ఎదిగే ప్రయత్నం చేస్తున్నారని, అందుకే, విడిపోతున్నామని అంటున్నారు.

**ఎవరికి లాభం ?**

అదలా ఉంటే ఎన్డీఏ నుంచి అన్నా డీఎంకే వైదొలగడం వలన ఎవరికి లాభం? ఎవరికి నష్టం? అని విశ్లేషిస్తే... ఇప్పటికిప్పుడు ఎలా ఉన్నా, దీర్ఘకాలంలో ప్రయోజనం బీజేపీకే అని విశ్లేషకుల అభిప్రాయం. కొంతకాలంగా, రాష్ట్ర రాజకీయాల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలను గమనిస్తే, 'మార్పు' కనిపిస్తోంది. ముఖ్యంగా, కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో, బీజేపీ/ ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం, ప్రజల



రాజనాల బాలకృష్ణ

ఆలోచనా ధోరణిలో మార్పు చోటు చేసుకుంది. మోదీకి ప్రజాదరణ పెరుగుతూ వస్తోంది. కరుణానిధి, జయలలిత అనంతర కాలంలో ఆ స్థాయిలో ప్రజాదరణ మోదీకి మాత్రమే లభిస్తోంది. ఆయన బహిరంగ సభలకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరవుతున్నారు. మరోవంక కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రయోజనాలు ప్రజలకు చేరుతున్నాయి. దీంతో బీజేపీకి ఆదరణ పెరుగుతోంది. ఆ మేరకు, ద్రవిడ ఓటు బ్యాంకు తరుగుతూ వస్తోంది.

'కలిసొచ్చే కాలమొస్తే నడిచొచ్చే కొడుకు పుడతాడు' అన్నట్లుగా, రాష్ట్ర బీజేపీకి అన్నామలై అధ్యక్షుడిగా వచ్చారు. ఈ మాజీ ఐపీఎస్ అధికారి.. ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రభుత్వ అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా సాగిస్తున్న పోరాటం, బీజేపీని ప్రజలకు, మరీ ముఖ్యంగా యువతకు దగ్గర చేస్తోంది. డీఎంకే ప్రభుత్వ అవినీతిని సాక్ష్యాధారాలతో ఎండగడుతూ అన్నామలై విడుదల చేసిన, 'డీఎంకే ఫైల్స్' రాజకీయ ప్రకంపనలు సృష్టించాయి. ఈ విషయంలో అన్నామలై ద్రవిడ పార్టీ 'అమ్మ'గా ఆరాధించే మాజీ ముఖ్యమంత్రి, పురుచ్చితలైవి జయలలిత అవినీతినీ వదిలిపెట్టలేదు.

అన్నామలై చేస్తున్న పాదయాత్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఆయన మాటల్లోనే చెప్పాలంటే...తక్షణ రాజకీయ ప్రయోజనాలను ఆశించి ఈ పాదయాత్ర చేపట్టలేదు. హిందూ జాతీయవాదాన్ని మరింత బలంగా జనంలోకి తీసుకువెళ్లే లక్ష్యంతోనే పాదయాత్ర చేస్తున్నారు. ఇదే సమయంలో సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని స్టాలిన్ కుమారరత్నం ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు ఓటర్లను బీజేపీకి అనుకూలంగా 'పోలరైజ్' చేస్తున్నాయి. దీంతో రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం మెల్లమెల్లగా ద్విముఖ రూపం నుంచి త్రిముఖ రూపంగా మారుతోంది. ద్రవిడ రాజకీయ పునాదులలో కదలిక మొదలైంది. అందుకే, ఉదయనిధి, తమిళ ప్రజల్లో బలంగా నాటుకు పోయిన ద్రవిడ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టేందుకు, ఉద్దేశపూర్వకంగానే సనాతన ధర్మాన్ని దూషించారు. ఆ భయంతోనే, అన్నాడీఎంకే, బీజేపీతో తెగతెంపులు చేసుకుంది. ఇది ఒకరకంగా బీజేపీకి మాజీ మిత్రపక్షం ఇచ్చిన వరంగా పరిశీలకులు పేర్కొంటున్నారు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్



# మోదీ వరా రాష్ట్రానికి

**కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని నడిపిస్తోన్న భారతీయ జనతా పార్టీ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు సమర శంఖారావం పూరించింది. పాలమూరు వేదికగా ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. 'పాలమూరు ప్రజాగర్జన' బహిరంగ సభలో పాల్గొన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచారానికి నాంది పలికారు. ఆ తర్వాత రెండు రోజులకే నిజామాబాద్‌లోనూ బహిరంగసభలో పాల్గొన్నారు.రాష్ట్రంలోని ఇతర పార్టీలు అధికారమే పరమావధిగా పనిచేస్తున్నాయి తప్ప ప్రజల గోడును పట్టించుకోవడం లేదని పాలమూరు బహిరంగ సభలో ప్రధాని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి పలు వరాలు ప్రకటించారు. ప్రధానంగా దశాబ్దాలుగా ఊరిస్తోన్న పసుపుబోర్డును రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే, దేశంలోనే అతిపెద్ద గిరిజన విశ్వవిద్యాలయాన్ని మేడారంలో ఏర్పాటు చేయనున్నట్లు ప్రధానమంత్రి జనం హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఈ కీలక ప్రకటనలు అదీ.. సాక్షాత్తూ ప్రధానమంత్రి స్వయంగా చేయడం తెలంగాణలో రాజకీయంగా బీజేపీకి ఫాలోయింగ్‌ను పెంచింది.**

పాలమూరు జిల్లాలో పర్యటించిన ప్రధాని నరేంద్ర మోదీ.. 'నా కుటుంబ సభ్యులారా!' అంటూ తెలుగులో తన ప్రసంగాన్ని మొదలు పెట్టారు. "తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది. తెలంగాణలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించడం ఆనందంగా ఉంది. ఈ రాష్ట్రంలో రోడ్డు, రైలు కనెక్టివిటీ పెంచాల్సిన అవసరముంది. తెలుగు రాష్ట్రాలకు మహారాష్ట్ర మధ్య రవాణా సదుపాయాలు మెరుగవుతాయి. కొత్త ప్రాజెక్టుల్లో 5 మెగా ఫుడ్ పార్క్‌లు, 4 ఫిషింగ్ క్లస్టర్స్ నిర్మిస్తాం'' అని ప్రకటించారు. తెలంగాణ ప్రజల కోసం తాను రెండు ప్రతిష్ఠాత్మక నిర్ణయాలు ప్రకటించనున్నట్లు తెలిపారు. ఇక్కడ పసుపు విస్తృతంగా పండుతోందని చెప్పుకొచ్చిన నరేంద్ర మోదీ.. కరోనా తర్వాత పసుపు గొప్పదనం ప్రపంచానికి తెలిసిందని, పసుపు పంటపై పరిశోధనలు పెరిగాయని చెప్పారు.పసుపు రైతుల సంక్షేమానికి కేంద్రం కట్టుబడి ఉందంటూ, రాష్ట్రానికి పసుపు బోర్డు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.అలాగే ములుగు జిల్లాలో రూ.900 కోట్లతో ఆదివాసీల కొంగు బంగారం 'సమక్క సారక్క' పేరుతో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

రాష్ట్రంలో రూ.13,500 కోట్లతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, కేంద్రం చేపట్టిన పనులతో ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని ప్రధాని భరోసా ఇచ్చారు. 2014కు ముందు కేవలం 2400 కిలోమీటర్ల నేషనల్ హైవేలు ఉండేవని.. ఈ పదేళ్లలోనే బీజేపీ ప్రభుత్వం 2500 కిలో మీటర్ల నేషనల్ హైవేలను నిర్మించిందన్నారు. 'ప్రజలు మాటలతో మభ్యపెట్టే ప్రభుత్వానికి బదులు పని చేసే పారదర్శక ప్రభుత్వాన్ని కావాలను కుంటున్నారు. అవినీతి రహిత పాలన రావాలని కోరుకుంటున్నారు' అన్నారు. వచ్చే ఎన్నికల్లో చెప్పింది చేసే ప్రభుత్వమే రానుందంటూ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ అభివృద్ధిని రెండు పార్టీలు అడ్డు కుంటున్నాయంటూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై మోదీ నిప్పులు చెరిగారు.



నిజామాబాద్

ముఖ్యంగా బీఆర్ఎస్ పార్టీ లక్ష్యంగా.. పలు ఆరోపణలు చేశారు. తెలంగాణ ప్రభుత్వాన్ని ఎవరు నడుపుతున్నారో అందరికీ తెలుసని, బీఆర్ఎస్ కారు స్టీరింగ్ మరో పార్టీ చేతిలో ఉందన్నారు. అవినీతి, కమీషన్లకు పేరుగాంచిన ఆ రెండు కుటుంబాలు రాష్ట్రంలో ప్రభుత్వాన్ని నడుపుతున్నాయని విమర్శించారు. సామాన్య ప్రజల గురించి ఆ కుటుంబాలకు ఎలాంటి ఆలోచన లేదన్నారు. ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలు మాదిరిగా ప్రభుత్వాన్ని నడుపుతున్నాయని విమర్శించారు. ఆ కంపెనీలో డైరెక్టర్, మేనేజర్, సెక్రటరీ అన్ని పదవులు ఆ కుటుంబ సభ్యులవేనని ఎద్దేవా చేశారు. కొన్ని అవసరాల కోసం కొందరిని సహాయకులుగా నియమించుకున్నారని విమర్శించారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజాస్వామ్యాన్ని కుటుంబస్వామ్యంగా మార్చుతున్నాయని, 'కరప్షన్, కమీషన్' ఆ పార్టీల సిద్ధాంతమని నరేంద్రమోదీ ఆరోపించారు.

సామాన్యుల సంక్షేమం గురించి,వారి మెరుగైన


మహబూబ్ నగర్

సుజాత గోపగోని
6302164068

# ల జల్లు పసుపు బోర్డు

జీవన ప్రమాణాల గురించి బీజేపీ ఆలోచిస్తుందని ప్రధాని అన్నారు. అందుకే తెలంగాణలో తమ పార్టీకి రోజు రోజుకు ఆదరణ పెరుగుతోందని, నాలుగేళ్లలో బీజేపీని బలోపేతం చేశారని, రాష్ట్రంలో జరిగిన అన్ని ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని అన్నారు. తన హామీలపై తెలంగాణ ప్రజలకు భరోసా ఉందని, తాను హామీ ఇచ్చానంటే.. నెరవేర్చుతారన్న నమ్మకం వారిలో ఉందని,అందుకే రాష్ట్రంలో బీజేపీ అధికారానికి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. బీజేపీపై ప్రజల ప్రేమ చూసి కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు నిద్రపట్టదన్నారు

తెలంగాణ ప్రజల బతుకులు బాగుపర్చేందుకు బీజేపీ కట్టుబడి ఉందని, పేదలకు గ్యాస్, ఇళ్లు ఉచితంగా ఇస్తున్నామని మోదీ చెప్పారు. ఢిల్లీలో ఓ సోదరుడు ఉన్నాడనే నమ్మకాన్ని తెలంగాణ సోదరీమణులుకు కల్పించే ప్రయత్నం చేస్తున్నట్టు చెప్పుకొచ్చారు. మహిళల జీవితాలను మెరుగు పర్చేందుకు అనేక చర్యలు చేపడుతున్నానని, అందులో భాగంగానే మహిళా బిల్లును ఆమోదించు కున్నామన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను మభ్య పెడుతోందని, సాగునీటి పథకాల పేరుతో పెద్ద ఎత్తున దోపిడీ జరుగుతోందని నరేంద్రమోదీ ఆరోపించారు. సాగునీటి కాలువల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం గొప్పలకు పోతోంది కానీ.. ఆ కాలువల్లో అసలు నీరు ఉండదని విమర్శించారు. రైతు రుణమాఫీ హామీ ఇచ్చినా తెలంగాణ సర్కారు అమలు చేయలేదని, ఫలితంగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో తమ ప్రభుత్వం లేకున్నా.. రైతులను ఆదుకునే ప్రయత్నం చేస్తున్నామన్నారు. రైతుల కోసం రామగుండం ఫెర్టిలైజర్స్‌ను తెరిపించామని, సరసమైన ధరలకే ఎరువులను అందిస్తున్నామని చెప్పారు.

కళలు, సంస్కృతికి తెలంగాణ పెట్టింది పేరని, ఈ హస్తకళలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయని ప్రధాని గుర్తు చేస్తూ, ఈ కళలకు మరింత ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు. విశ్వకర్మ యోజన ద్వారా కులవృత్తులు, హస్తకళల వారికి ప్రోత్సాహం అందిస్తున్నామని చెప్పారు.. 'రాణి రుద్రమదేవి వంటి ధీరవనితలు పుట్టిన గడ్డ మనది. మహిళల గొంతు చట్టసభల్లో మరింత గట్టిగా వినిపించే రోజులు వస్తున్నాయి. మహిళా రిజర్వేషన్ల చట్టంతో చట్టసభల్లో మహిళల సంఖ్య మరింత పెరుగుతుంది. మహిళలు ఇల్లు కట్టుకుంటే కేంద్రం పీఎంఏవై నిధులు ఇస్తోంది. ఎలాంటి గ్యారంటీ లేకుండా ముద్ర బ్యాంకు ద్వారా వీధి వ్యాపారులకు రుణాలు ఇస్తున్నాం. 2014కు పూర్వం ధాన్యం కొనుగోళ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.3,400 కోట్లు మాత్రమే ఇచ్చింది. బీజేపీ ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లకు రూ.27 వేల కోట్లు ఇస్తోంది. తెలంగాణ రైతులను రాష్ట్ర ప్రభుత్వం దోపిడీ చేస్తోంది. రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి లబ్ధి పొందిన సర్కారు ఆ తర్వాత రైతులను విస్మరించింది. కానీ మేం పీఎం కిసాన్ ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నాం.' అని మోదీ వివరించారు.

ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు ప్రధాని నరేంద్ర మోదీ శ్రీకారం చుట్టారు. జాతీయ రహదారులు, రైలు మార్గాలు, పెట్రోలియం, సహజ వాయువు, ఉన్నత విద్యలకు సంబంధించి దాదాపుగా 13,500 కోట్ల రూపాయలకు పైగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. నాగపూర్–విజయవాడ ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా రోడ్డు ప్రాజెక్టుకు, 90 కిలో మీటర్ల పొడవైన ఫోర్ లైన్ యాక్సెస్‌తో కూడిన ఖమ్మం - విజయవాడ గ్రీన్ ఫీల్డ్ హైవే పనులకు ప్రధాని శ్రీకారం చుట్టారు. కృష్ణపట్నం–హైదరాబాద్ మల్టీ ప్రొడక్ట్ పైప్‌లైన్ శంకుస్థాపన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో కొత్త భవనాలు ప్రారంభించారు. హసన్–చర్లపల్లి హెచ్‌పీసీఎల్ ఎల్పీజీ పైప్‌లైన్, సూర్యాపేట–ఖమ్మం జాతీయ రహదారిని జాతికి అంకితం చేశారు.

తదుపరి రెండు రోజుల్లోనే నిజామాబాద్ జిల్లాలో పర్యటించిన ప్రధాని నరేంద్ర మోదీ.. అక్కడ కూడా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. నిజామాబాద్ పర్యటనలో 8 వేల 21కోట్ల అభివృద్ధి పనులను ప్రజలకు అంకితం చేశారు. రామగుండంలో నిర్మించిన 8 వందల మెగావాట్ల ఎన్టీపీసీ విద్యుత్ ప్లాంట్‌ను వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. అల్ట్రా సూపర్ క్రిటికల్ సాంకేతికతను ఈ ప్రాజెక్టులో ఉపయోగించారు. ఈ ప్రాజెక్టులో బొగ్గు వినియోగం తక్కువ, విద్యుత్ ఉత్పత్తి ఎక్కువగా ఉంటుంది. రూ. 1360 కోట్లతో 496 బస్తీ దవాఖానా లకు, 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌లను మోదీ ప్రారంభించారు. 305 కోట్ల రూపాయలతో నిర్మితమైన రైల్వే విద్యుత్ లైన్‌ను జాతికి అంకితం చేశారు.

తెలంగాణలో ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం ఓవైపు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్న తరుణంలో భారతీయ జనతాపార్టీ అంతే మెరుపు వేగంతో అభివృద్ధి పనులు మొదలు పెట్టడం రాష్ట్రంలో ఎన్నికల వాతావరణాన్ని ఆవరించేలా చేసింది. పైగా ప్రధాని నరేంద్రమోదీ స్వయంగా పర్యటించి.. వరాల జల్లు కురిపించడం కాషాయ శ్రేణుల్లో జోష్ పెంచింది.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్



# ప్రభుత్వ విధా
# 'కాగ్' క

**ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటును కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తప్పుబట్టింది. ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం లేకుండా గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని 2020-21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ నివేదికలో వ్యాఖ్యానించింది. రాజధాని అమరావతి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై కూడా తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తూ, భూ సమీకరణ కోసం చేసిన వేల కోట్ల రూపాయల ఖర్చు నిష్ఫలమైందని, రూ.వందల కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు నిరుపయోగంగా మారాయని పేర్కొంది. ముఖ్యంగా 2019 నుంచి రాజధాని అమరావతిలో పనులన్నీ నిలిచిపోవడం వల్ల ప్రభుత్వానికి ఆర్థికపరమైన ఇబ్బందులు తలెత్తాయని కాగ్ తన నివేదికలో తెలిపింది.**

ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తీవ్ర విమర్శలు చేసింది. గ్రామ, వార్డు స్థాయిల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం లేకుండానే ఏర్పాటు చేసిన ఈ వ్యవస్థ, స్థానిక స్వపరిపాలన కోసం ఉద్దేశించిన రాజ్యాంగ స్ఫూర్తిని నీరు గార్చిందని ఆక్షేపించింది. అందుకే స్వపరిపాలన సాధించేందుకు వార్డు కమిటీలను ఏర్పాటుచేయాలని, వార్డు కమిటీలు, ఏరియా సభలతో సచివాలయాలను అనుసంధానం చేయాలని సిఫార్సు చేసింది. అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసేందుకు జిల్లా ప్రణాళిక కమిటీలను, నగరాల్లో మహానగర ప్రణాళిక కమిటీలు ఏర్పాటు కాలేదని కాగ్ పేర్కొంది. స్థానిక సంస్థల అవసరాలు, ఉమ్మడి ప్రయోజనాల అంశాన్ని పరిగణనలోకి తీసుకోలేదని ఆక్షేపిస్తూ, తక్షణమే డీపీసీ, ఎంపీసీలు ఏర్పాటు చేయాలని సూచించింది.

వైసీపీ ప్రభుత్వం 2019 జూలైలో వార్డు సచివాలయాల వ్యవస్థను తీసుకొచ్చింది. ఒక్కొక్క వార్డు సచివాలయంలో 10 మంది వార్డు కార్యదర్శుల చొప్పున 37,880 పోస్టులతో ప్రభుత్వం 3,786 వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఉన్న బిల్ కలెక్టర్, వర్క్ ఇనస్పెక్టర్, ట్యాప్ ఇనస్పెక్టర్, ఫిట్టర్, టీపీ ట్రేసర్ పోస్టుల(2434)ను అందులో విలీనం చేశారు. అలాగే, 70,888 వలంటీర్లను ఎంపిక చేసింది.

**పంచాయతీలపై ప్రభావం**

గ్రామ సచివాలయాలు, వాలంటీర్ల పేరుతో సృష్టించిన సమాంతర వ్యవస్థ వల్ల పంచాయతీలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. గ్రామ సచివాలయాల కన్వీనర్లు, వాలంటీర్లతో పాటు అధికార పార్టీ తెచ్చిన గృహసారథుల కారణంగా సర్పంచులు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారు. సచివాలయ వ్యవస్థ పంచాయతీలో భాగమేనని ప్రభుత్వం మొదట ప్రకటించినా, 2021 ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికల అనంతరం వాటిపై సర్పంచుల పర్యవేక్షణ, ఉద్యోగులకు సెలవు మంజూరు అధికారాలను తీసేసింది. దీంతో సచివాలయ ఉద్యోగులు సర్పంచులను లెక్కచేయడం లేదు. గ్రామాల్లో సంక్షేమ కార్యక్రమాల అమలు, లబ్ధిదారుల ఎంపిక వంటివి సర్పంచులకు తెలియకుండానే జరిగిపోతున్నాయి.

గ్రామ సచివాలయాల పేరిట ప్రభుత్వం పంచాయతీలను అణచివేస్తోందని సర్పంచులు ఆరోపిస్తూ, ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు నిధులివ్వదు. కేంద్రమిచ్చే నిధులను చెప్పకుండా లాగేసుకుంటోంది. పన్నుల రూపంలో వచ్చే నిధుల్ని కరెంటు బిల్లుల పేరిట జమ చేసుకుంటోంది. పాలకవర్గం ఉన్నా పెత్తనం మాత్రం వేరొకరిదిగా కొనసాగుతోంది. దీంతో నిధులు, హక్కులు, అధికారాలు లేక సర్పంచులు నిరాశ, నిస్పృహ చెందుతున్నారు.

**ఆస్తి పన్ను వసూళ్లపైనా...**

ఆస్తిపన్ను వసూలు చేసే అధికారం స్థానిక సంస్థలకే ఉన్నప్పటికీ, ఆ విధానం ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వద్దనే ఉందని కాగ్ గుర్తు చేసింది. సొంత ఆదాయాన్ని సమకూర్చుకునే పూర్తి స్వయం ప్రతిపత్తి స్థానిక సంస్థలకు లేకుండా పోయిందని ఆక్షేపించింది. ఆస్తి పన్నును మదింపు చేసేందుకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకాలు అందించేందుకు ఆస్తి పన్ను బోర్డును ఏర్పాటు చేయాలని 13వ ఆర్థిక సంఘంలోనే చేసినసూచనలు అమలుకు నోచలేదని పేర్కొంది. పట్టణాల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్యం, ఇతర అంశాల్లో ప్రణాళికల కోసం సరైన విధానాలు లేనందున, ఈ అంశాలను స్థానిక సంస్థలకు అప్పగించాల్సి ఉందని కాగ్ సిఫార్సు చేసింది.

**అమరావతిని నీరుగార్చారు**

రాజధాని అమరావతి విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై కాగ్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. భూ సమీకరణ కోసం చేసిన వేల కోట్ల రూపాయల ఖర్చు నిరుపయోగంగా మారిందని, ఇప్పటికే రూ. వందల కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు నిష్ఫలంగా మారాయని పేర్కొంది. రాజధానికి అవసరమైన భూమిలో 70 శాతాన్ని భూసమీకరణ ద్వారా సేకరించాలని గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా రానున్న కాలంలో






# నాలపై నెర్ర

భారీ ఆర్థిక భారం పడనుందని కాగ్ పేర్కొంది. గ్రీన్‌ఫీల్డ్ రాజధానిగా అమరావతి ప్రాంతాన్ని ఎంచుకునేటప్పుడు పరిగణనలోకి తీసుకున్న కీలక పరిమితులు, రాజధాని అభివృద్ధికి భూమి వాస్తవ అవసరాలను అంచనా వేసేందుకు చేపట్టిన సాధ్యాసాధ్యాల అధ్యయన వివరాలను గత ప్రభుత్వం వెల్లడించలేదని కాగ్ పేర్కొంది. రాజధాని మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు కన్సల్టెంట్ల విషయంలో తగిన విధానాన్ని అనుసరించకుండా నామినేటెడ్ పద్ధతిలో ఎంపిక చేశారని పేర్కొంది. రాజధానికి సంబంధించి రూ. 1,09,023 కోట్ల అంచనాతో డీపీఆర్లు రూపొందించినప్పటికీ వీటిలో రూ.46,400 కోట్ల మేర డీపీఆర్లను నీతిఆయోగ్‌కు సమర్పించలేదని వెలుగులోకి తెచ్చింది. డీపీఆర్లు లోపభూయిష్టంగా ఉన్నాయంటూ కేంద్రం వివరణ కోరినా గత సర్కారు సమర్పించలేదని తెలిపింది. 2019 నుంచి నిర్ణయించిన ప్రణాళిక కోసం కనీసం బడ్జెట్ సహకారం అందించేందుకు కూడా ప్రయత్నం జరగలేదని తెలిపింది. రూ.33,476 కోట్లు రుణంగా సమీకరించుకోవాల్సి ఉండగా, కేవలం 8,540 కోట్లు మాత్రమే సమీకరించుకున్నారని పేర్కొంది. 'రాజధాని నగర అభివృద్ధిపై విధానపరమైన మార్పు కారణంగా 55 ప్యాకేజీలపై అనిశ్చితి నెలకొంది. ఈ ప్యాకేజి పనులు పూర్తి చేసేందుకు రూ. 28,048 కోట్లు కావాల్సి ఉంది' అని కాగ్ పేర్కొంది. వీటి భూ సమీకరణకు సీఆర్‌డీఏ రూ.2,245 కోట్లు వ్యయం చేసిందని, ఇలా సేకరించిన భూమి అంతా నిరుపయోగంగా పడి ఉందని విమర్శించింది.

**ఎల్పీఎస్ లేఅవుట్ల పట్ల నిర్లక్ష్యం**

రాజధానికి భూములిచ్చిన రైతులకు స్థలాలు కేటాయించిన ఎల్పీఎస్ లేఅవుట్లను 14 జోన్లుగా విభజించారు. వాటిలో రెండు జోన్లకు ఇంకా టెండర్లు పిలవలేదు. మిగతా 12 జోన్లలో మౌలిక వసతుల పనులను 16 ప్యాకేజీలుగా విభజించారు. వాటిలో రూ.13,802.75 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధి పనులు ప్రారంభించగా, 2021 సెప్టెంబరు నాటికి రూ.183.04 కోట్లే ఖర్చు పెట్టారు. రైతులకు మూడేళ్లలో స్థలాలు అభివృద్ధిచేసి ఇస్తామన్న హామీ నెరవేర లేదు. దాదాపు సిద్ధమైన వాటినీ అందుబాటులోకి తేలేదు. అమరావతి పరిపాలన నగరంలో నిర్మాణ పనుల్ని గత ప్రభుత్వం రూ. 6,848.58 కోట్లతో చేపట్టింది. షెడ్యూలు ప్రకారం సెప్టెంబరు 2018 –మార్చి 2021 మధ్య మొత్తం పనులు పూర్తికావాలి. వీటిని 19 ప్యాకేజీలుగా విభజించగా ఆరు ప్యాకేజీల పనులే 25–95 శాతం పూర్తయ్యాయి. రూ.1,505.22 కోట్లు వెచ్చించి చేపట్టిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అఖిల భారత సర్వీసుల అధికారుల నివాస గృహాలు వృథాగా పడి ఉన్నాయి. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి సాయమూ లేదు.

రాజధానిలో మౌలిక వసతుల నిర్మాణానికయ్యే రూ.55,343 కోట్లలో సీఆర్డీఏ 2016–2023 మధ్య వివిధ రూపాల్లో రూ.11,487 కోట్లు సమీకరించు కోగలిగింది. 2019 నుంచి రాజధాని నిర్మాణానికి ఎలాంటి సాయం అందలేదు. సీఆర్డీఏ హడ్కో, బ్యాంకుల కన్సార్టియం, బాండ్ల రూపంలో రూ.5,013.60 కోట్లు సమీకరించింది. కానీ ప్రధాన మౌలిక వసతులు, ఎల్పీఎస్ లేఅవుట్ల అభివృద్ధి పనుల్లో ఆశించిన పురోగతి లేదు. పనులు చేసినా, చేయకపోయినా ఈ రుణాలపై భవిష్యత్తులో రూ. 3,428.12 కోట్ల వడ్డీ చెల్లించాలి.

**చేసిన పనులన్నీ వృథా**

రాజధానిని జాతీయ రహదారి–16తో కనకదుర్గ వారధి వద్ద అనుసంధానం చేసే సీడ్ యాక్సెస్ రోడ్డు 21.34 కి.మీ.గాను 14.47 కి.మీ.లే పూర్తయింది. కృష్ణానదిపై రూ.1,387 కోట్లతో ప్రతిపాదించిన ఐకానిక్ బ్రిడ్జిని ఈ ప్రభుత్వం నిలిపివేసింది. దానిపై డిజైన్లు, డ్రాయింగ్‌ల కోసం పెట్టిన రూ.2.22 కోట్లు వృథా అయ్యాయి. ఎల్పీఎస్ లేఅవుట్లలో పిచ్చి మొక్కలు తొలగించడానికి మే, 2017–మే, 2018 మధ్య రూ.10.87 కోట్లు వెచ్చించారు. 2019 మేలో ప్రభుత్వం పనులు నిలిపివేసి, రైతులకు ఇవ్వకపోవడంతో ఆ నిధులు వృథా అయ్యాయి.

రాజధానిలో 1,691 ఎకరాల్లో స్టార్టప్ ఏరియా అభివృద్ధికి సింగపూర్‌కు చెందిన అసెండాస్–సింగ్‌బ్రిడ్జి, సెంబ్ కార్ప్ సంస్థల కన్సార్టియం, అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) సంయుక్తంగా అమరావతి డెవలప్‌మెంట్ పార్టనర్స్ (ఏడీపీపీఎల్) పేరుతో కంపెనీ ఏర్పాటు చేశాయి. జగన్ ప్రభుత్వం



**వల్లూరు జయప్రకాష్ నారాయణ**

ఆ ప్రాజెక్టును అర్ధంతరంగా రద్దుచేసి, ఏడీపీపీఎలు లిక్విడేట్ చేయడంతో ప్రభుత్వానికి రూ.11.16 కోట్ల నష్టం వాటిల్లింది.

ఇండో–యూకే ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (ఐయూఐహెచ్)కి ఎకరం రూ. 50 లక్షల చొప్పున 150 ఎకరాలను 2016లో ప్రభుత్వం కేటాయించింది. ఆ సంస్థ సీఆర్డీఏకి రూ.24.90 కోట్లు చెల్లించింది. గడువులోగా ప్రాజెక్టు చేపట్టనందుకు సీఆర్డీఏ ఆ సంస్థకు భూకేటాయింపును 2019 ఏప్రిల్‌లో రద్దు చేసింది. ఆ సంస్థ కట్టిన డబ్బు జప్తుచేయాలి. కానీ, ఆ సంస్థ విజ్ఞప్తి మేరకు సీఆర్డీఏ నిబంధనలకు విరుద్ధంగా 2020 జనవరిలో ఆ నిధుల్ని తిరిగి చెల్లించింది. గుత్తేదారులు రాజధానిలో తమ మెటీరియల్, పరికరాలు ఉంచుకోవడానికి ఎకరం రూ. లక్ష చొప్పున సీఆర్డీఏ లీజుకిచ్చింది. కానీ గుత్తేదారు సంస్థల నుంచి ఒక్క రూపాయి కూడా వసూలు చేయలేదు. వారి బకాయి రూ.4.09 కోట్లు.

గుత్తేదారులకు 30 పనులకు రూ.1,282.83 కోట్లు మొబిలైజేషన్ అడ్వాన్స్ ఇచ్చారు. అందులో రూ.338. 57 కోట్లే రికవరీ చేశారు. 2021 సెప్టెంబరు నాటికి రూ.944.26 కోట్లు వారి వద్దే ఉన్నాయి. రాజధానిలో వివిధ అవసరాలకు మట్టి తవ్వుకున్న గుత్తేదారుల నుంచి రూ.12.83 కోట్లు వసూలు చేయాలి. కృష్ణా కరకట్టకు, నదికి మధ్యలో రూ.7.85 కోట్లతో సీఆర్డీఏ ప్రజావేదిక (గ్రీవెన్స్ సెల్) నిర్మించింది. అనుబంధ వసతుల కోసం మరో రూ.4.06 కోట్లు వెచ్చించింది. ఆ భవన నిర్మాణానికి జలవనరులశాఖ, సీఆర్‌డీఏ ప్రణాళికా విభాగం నుంచి అనుమతులు తీసుకోలేదు. ఈ ప్రభుత్వం దాన్ని కూలగొట్టడంతో మొత్తం రూ.11.91 కోట్ల ప్రజాధనం వృథా అయింది.

రాజధానిలో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రూ. 97.69 కోట్ల అంచనా వ్యయంతో 20 ఎకరాల్లో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్మృతివనాన్ని గత ప్రభుత్వం తలపెట్టింది. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహంతో పాటు పలు వసతులు కల్పించాలని తలపెట్టింది. రూ.44.61 కోట్లు ఖర్చుచేశాక, పనులు నిలిపివేయడంతో ఆ మొత్తం వృథా అయింది.

**వ్యాసకర్త: చైర్మన్,సెంట్రల్ లేబర్ వెల్ఫేర్ బోర్డు, కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ.**

❋ రామాయణంలోని పాత్రలు ❋

# సమున్నతురాలు సీతామాత

క్షమ.. దయ.. ధైర్యం... వివేకం... ఆత్మాభిమానం కలబోసిన ఉదాత్తమైన స్త్రీ పాత్ర 'సీత'. సీత లేకుండా రాముని జీవితాన్ని అసలు ఊహించలేము. కాబట్టే రామాయణ ఇతిహాసంలో ఆమె పాత్రపై ఎందరో మహానుభావులు, మేధావులు పరిశోధనలు చేశారు. సీతలోని సుగుణాలు నేటి మగువలకు ఎంతో ఆదర్శం. ఆమె చరితం ఓ స్ఫూర్తిదాయకమైన కథాసాగరం. రామాయణంలో ఏ ఘట్టం తీసుకున్నా సీత గుణగుణాలు ప్రతి ఒక్కరికీ ఎంతో ఆదర్శ ప్రాయంగా నిలుస్తాయి...

**సీతాదేవి అయోనిజ:** సాక్షాత్తూ శ్రీ మహాలక్ష్మియే సీతగా పుట్టిందని ప్రతీతి. మహా పతివ్రత. జనకుడి కుమార్తె కాబట్టి జానకి అన్నారు. మిథిలానగర రాకుమార్తె కాబట్టి మైథిలి అని కూడా పిలిచారామెను. అందచందాలలో, బల పరాక్రమాలలో, ఓర్పు, సహనంలో రాముడికి తగిన ఇల్లాలు. రాముడి కరకమలాలనందుకుని ఆయన ధర్మపత్నిగా అయోధ్యానగరానికి విచ్చేసిన ఆమె ఆ మరుక్షణం నుంచి పుట్టినింటికి వెళ్లింది లేదు. కష్టనష్టాలలో, సుఖ సంతోషంలోనూ అంతా రామచంద్రమూర్తే ఆమెకు. తల్లి, తండ్రి, గురువు, దైవం.. అన్నీ అయోధ్యానగరవాసులే.

**స్థితప్రజ్ఞురాలు:** తెల్లవారితే భర్తకు అయోధ్యా నగర యవరాజుగా పట్టాభిషేకం. మరికొద్దిసేపట్లోనే సుముహూర్త ఘడియలు. తెల్లవారింది. తన భర్తకు పట్టాభిషేకం కాదు కదా, కనీసం సాధారణ పౌరుడిగానయినా అయోధ్యలో గడిపే అవకాశం లేదని తెలిసిందామెకు. అయినా సరే, కించిత్తు కూడా బాధపడలేదామె. చాలా మామూలు విషయంలానే స్వీకరించింది. లోకంలో ఐశ్వర్యం లేనివారంటే అందరికీ అంతులేని చులకన. భార్యకు మరీనూ, కానీ, సీతమ్మ అలా కాదే... భర్త ఉన్నచోటే తన సుఖం అనుకుంది. మరో స్త్రీ అయితే భర్త ఎప్పుడైతే సకలైశ్వర్యాలనూ కోల్పోయి కట్టుబట్టలతో, కటిక పేదరికంతో వనవాసానికి వెళ్తాడని తెలుస్తుందో, మరుక్షణమే పుట్టినింటికి పయనం కట్టి ఉండేది. అలా కాకపోయినా, 'నీ తండ్రి ఎప్పుడో నీ పినతల్లికి మాట ఇవ్వడమేమిటి, దానికి నీవు కట్టుబడి ఉండడమేమిటీ, అయినా నీవు ఎక్కడికి పోతే నాకేంటి, హాయిగా నేను నా పుట్టింటికి వెళ్లి అక్కడ యువరాణిగా సకల సుఖాలూ అనుభవిస్తాను లేదంటే ఇక్కడే ఉండి సంతోషంగా జీవిస్తాను.. అయినా ఆ మాత్రం పౌరుషం లేని మగవాడికి నీతో నాకేమిటి' అంటూ తెగతెంపులు చేసుకుని ఉండేదేమో! కానీ, సీతమ్మ అలా అనలేదు. అనుకోలేదు. 'సుకుమారంగా పెరిగినదానివి, కొండలు, కోనలు, అడవుల వెంట తిరగవలసిన అవస్థ నీకెందుకు? నేను తిరిగి వచ్చేవరకూ ఇక్కడే ఉండి కాలక్షేపం చేయి' అని భర్త చెవినిల్లు కట్టుకుని చెబుతున్నా సరే, ఆమె వినలేదు. పైగా 'నీవింత చేతకాని వాడవనుకోలేదు. నా తండ్రి నన్ను పురుషుడికిచ్చి పెళ్లి చేశాడను కున్నాను కానీ, ఇలా భార్యను రక్షించు కోవడం చేతకాని వాడికిచ్చి చేసి నా గొంతు కోస్తాడనుకోలేదు' అని ఉక్రోషంగా అంటూ ఆక్రోశించింది. అసలే పౌరుషవంతుడయిన రామయ్యను దెప్పి పొడిచింది. ఆయన అడుగులో అడుగు వేసుకుంటూ అడవులకు ఆనందంగా




# బహుళ ఆరోగ్య ప్రయోజనాల పొట్ల

❋ పెరటి బంగారం ❋

తెలిగ్గా పెరట్లో పెరిగే పొట్లకాయ మన దేశంలో అతి ప్రాచీన కాలం నుంచి ఆహార ద్రవ్యంగా ఉపయోగపడుతున్న గొప్ప ఔషధం. చరక, సుశ్రుతాదులు దీని ఆరోగ్య ప్రయోజనాల్ని ఘనంగా వర్ణించారు. పేగుల్ని బాగు చేసే ఔషధం ఇది. పొట్ల కూర తరచూతినేవారికి పొట్ట బాగుపడుతుంది. తేలికగా అరుగుతుంది. కఫం, పైత్యం అదుపులో ఉంటాయి. ఈ కూర చాలా రుచిగా ఉంటుంది. అయితే లేత పొట్లకాయని మాత్రమే వండుకోవాలి. ఈ కూర శరీరంలో సమశీతోష్ణ స్థితిని కలిగిస్తుంది. అంటే శరీరంలో ఉష్ణమాపక (థర్మో రెగ్యులేషన్) ప్రక్రియని సక్రమంగా నెరవేరుస్తుంది..



ఇందులో పిండిపదార్థాలు, ఖనిజాలతోపాటు విటమిన్ ఎ, విటమిన్ బి, విటమిన్ సి, కాల్షియం, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, జింక్ పుష్కలంగా ఉన్నాయి. మన జీర్ణ వ్యవస్థను క్రమబద్ధీకరించేందుకు కూడా బాగా పని చేస్తుంది.

చెడు కొలెస్ట్రాల్‌ను తొలగించి రక్తప్రసరణ సాఫీగా జరిగేలా పొట్లకాయ ప్రముఖ పాత్ర వహిస్తుంది. అంతేకాక రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. రక్త పోటును అదుపులో ఉంచడంలో, మధుమేహం, మూత్రపిండాల వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలోను పొట్లకాయ కీలక పాత్ర పోషిస్తుంది.

**పొట్ల తీగలతోనూ మేలే...**

లేత పొట్ల తీగని కూడా పొట్లకాయ లాగానే కూర వండుకుంటారు. కఫ దోషం ఎక్కువగా ఉన్నవారికి కాయలకన్నా దీని లేత కాడలు, తీగలు ఎక్కువ పనిచేస్తాయి. పొట్ల వేరుని మెత్తగా నూరి బఠాణీ గింజంత మాత్రలు చేసి ఒకట్రెండు మింగితే విరోచనం అవుతుంది. విషాహారం తిన్నప్పుడు పొట్ట చెడకుండా కాపాడి, విషాన్ని హరిస్తుంది. లేత పొట్ల ఆకుల్ని తరిగితే గ్రీన్ సలాడ్‌లాగా తినటానికి అనుకూలంగా ఉంటాయి. కూరగా కూడా వండుకోవచ్చు. దీని ఆకులకు పొట్లకాయతో సమాన గుణాలున్నాయి. ముఖ్యంగా కీళ్లవాత రోగులకు పొట్ల



బయలు దేరింది. ఆ తర్వాత ఎన్ని కష్టాలు, ఎన్ని కడగళ్లు... అన్నిటినీ అతి ఓర్పుగా అనుభవించింది... అలవోకగా అధిగమించింది. రాకుమార్తెగా, సుందర సుకుమార కోమలాంగిగా పెరిగిన సీతమ్మ, రాముడి వెంట అడవులకు వెళ్లడానికి ఏమాత్రం సంకోచించలేదు మరి.

**దయాశీలి:** పేదవారిని ఆదరించి అన్నం పెట్టాలన్న దయాగుణం గల స్త్రీమూర్తి సీత. అదే భావనతో తనింటికి మారువేషంలో భిక్షాటనకు వచ్చిన రావణుడికి లక్ష్మణరేఖ దాటి మరీ భిక్షం వేసిన దయామూర్తి. తన రక్షణ కోసం పెట్టుకున్న నియమం కన్నా దానమే గొప్పదన్న నీతిని ఆమె ఈ సందర్భంలో వెల్లడిస్తున్నది.

**ధైర్యశాలి:** పాతివ్రత్య నిరూపణ కోసం సీతను అగ్నిప్రవేశం చేయమని రాముడు అడిగినప్పుడు ఆ పనికి సిద్ధమైన ధైర్యశాలి సీత. పతి మాటలు ఆమె గుండెను గాయపరిచినా సహనంతో భరించింది. తానే తప్పు చేయలేదన్న ఆమె ఆత్మవిశ్వాసం చివరికి నిందారోపణ చేసిన వారిని సైతం తలదించుకునేలా చేసింది.

**అభిమానవతి:** సీతకు ఆత్మాభిమానం ఎక్కువ. చిత్రకూటానికి సీతారాములు వచ్చారని తెలిసి, ఆమె తండ్రి జనకుడు వారిని కలిసి 'వనవాసం పూర్తయ్యే దాకా మిథిలానగరానికి వచ్చి తనతో పాటు ఉండు' అని కూతురిని కోరినప్పుడు, సున్నితంగా తిరస్కరించిన ఆత్మాభిమాని సీత. మెట్టినింటికొచ్చాక ఎన్ని విషమ పరిస్థితులెదురైనప్పటికీ తావే పరిష్కరించుకోవాలి గానీ, పుట్టింటి వారిని ఇబ్బంది పెట్టకూడదన్న అభిమానవతి సీత.

**వివేకవంతురాలు:** రావణాసురుడు తనను అపహరించి తీసుకెళ్లి పోతున్నప్పుడు, రాముడికి తన ఆనవాళ్లు చిక్కడం కోసం బంగారు నగలను నేల మీద జారవిడిచిన వివేకవంతురాలు సీత.

**ప్రేమమూర్తి:** సీతకు రామునిపై ఎంతటి ప్రేమానురాగాలంటే.. ఆ ప్రేమలో తనను తానే మైమరిచిపోయేది. రావణుడి చెరలో బందీగా ఉండి కూడా నిత్యం శ్రీరామనామస్మరణ చేస్తూ అనుక్షణం పతి క్షేమాన్ని కోరేది.

**చైతన్యశీలి:** సీత ఎంత చైతన్యశీలి అంటే అపాయంలో కూడా భయంతో ఆమె శత్రువులకు లొంగలేదు. రావణుడు సీతను బెదిరించి, తన వశం కావాలని ఆదేశించినప్పుడు, ఒక గడ్డిపరకను అడ్డంగా పెట్టుకొని 'నువ్వు నాకు దీనితో సమానం' అని చెప్పకనే చెప్పి అతని ధర్మహీనతను ప్రశ్నించిన ప్రజ్ఞావంతురాలామె.

**క్షమాగుణం:** రాక్షస సంహారం తర్వాత సీతను అశోకవనం నుంచి విడిపించి తీసుకువెళ్తున్న సమయంలో, తను బందీగా ఉన్నప్పుడు ఆ వనంలో తనను మాటలతో హింసించిన రాక్షసులకు ఏ కీడు తలపెట్టవద్దని, వారు స్వామిభక్తితో తమ బాధ్యతను మాత్రమే నిర్వర్తించారని హనుమంతునితో చెప్పిన క్షమాగుణం సీత సొంతం.

**ఆదర్శమూర్తి:** అడవిలో ఆశ్రమవాసిగా కాలం గడుపుతూ కూడా తన కుమారులను ప్రయోజకుల్ని చేయాలని ఎల్లవేళలా తపిస్తూ, వారిని కార్య సాధకులుగా తీర్చిదిద్దడం ఆమె ఉత్తమ పెంపకానికి నిదర్శనం. ★

అకులు చాలా మేలు చేస్తాయి. శరీరానికి కాంతినిచ్చే ద్రవ్యాల్లో పొట్ల ఒకటి.

**వాత, పిత్త, కఫ దోషాలకు...**

కఫ దోషం వల్ల ఏర్పడే జబ్బులున్న వారికి, పైత్య దోషం, అంటే ఎసిడిటీ ఉన్నవారికి పొట్లకాయ వరప్రసాదంలా పని చేస్తుంది. జ్వరాన్ని తగ్గించే గుణం కూడా దీనికుంది. పొట్లకాయ కూరని నిరభ్యంతరంగా జ్వరంలో పథ్యంగా పెట్టవచ్చు.

కడుపులో పెరిగే నులి పురుగుల్ని వెళ్లగొట్టే గుణం కూడా దీనికుంది. అజీర్తి సమస్యల్ని తగ్గిస్తుంది. జఠరాగ్నిని పెంపు చేసే కూరగాయల్లో పొట్లకాయ ప్రముఖమైంది. వాత, పిత్త, కఫ దోషాలు మూడింటినీ సరిచేసే గుణం ఉంది కాబట్టి... పొట్లకాయని అన్ని జబ్బుల్లోనూ ఎలాంటి అనుమానం లేకుండా తినవచ్చు.

**జీవకణాల పెంపునకు...**

పొట్లకాయకు వేడిని తగ్గించటమే కాకుండా వీర్యాన్ని, వీర్యంలో జీవకణాలను కూడా పెంపు చేసే శక్తి ఉంది. పొట్లకాయకి సీజను, అన్‌సీజన్ అనేవి ఉండవు. జీవకణాలు తగ్గిపోయి బాధపడేవారికి తరచూ పొట్లకాయని వండిపెట్టటం అవసరం. ఈ కాయతో చేసిన డికాషన్ తీసుకోవడం ద్వారా జ్వరం ప్రభావాలు తగ్గుతాయని వైద్యులు చెబుతున్నారు.

**మేలుతోపాటు...**

పొట్లకాయ వలన మంచే కాదు చెడు కూడా ఉంటుంది. అమితంగా దీనిని తీసుకునే వారికి కొన్ని దుష్ప్రభావాలు కలుగుతాయి. పొట్లకాయ రసం అధికంగా తీసుకోవడం జీర్ణవ్యవస్థను పాడు చేస్తుంది. పొట్లకాయ రసం చాలా చేదుగా ఉంటుంది, కాబట్టి చాలా మందికి దీనిని తాగడం ద్వారా కొందరిలో అలెర్జీ వస్తుంది. గ్యాస్ సమస్యలు కూడా ఉత్పన్నం అవుతాయి. ★

❄ **తాత్వి'కత'** ❄

# కాలం బంగారం

రామకృష్ణ పరమహంస వద్దకు ఓ సాధకుడు వచ్చాడు. అతను పలు సిద్ధులు కలిగిన మనిషి.



రామకృష్ణులవారు అతనితో మాట్లాడినప్పుడు ఆ సాధకుడు, 'నేను పదేళ్లుగా యోగాలో శిక్షణ పొందాను. నీటి మీద నడిచే శక్తిని పొందాను. ఇప్పుడు కూడా నీటి మీద నడిచే యమునా నదిని దాటుకుంటూ వచ్చాను' అన్నాడు. రామకృష్ణ పరమహరంస తన శక్తిని ప్రశంసిస్తారని అనుకున్నాడు ఆ సాధకుడు.

అయితే పరమహంస నవ్వుతూ 'ఇందుకోసమా పదేళ్ల విలువైన కాలాన్ని వృథా చేశారు? పది పైసలు ఇచ్చినట్లయితే పడవ నడిపే అతను మిమ్మల్ని పడవలో కూర్చోపెట్టి ఎంచక్కా యమునానదీ జలాలపై ఇక్కడికి తీసుకువచ్చేవాడు. అది మానేసి నడిచొచ్చేరా నీటిమీద...” అని.

ఈ మాటకు సాధకుడు ఏం చెప్పాలో తెలియక మౌనం వహించాడు.

జీవితకాలం అనేది బంగారం లాటిది.

ఇతరులకు ఉపయోగపడే కార్యాల ద్వారా మనిషి తన సమయాన్ని వినియోగించాలి తప్ప ఇతరుల ప్రశంసల కోసం అవీ ఇవీ నేర్చుకుంటూ కాలాన్ని వృథా చేసుకోకూడదు అనేదే పరమహంస ఉపదేశం. ★

21



# మహా సంకల్పం

"ఎవరి గుండెలో వున్న బరువుని దింపు కోవాలన్నా అది ఇతరులతో పంచుకోవాలి. దురదృష్టవశాత్తూ నాకు అంత మంచి స్నేహితులు అతి తక్కువ. వారిని కూడా నేను ఈ విషయంలో దూరంగా వుంచాను. ఇప్పుడు నా స్వంత మనుషులు మీకు కూడా చెప్పుకోలేకపోతే నేను మనిషిగా మిగలను" అంటూ మాట్లాడటం మొదలు పెట్టాడు.

"ఇది నేను నిర్మించుకున్న నాదైన ప్రపంచం. అందులో అడుగడుగునా మీ అమ్మమ్మ సహకారం వుంది. స్వప్న-అఖిల వున్నారు. అంతా బాగానే జరుగు తోంది. నిజానికి నన్ను వాళ్లు భరించారని చెప్పాలి. నాలో చాలా బలహీనతలు వున్నాయి. నేను చాలా మందికి ఐడెంటీని యిచ్చాను. అయితే అది నాలోనూ వుందని మీ అందరినీ పొగొట్టుకున్నాక తెలిసింది".

"ఐడెంటీని కోరుకోవటం తప్పుకాదుగా తాతగారూ" అంది శ్వేత.

"ఒక దశ వరకు కాదు. అలాంటి ఆరాటం లేకపోతే మనుషులు సాధించ టానికి ఏం వుండదు. పరిమితి దాటితే ప్రమాదం వస్తుంది. నాలో బలహీనత అతిగా ప్రేమించటం. నేను అలాంట ప్పుడు భిన్నంగా ప్రవర్తిస్తాను. నా డాటర్స్‌కి ఏం కావాలో ఓ ఫాదర్‌గా నా కంటే ఎవరికి తెలుసు అనుకుంటాను. వాళ్లకి కూడా కొన్ని కోరికలు వుంటాయని నేను అనుకోలేదు".

"ఆ లక్షణాలు మీ అమ్మాయిల్లోనూ వున్నాయి" అంది ఆద్య.

ఆయన నవ్వాడు.

"రాకుండా ఎలా వుంటాయి. వాళ్లు గోవింద్ బుద్ధ డాటర్స్. అవి మీకు సోకకుండా చూసుకోండి". ముగ్గురూ నవ్వుకున్నారు.



పి. చంద్రశేఖర ఆజాద్

9246573575

"అసంతృప్తులు పెరిగాయి. నేను ఎక్కువ జోక్యం చేసుకుంటున్నాను. మాకు స్వేచ్ఛ లేదు అనే భావం వారిలో పెరిగిపోయింది. అందుకు బయటి వారు కారణం కావచ్చు. నేను అలాంటి వన్నీ మాట్లాడను. నా మీద కూడా అలాంటి ప్రభావాలు వుంటాయి కాబట్టి..." అని..

"నేను ఎవరి జీవితాల మీద తీర్పులు చెప్పలేదు. కానీ నా సంపాదకీయాల్లో అనేక విషయాల గురించి మాట్లాడాను. అందువల్ల మా జీవితాల్లో చాలా మార్పులు వచ్చాయి అని ఉత్తరాలు రాసిన వారున్నారు. అదలావుంటే నా జీవితంలో నేను ఇలాంటిది ఫేస్ చేస్తానని అనుకోలేదు" అని కళ్లు మూసుకున్నాడు.

జరిగిన సంఘటనలు ఆయన కళ్ల ముందు కదిలిపోతున్నాయి.

"చాలా జుగుప్సాకరమైన సంఘటనలు జరిగాయి. అందులో మీకు కొన్ని తెలుసు. ఇందులో నేరం ఎవరిది అని ప్రశ్నించుకుంటే అందరం బాధ్యత తీసుకోవాలి. మనం ప్రేమగా, అభిమానంగా వున్నప్పుడు ఎవరు ఎన్ని మాటలు అన్నా సరదాగా తీసుకుంటాం. ఓ సారి డిఫరెన్సెస్ వచ్చాక ప్రతి చిన్నమాట బూతుగానే వుంటుంది. చివరికి మన కుటుంబం చీలిపోయింది. అప్పుడు మధ్య వర్తులు వచ్చారు. రకరకాల చర్చలు జరిగాయి. ఓ దశలో నా ఆస్తి అంతా తీసుకోండి. నాకు నా పత్రిక చాలు అన్నాను. వాళ్లు మాకు మీ ఆస్తంతా అవసరం లేదు అన్నారు. చెరిసగం అన్నారు. అప్పుడు నేను నా శ్వేత, ఆద్యలకి నా ఆస్తిలో వాటా వుంది అనుకున్నాను. అలా మీ ఇద్దరికీ కొన్ని ఆస్తులు రాసాను".

"ఈ విషయంలో ఇంతకు మించి లోతుకు వెళ్లటం నాకు ఇష్టం లేదు. దోషిని నేను. తప్పులన్నీ నావే. ఈ మాటలు నేను కోపంతో అనటం లేదు. సిన్సి యర్‌గా చెబుతున్నాను. ఎందుకంటే ఈ ఇంటికి పెద్దవాడిగా నేను వున్నాను. నేను బ్యాలెన్స్‌డ్ గా వుండి వుంటే ఈ సమస్యలు తలెత్తేవి కాదు. ఇంకా వివరణ కావాలా?" అని ఇద్దరినీ అడిగాడు.

"అవసరం లేదు తాతగారూ" అన్నారు ఇద్దరూ.

"ఇప్పుడు మీ గురించి చెప్పండి".

"నేను ఐ.ఎ.యస్.కి ప్రిపేర్ అవుతున్నాను".

"విన్నాను శ్వేతా".

"నేను ఎం.ఎ.కి. రాబోతున్నాను. లిటరేచర్ చేస్తాననగానే ఇంటిలో గొడవ మొదలయింది".

"అలా ఎందుకనుకున్నావు?"

"లిటరేచర్ డీల్ చేయని రంగం అంటూ వుండదు తాతగారూ... అది నేను మీకు చెప్పనవ సరం లేదు. నాకు ఉద్యోగం రాదనే అనుమానం



లేదు. ఎందుకంటే మా తాతగారి పత్రికలు వున్నాయి. ఆయన దగ్గర అప్రెంటీస్‌గా పనిచేయాలని వుంది. నేను ఎం.ఎ. కాలేజ్‌లో చేయాలా? మీ దగ్గర పని చేస్తూ చదువుకోవాలా అని ఆలోచిస్తున్నాను".

"విజయవాడలోనూ మంచి కాలేజీలు వున్నాయి ఆద్యా... అయినా మా పత్రికలో పని చేయటానికి ముందు నువ్వు ఆలోచించుకో".

"అదేంటి తాతగారూ..."

"ఇక్కడ నిర్ణయాలన్నీ గోవింద్ బుద్ధవి. అది నీకు ఇష్టం లేకపోవచ్చు" అన్నాడు.

"నేను అప్రెంటీస్‌గా అన్నాను. అయినా నేను గోవింద్‌గారిని కన్విన్స్ చేయ గలనను కుంటున్నాను. అది కుదరకపోతే నేనే ఓ పత్రిక పెట్టుకుంటాను".

''నాకు పోటీగానా''.. అని హాయిగా నవ్వుతున్నాడు.

ఓ కెరటం ముగ్గురి పాదాలను తడిపి వెళ్లింది.

* * *

కాశీ నుండి రాజేశ్వరి వచ్చింది.

ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు అల్లుళ్లతో సమావేశం అయింది.

"ఎందుకు నన్ను ఇప్పటికిప్పుడు రమ్మన్నారు?" అని అడిగింది.

"ఇక్కడ ఆద్య. అక్కడ శ్వేతలతో సమస్యలు మొదలయ్యాయి అమ్మా... ఇప్పుడు వాళ్లు జరిగిపోయిన గొడవల్నీ తవ్వుతున్నారు. అసలేం జరిగిందో చెప్పమని అడుగుతున్నారు" అనగానే ఆమె ముఖం ముడుచుకుపోయింది.

"ఇప్పుడు ఆద్య ఇంటి నుండి బయటకు వెళ్లి, తన ఫ్రెండ్ రూమ్‌లో చదువు కుంటోంది. ఇంట్లో జరుగుతున్న వాదనలను బట్టి చూస్తుంటే శ్వేత కూడా బయటకి వెళ్లిపోతుందనుకుంటున్నాను" అంది స్వప్న.

"పెళ్లి కావలసిన ఆడపిల్లలు ఇలా చేయటం ఏమిటి? ఇవన్నీ బాగుండవు కదా" అంది రాజేశ్వరి.

"వాళ్లు అలా అనుకోవటం లేదమ్మా... అదేదో సాహసం అనుకుంటున్నారు" అంది అఖిల. ఆమె నిట్టూర్చింది.

"మళ్లీ మన కుటుంబంలో సంక్షోభం వచ్చింది అత్తయ్యా... కొత్త తరం కూడా చీలిపోయేలా వుంది" శ్రీనివాస్.

"ఇదంతా మావయ్య మన మీద కక్ష తీర్చు కుంటున్నట్లు వుంది" ఆదర్శ్.

''కక్షలు ఇంకానా! ఒకరినొకరు కాదు అనుకున్నాం. ఎవరి బతుకు వారు బతుకుతున్నాం. ఎదురెదురుగా వుంటే ఇలాంటి ఆలోచనలు వస్తాయని దూరంగా వున్నాం. అయినా మనుషుల్ని ఈ పగలు వదలటం లేదా?''

"ఇక్కడున్నది మనుషులు కాదమ్మా... ఒకే ఒక్క వ్యక్తి. గోవింద్ బుద్ధ. తాత, నాయనమ్మలు ఆ పేరు ఎందుకు పెట్టారో, కట్టుకున్న భార్యనీ, పిల్లల్ని కూడా ఈ పెద్దమనిషి వదులుకున్నాడు. ఆ బుద్ధుడు ఇల్లు వదిలి వెళ్లాక వారి మీద ఇలా కక్షసాధింపులు చేయలేదు" అంది అఖిల.

"అఖిలా... ఓ పక్క నుండి ఇదంతా పిల్లలు చేసారని చెబుతున్నారు. ఇంతలో మీనాన్న ఇదంతా చేస్తున్నాడని అంటున్నారు. నాకేమీ అర్థం కావటం లేదు. మనం ఏం జరిగిందో తెలుసుకోవాలి. నాకు ముందు శ్వేత, ఆద్యలతో మాట్లాడా లని వుంది".

"ఈ పని తను కాకుండా ఎవరు చేస్తారు. పిల్లలకి ఇంత ధైర్యం ఎక్కడ నుండి వచ్చింది. మేం ఆ ఇంటి నుండి బయటకు వచ్చామంటే మాకు పెళ్లిళ్లు అయ్యాయి. పిల్లలున్నారు. ఆడపిల్లలం ఎప్పుడయినా బయటకు వెళ్లాల్సిందే. వీళ్లకి ఇంత వరకు చదువులు పూర్తికా లేదు. అయినా మనల్ని ఎదిరిస్తున్నారు. చూస్తుండు రేపు ఇద్దరూ ఆయన పంచన చేరుతున్నారు" అంది స్వప్న ఖచ్చితంగా.

"ఒప్పుకుంటాను. వాళ్లు ఎందుకు వెళ్లాలను కుంటున్నారు? తాతయ్య మీద ప్రేమా?"

''కాదు. బాగా సంపాదిస్తున్నాడు కదా... అందుకోసం''.



"అదేనా మీరు పిల్లల్ని అర్థం చేసుకుంది".

అందరూ ఒకరి ముఖం ఇంకొకరు చూసుకున్నారు.

"అమ్మా... నువ్వు ఇలా మాట్లాడితే మేమేం చెప్పగలం" అంది అఖిల.

"కాదమ్మా... మనం అన్ని కోణాల నుండి ఆలోచించాలి కదా... రేపు ఆయన పిల్లల్ని మీరే పంపించారు అంటాడు. అందుకే పిల్లల్తో గొడవ పెట్టి కున్నట్లు నటిస్తున్నారు. ఇదంతా నా ఆస్తి కోసమే కదా అంటే మీరేం చెబుతారు" అనగానే అందరూ ఆలోచనలో పడ్డారు.

"అమ్మ చెప్పిందాంట్లో ఓ పాయింట్ వుంది. శ్వేత మొన్న అడిగింది. మీరు తాతని కాదను కున్నప్పుడు ఆయన ఆస్తులు ఎందుకు తీసుకున్నారు అని" అంది స్వప్న.

"నువ్వేం అన్నావు?"

"అప్పటికప్పుడు ఇలాంటి ప్రశ్నలు అడిగితే మైండ్ బ్లాంక్ అవుతుంది. ఏం సమాధానం చెప్పగలం" అన్నాడు శ్రీనివాస్.

"చూస్తుంటే దీని వెనకాల చాలా పెద్ద కుట్ర వుంది. ఎలా అయినా మీరు నా దగ్గరకు రావాలి. నేను తప్ప మీకు దిక్కులేదు. ఆ మాట మీరు అని నా కాళ్లు పట్టుకోవాలి అని గోవిందు గారి ఉద్దేశం".

"ఇప్పుడు ఏం చేస్తే బాగుంటుందో చెప్పండి" అంది రాజేశ్వరి.

"నాకు తెలిసి మావయ్య గారికి వార్నింగ్ వెళ్లాలి. అది అత్తయ్య గారి చేతుల్లో వుంది" ఆదర్శ్.

"ఏం నాయనా అది".

"మీరు ఆయనకి విడాకుల నోటీస్ ఇవ్వాలి".

ఒక్కసారిగా నిశ్శబ్దం.

రాజేశ్వరి ముఖం పాలిపోయింది.

"ఆయన మిమ్మల్ని అన్నమాటల కంటే ఇది బాధని కలిగిస్తోందా?"

"అసలు మనం ఆ ఇంటి నుండి బయటకు వచ్చినప్పుడే ఈ పని చేసి వుంటే ఇప్పటికి విడాకులు అయిపోయేవి".

"ఇంకా ఈ బంధం వుంది కాబట్టే ఆయన ఇన్ని నాటకాలు ఆడ గలుగు తున్నాడు" అందరూ తలొక మాట అంటున్నారు. రాజేశ్వరి మాత్రం మాట్లాడటం లేదు.

"అమ్మకు ఇష్టం లేనట్లు వుంది. మనం బలవంతం చేయటం ఎందుకు?" అంది అఖిల.

"ఆ రోజు అమ్మకు జరిగిన అవమానానికి మనం బాధపడ్డాం. రగిలిపోయాం. నాన్న మన ఇద్దరినీ ఏమీ అనలేదు. నాకయితే అప్పటి మాటలన్నీ గుర్తున్నాయి. ఇప్పటికీ నా గుండె మండుతూనే వుంది" అంది స్వప్న.

"అవును. ఆ అవమానం నాదే. మీది కాదు" అంది రాజేశ్వరి.



"అమ్మకు ఇష్టం లేనట్లు వుంది. మనం బలవంతం చేయటం ఎందుకు?" అంది అఖిల.

"ఆ రోజు అమ్మకు జరిగిన అవమానానికి మనం బాధపడ్డాం. రగిలిపోయాం. నాన్న మన ఇద్దరినీ ఏమీ అనలేదు. నాకయితే అప్పటి మాటలన్నీ గుర్తున్నాయి. ఇప్పటికీ నా గుండె మండుతూనే వుంది" అంది స్వప్న.

"అవును. ఆ అవమానం నాదే. మీది కాదు" అంది రాజేశ్వరి.

"అది కాదమ్మా".

"నన్ను మాట్లాడనీయండి" అంది మధ్యలోనే.

"నేనూ. ఆయనా ఇంకోసారి అది తేల్చు కుంటాం. నేను విడాకుల పేపర్స్ మీద సంతకం చేస్తాను" అనగానే అందరి ముఖాల్లో సంతోషం కనిపించింది.

"దానికి ముందు ఓ పని జరగాలి" అనగానే మళ్లీ అనుమానంగా చూసారు.

"ఇది నాకు-గోవిందు గారికి మధ్య నున్న సమస్య మాత్రమే కాదు. ఇద్దరు పెళ్లికాని ఆడపిల్లలు కూడా వున్నారు. అదీ ఆలోచిస్తున్నా".

"నువ్వు వాళ్ల పెళ్లిళ్ల గురించి ఆలోచించ వద్దు. ఈ రోజుల్లో ఇలాంటి వాటిని ఎవరూ పట్టించు కోవటం లేదు".

"మీ అమ్మాయిలు పట్టించుకున్నారు కదా.... రేపు వాళ్లని కట్టుకున్న వారికి కోపం వస్తే మీ వంశమంతా ఇంతే అని అనకుండా వుంటారా?"

"ఇప్పుడేమంటావమ్మా?" విసుగ్గా అంది స్వప్న.

"ముందు నేను ఆద్యతోనూ, శ్వేతతోనూ మాట్లాడాలి. అప్పుడు మాత్రమే సంతకం పెడతాను" అంది.

"ఆద్య అయితే ఇక్కడే వుంది. ఇప్పుడే రమ్మని పిలుస్తాను".

"నేను ఇద్దరితోనూ ఎదురెదురుగా వుండి మాట్లాడతాను. నాలుగు రోజులు ఆలస్యం అయినా మునిగిపోయేదేం లేదు" అంది రాజేశ్వరి.

✻ ✻ ✻

ప్రభాత్ తులసి ముందుకు వచ్చాడు ఉత్సాహంగా.

"మావయ్య ఇప్పుడు విజయవాడలో వుంటున్నారు అని తెలిసింది"

"విజయవాడలోనా? అక్కడుండటం ఏమిటి?"

"గోవింద్ బుద్ధ అని మీడియా ప్రముఖుడు. అదే పత్రికాధిపతి"

"ఆ అబ్బాయి దగ్గర వుంటున్నారా? అతను నాకు తెలుసు. మన దగ్గరికి అప్పుడప్పుడు వస్తుండేవాడు. మీ మావయ్యంటే తనకి ఇష్టం. అతని ఫ్యామిలీ లోనూ యిబ్బందులు వచ్చాయని విన్నాను. ఆ పని మీద వెళ్లి వుంటారా?"

"తెలియదు అత్తయ్యా".

"ఎప్పుడు వస్తారో" అంది.

"అది కూడా తెలియదు".

"కనీసం గోవింద్ ఫోన్ నెంబర్ దొరుకు తుందా?"

"అది పెద్ద పని కాదు. కొన్ని రోజులు ముంబయ్ లోని వారి ఆఫీస్‌లో మావయ్య వున్నారని తెలిసింది".

"సరే... గోవింద్‌తో నేను మాట్లాడతాను" అంది.

✻ ✻ ✻

సరయూ వసుంధరకి ఫోన్ చేసింది.

"మమ్మీ తాత ఎక్కడవున్నారో తెలుసా?"

"తెలియదు. ఇప్పుడు తాతతో పనేంటి?"

"రాహుల్ ఓ సారి కలుద్దాం అంటున్నారు".

"ఎందుకేంటి?"

"ఆయన సలహాలు తీసుకోవాలంటున్నారు".

"రాహుల్ పక్కన వున్నాడా?"

"లేరు".

"మీ తాతే కాదు. సలహాలు తీసుకోవటానికి లక్షల మంది దొరుకుతారు. ఆయన ఇప్పుడు రిటైరయ్యాడు. ఔట్‌డేటెడ్. ఆయన దగ్గర మీరు సలహాలు తీసుకోవటం ఏంటి? నాకు నచ్చలేదు".

"ఇప్పటికీ ఆయన పేరు చెబితే నమస్కరించే వాళ్లు వున్నారు మమ్మీ..." అంది సరయూ.

వసుంధరకి కోపం వస్తోంది.

"అయితే వెళ్లండి. రేపు ఆ ముసలి సలహాలు ఎందుకు విన్నామా అని బాధ పడతారు" అంది కసిగా.

"నువ్వేం మాట్లాడుతున్నావో నాకు అర్థం కావటం లేదు. ముసలి సలహాలో, మంచి సలహాలో తెలియకుండానే నేనూ, రాహుల్ బిజినెస్‌లోకి దిగుతున్నామా? మమ్మీ వ్యాపారంలో వ్యక్తిగత ఇష్టాలతో, బంధాలతో సంబంధం వుండదు. అలావుంటే ఎవరూ ఎదగరు. ఆ రంగాలు వేరే వున్నాయి" అంది సరయూ.

"నువ్వు ఇండియా వెళ్లాక మారిపోయావు".

"ఇప్పుడే కదా లైఫ్ అంటే ఏమిటో తెలుస్తోంది".

"మళ్లీ చెబుతున్నాను. ఇప్పటికే అమ్మమ్మ ఇండియాలో వుంది. ఇన్ని రోజులూ అమ్మను జాగ్రత్తగా చూసుకుంది, అమ్మ పేరుతో వున్న ఆస్తి కోసం. అది భువన వాళ్లకి కాకూడదు. అర్థం చేసుకో".

"అమ్మమ్మకు ఆస్తి ఎంత వుంది? వెయ్యి కోట్లు వుందా?"

"నాకు తెలియదు".

(సశేషం)

కె. మురళీకృష్ణం రాజు




# ఏకాత్మతా మానవ దర్శనం ఒక శాశ్వతసత్యం

'ఏకాత్మతా మానవదర్శనం' దీనదయాళ్ ఉపాధ్యాయ చేతులలో రూపుదిద్దుకున్నది. 1965వ సంవత్సరంలో విజయవాడలో జరిగిన భారతీయ జనసంఘ్ మహాసభలలో దీనిని లాంఛనంగా ఆమోదించారు. అంతటి ఉత్కృష్టమైన భావనను అలనాడు ఆమోదించిన విజయవాడలోనే ఏకాత్మ మానవదర్శనానికి సంబంధించిన రచనలను 15 గ్రంథాలుగా ప్రచురించి ఆవిష్కరించడం ఒక చారిత్రక ఘట్టం. దుర్గమ్మ తల్లి వేంచేసిన నగరం బెజవాడలో దీనదయాళ్ పర్యటించారు. ఇలాంటి నేపథ్యం ఉన్నది కాబట్టే ఆ పుస్తకాల ఆవిష్కరణను ఒక విశేష సందర్భంగా చెప్పుకోవాలి.

తుమ్మలపల్లివారి కళాక్షేత్రంలో అత్యంత వైభవంగా పుస్తకావిష్కరణ సభ జరిగింది. విశిష్ట అతిథిగా హాజరైన తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం ప్రసంగిస్తూ, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఫర్ ఇంటిగ్రల్ హ్యూమనిజం కార్యక్రమంలో పాల్గొనే అవకాశం తనకు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. బీజేపీ (గతంలో జనసంఘ్) తత్వవేత్త, సిద్ధాంతకర్త దీనదయాళ్‌జీ 107వ జయంతి సందర్భంగా ఆయనకు నివాళు లర్పించే కార్యక్రమంలో తనను భాగస్వామురాలిని చేసినందుకు ఆమె నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సంకలనాలు డాక్టర్ మహేశ్ చంద్ర శర్మ సంపాదకత్వంలో రూపుదిద్దుకున్నాయి. దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రతిభను కొనియాడుతూ, ఆ పుస్తకాలను స్పృశించడాన్నే అదృష్టంగా భావిస్తున్నానని తమిళిసై అన్నారు. ఉపాధ్యాయను ఒక మేధావిగా, తత్వవేత్తగా, దూరదృష్టి గల రాజకీయ నాయకుడిగా సమాజం పరిగణించింద న్నారు.

తాను రాజకీయాల్లోకి రాకముందు, వైద్య వృత్తిలో ఉన్నప్పుడు, నలుగురు ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవకుల నుంచి ఓ రోగికి అవసరమైన రక్తాన్ని ఎలా సేకరించారో, ఆ సమయంలో వారు ప్రదర్శించిన నిరాడంబరతలను ఆమె వివరించారు. తాము చేసిన పనికి క్రెడిట్ తీసుకునేందుకు వారు నిరాకరించారని, ఇది తనను ఆకట్టుకుందని తమిళిసై ప్రస్తుతించారు.

తన తండ్రి, ఇతర సన్నిహితులు కాంగ్రెస్ పార్టీ నుండి ఎన్నికైన పదవులలో ఉన్నప్పటికీ, తాను మాత్రం ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల నిస్వార్థ సేవ నుంచి ప్రేరణ పొందానని, ముఖ్యంగా ఉపాధ్యాయ రచనలు చదివిన తర్వాత, బీజేపీలో చేరాలని నిర్ణయించు కున్నానని తెలంగాణ గవర్నర్ తన అనుభవాలను వివరించారు.

సనాతన ధర్మం సారాంశాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని ఆమె కోరారు. పాశ్చాత్య సంస్కృతి, సైన్స్ రెండు వేర్వేరు విషయాలు. మనం కొన్ని పాశ్చాత్య భావనలను స్వీకరించవచ్చు. కానీ పాశ్చాత్య సంస్కృతిని కాదన్నారు. మనం ఆధునీకరణను స్వాగతించవచ్చు, కానీ పాశ్చాత్యీకరణను కాదు అని ఆమె ఉద్ఘాటించారు. మన దేశం అన్ని రంగాల్లో వృద్ధి సాధిస్తూ, త్వరలో 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగనుందని ఆమె వివరించారు. దీనదయాళ్ ఉపాధ్యాయ దార్శనికతే దిక్సూచిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం వల్లే ఇదంతా సాధ్యమైందని ఆమె అన్నారు.

ఇతర దేశాల నుంచి వేటిని స్వీకరించాలి, ఏది అనుసరించకూడదు అనే విషయంలో మన యువత జాగ్రత్తగా ఉండాలని ఆమె హితవు పలికారు.

కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్ అధ్యక్షత వహించారు. మాధవ్ అతిథులను ,

సభికులకు పరిచయం చేశారు. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఫర్ ఇంటిగ్రల్ హ్యూమనిజం ట్రస్ట్ ఛైర్మన్ మహేశ్ చంద్ర శర్మ మాట్లాడుతూ, పాశ్చాత్య భావజాలం, వ్యక్తివాదం అంటే ఏమిటి అనేదే ప్రశ్న? అన్నారు. పాశ్చాత్య భావజాలంలో మతం అన్నది కేంద్రీకృతమైంది. వారికి మతం వేరు, ధర్మం వేరు అని చెప్పారాయన. భారతదేశంలో ధర్మమే ప్రధానం. అంటే అది మానవతావాదపు సమగ్ర పరిధిని చెబుతుందని గుర్తు చేశారు.

పాశ్చాత్యదేశాలు వ్యక్తి కేంద్రితమైన భావజాలాన్ని కలిగి ఉండడంతో, వారి ఇజంలో సమాజానికి ప్రాధాన్యం శూన్యం. మన ధర్మమంత విశాల పరిధి, దృక్పథం వాటికి లేకపోవడం, అన్యుల ఆరాధనా పద్ధతులను, జీవన విధానాలను స్వీకరించే ఔదార్యం పాశ్చాత్య మతాలలో లేకపోవడం వల్లనే లౌకికవాదం అనే భావన పుట్టుకువచ్చింది. అలాగే, మార్క్సిజం, సోషలిజం వంటి భావనలు కూడా అని డాక్టర్ శర్మ వివరించారు. భారతీయులు బ్రిటిష్ పాలన నుండి విముక్తి పొందినా, సోషలిజం, వ్యక్తివాదం వంటి భావనలు పట్టుకునే ఇంకా ఎందుకు వేళ్లాడుతున్నామో ఆలోచించాలని ఆయన కోరారు. ఏ భావజాలంలో లేని ప్రత్యేకత భారతీయతలో ఉంది, అది శాశ్వతమైనదని చెప్పారు.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న సహ క్షేత్ర ప్రచారక్ భరత్‌జీ ప్రసంగిస్తూ, పండిట్ దీనదయాళ్‌జీ జీవితం విశేషాలను సవివరంగా చెప్పారు. దీనదయాళ్ ఉపాధ్యాయ జీవితం అందరికీ ఆదర్శప్రాయమని చెప్పారు. బిర్లా పిలిచి ఉద్యోగం ఇచ్చినా వద్దని, దేశ సేవకే ప్రాధాన్యం ఇచ్చారు. సమాజ సేవ చేయడానికి ఆయన తీసుకున్న నిర్ణయం అసామాన్యంగా పరిగణించాలని అన్నారు.

26 యేళ్ల వయసులో భరతమాతకు తన జీవితం అంకితం చేశారని, జన సంఘ్‌ను ముందుకు తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషించారని భరత్‌జీ చెప్పారు. ఆయనకు రాజకీయం అంటే ఆసక్తి లేదు, పదవిపై వ్యామోహం లేదు. ఇచ్చిన పని పూర్తి చేయడమే ఆయనకు తెలిసిన విద్య అని భరత్‌జీ వివరించారు. పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూనే రచనా వ్యాసంగాన్ని చేపట్టారని, అత్యంత సాధారణమైన జీవితం గడిపారని కొనియాడారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నారన్నారు. మానవతే జీవన విధానంగా జీవించిన దీనదయాళ్ ఉపాధ్యాయ ఏకాత్మతా మానవ దర్శనంను ప్రతిపాదించారని చెప్పారు. ప్రకృతిలో మనిషి అంతర్భాగం అనే భారతీయ జీవన పద్ధతిని ఆయన రచనలు గుర్తు చేస్తాయన్నారు. మనిషితో సత్సంబంధాలు కొనసాగిస్తూ లక్ష్యం సాధించారు. మన సంస్కృతి, మనిషి వికాసం వల్లే అభివృద్ధి సాధ్యం అని దీనదయాళ్ ఉపాధ్యాయ అభిప్రాయపడేవారు. 750 కోట్ల ప్రపంచ జనాభాను కలుపుకుని వసుధైక కుటుంబం అని చెప్పగలిగే ఏకైక దేశం భారతదేశం. దేశంతో పాటు, ప్రపంచ శ్రేయస్సును కాంక్షిస్తూ అందరూ ముందుకు సాగాలి అని భరత్ పిలుపునిచ్చారు.

ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి మాట్లాడుతూ, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ భావాలు ఈ సంకలనాల రూపంలో మళ్లీ మన ముందుకు వచ్చాయని, ఆయన ఆలోచనల గొప్పదనం ఏమిటో ఈ పుస్తకాలు అవగాహన కల్పిస్తాయన్నారు. నేటితరం ఈ పుస్తకాలు చదవాలని హితవు పలికారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి కాబట్టి ఎన్నో సంఘటనలు తట్టుకుని నిలబడ్డారు. భారతీయ ముద్దు బిడ్డగా ఆయన్ను మనం గుర్తుంచుకోవాలి. మేధావి దీనదయాళ్ ఉపాధ్యాయ వంటి మహనీయుల ఆలోచనలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఇచ్చే నివాళి అని అన్నారు. దీనదయాళ్ ఉపాధ్యాయ గొప్పతనం, ఆయన మార్గ నిర్దేశం గురించి అందరూ తెలుసుకోవాలని, మహేష్ చంద్ర శర్మ ద్వారా దీనదయాళ్ ఉపాధ్యాయ ఆలోచనలు మనం తెలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు.

మణిపూర్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సురేష్ బాబు, పారిశ్రామికవేత్త, విశ్వహిందూ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజు తదితరులు ప్రసంగించారు. ముప్పవల సుబ్బయ్య, చిగురుపాటి నరేష్, అడ్డూరి శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్



**దాహంగా ఉన్నప్పుడు లీటరు 'మినరల్ వాటర్' తాగి ఆ సీసా పడేస్తే మనం వాతావరణాన్ని కలుషితం చేసినట్లేనా? ఇది ఒక ఉపాధ్యాయుడు విద్యార్థులను అడిగిన ప్రశ్న. విద్యార్థుల సమాధానాన్ని మీరు తేలికగా ఊహించగలరు. ప్లాస్టిక్ వాతావరణాన్ని కలుషితం చేస్తుంది అని. కానీ ఈ సమాధానానికి మీకు మూడోవంతు మార్కులే వస్తాయి. మీరు ఆశ్చర్యపోతారు, తక్కువ మార్కులు ఎందుకు వచ్చాయి? అని. ఈ ప్రశ్న సమాధానాలను కొంచెం లోతుగా విశ్లేషిద్దాం.**

ప్రశ్నలో రెండు భాగాలున్నాయి. ఒకటి ప్లాస్టిక్ సీసా. రెండు, మినరల్ వాటర్. మనం సహజంగా 'నీటి'ని విస్మరిస్తాం. ప్లాస్టిక్ గురించి మాత్రమే ఆలోచిస్తాం. నిజానికి మినరల్ వాటర్ కూడా వాతావరణాన్ని కలుషితం చేస్తుంది. ముందుగా నీటి గురించి చర్చిద్దాం. 'మినరల్ వాటర్' ఎలా తయారవుతుందో అందరికీ తెలుసు. భూగర్భజలాన్ని మోటార్ ద్వారా పైకి తోడి, ఓవర్ హెడ్ ట్యాంకులోకి పంపుతారు. తర్వాత దానిలో కరిగిన రూపంలో ఎక్కువగా ఉన్న లవణాలను 'రివర్స్ ఆస్మోసిస్' అనే ప్రక్రియ ద్వారా తొలగిస్తారు. ఈ ప్రక్రియకు ఒక

# కర్బన పాదముద్ర

ప్రత్యేక యంత్రం అవసరం. నీటిని తోడటానికి 'రివర్స్ ఆస్మోసిస్' చేయటానికి విద్యుచ్ఛక్తి అవసరం.

లీటరు నీరు బోరు బావి నుండి ఓవర్ హెడ్ ట్యాంకులోకి చేరాలంటే కరెంటు ఖర్చవుతుంది. ఈ కరెంటు ఉత్పత్తి కావాలంటే శిలాజ ఇంధనాలైన బొగ్గు, డీజిల్ వంటి వాటిని మండించి, తద్వారా వచ్చిన శక్తిని విద్యుత్‌గా మారుస్తారు. అంటే మనం కుళాయి ద్వారా వాడే ప్రతి నీటి చుక్క వెనుక కొంత బొగ్గు, లేదా ఇంధనం మండించాలి. బొగ్గును మండించినపుడు శక్తితోపాటు కార్బన్ డై ఆక్సైడ్, సల్ఫర్ డై ఆక్సైడ్, నత్రజని వాయువుల వంటివి విడుదలౌతాయి. ఈ వాయువులను హరిత స్పృహ వాయువులు అంటారు. ఇవి వాతావరణాన్ని కలుషితం చేస్తాయని మనకు తెలుసు. మనం చేసే పని వలన హరిత గృహ వాయువులు విడుదలైతే, దానిని ఆ పనికి సంబంధించిన కర్బన పాదముద్ర (కార్బన్ ఫుట్ ప్రింట్) అంటారు.

లీటరు 'మినరల్ వాటర్' తయారు కావాలంటే సుమారుగా 1.39 లీటర్ల బోర్‌వెల్ నీరు అవసరం. అంటే తయారైన ప్రతి లీటర్ మినరల్ వాటర్‌కి మూడువందల తొంభై మిల్లీ లీటర్ల నీరు వృథాగా పోతుందన్న మాట. అదే సోడా తయారీకి 2.02 లీటర్లు, బీరుకు 4 లీటర్లు, వైన్‌కు 4.74 లీటర్లు, హార్డ్ ఆల్కాహాల్ తయారీకి 34.55 లీటర్ల నీరు కావాలి. రోజులో మనం మూడు నుండి నాలుగు లీటర్ల నీరు తాగుతాం. ఆ నీటి తయారీలో సుమారు ఒకటిన్నర లీటర్ల నీరు ఉపయోగించకుండానే మురుగు కాలువలోకి వెళ్లిపోతుంది. నలుగురు

సభ్యులుండే ఇంటి నుంచి 'మినరల్ వాటర్' తయారీ వలన రోజుకు ఆరు లీటర్ల నీరు వృథాగా మురుగుగా మారుతుంది. రోజూ ఇరవై రెండు లీటర్లపైగా నీటిని 'బోర్‌వెల్' నుండి ట్యాంకులోకి చేర్చటానికి అవసరమైన విద్యుత్ ద్వారా వచ్చే కాలుష్యం దీనికి అదనం.

లీటరు మినరల్ వాటర్ తయారీకి అవసరమైన విద్యుత్ తయారీకి సుమారుగా రెండు వందల యాభై గ్రాముల బొగ్గు మండించాలి. 'మినరల్ వాటర్' బాటిల్‌ను దుకాణాలకు చేర్చటానికి మరికొంత ఇంధనం ఖర్చవుతుంది.

ఇక ప్లాస్టిక్ బాటిల్ తయారీకి సుమారుగా పావు లీటరు క్రూడాయిల్ ఖర్చు చేయాలి. లేదా 500 గ్రాముల బొగ్గు మండించాలి. అంటే సీసాలోని

రోజుకు 1.04 కిలోగ్రాముల కార్బన్ – డై – ఆక్సైడ్‌కు ఇది సమానం. అదే వ్యాయామం చేసే సమయంలో ఇంతకు ఏడెనిమిది రెట్లు కార్బన్–డై ఆక్సైడ్ విడుదల చేస్తాం.

ఒక లీటరు పెట్రోలు మండిస్తే 2.3035 కిలోల కార్బన్ డై ఆక్సైడ్ ($CO_2$) విడుదలౌతుంది. ఒక టన్ను $CO_2$ ను వాతావరణం నుండి తొలగించటానికి పదిహేను నుండి ఎనభై మూడు చెట్లు కావలి. చెట్లను పెంచటం ద్వారా కర్బన పాదముద్రను తగ్గించవచ్చు.

మన కర్బన పాదముద్రను క్రింది విధంగా లెక్కవేయచ్చు.

కరెంటు బిల్లు × 105

నెలవారీ గ్యాసు × 105

పెట్రోలు బిల్లు × 113



లీటరు నీరు తయారీ కంటే ఏడెనిమిది రెట్ల నీరు సీసా తయారీకి ఖర్చు చేయాలి. దాదాపుగా తొమ్మిది లీటర్ల నీటి ఖర్చుతో లీటరు మినరల్ వాటర్‌తో నిండిన ప్లాస్టిక్ బాటిల్ తయారవుతుంది. అలాగే ఏడు వందల నుండి ఎనిమిది వందల గ్రాముల బొగ్గును మండించాలి. ప్రపంచ వ్యాప్తంగా ఏటా యాభై బిలియన్ ప్లాస్టిక్ బాటిల్స్ చెత్తలోకి చేరుతున్నాయి.

మనం ఉపయోగించే కరెంటు, వాహనాలలో వాడే ఇంధనం, వంట చెరుకు, వంట గ్యాసు, మిల్లుల్లో తయారైన బట్టలు, పాదరక్షలు, రాతకు వాడే కాగితం, కలం, సెల్‌ఫోన్, సెల్‌ఫోన్ చార్జింగ్ ఇంట్లో వాడే రకరకాల పరికరాలు ఇవన్నీ మన కర్బన పాదముద్రను పెంచుతాయి. అంతెందుకు మనం విశ్రాంతిగా కూర్చుని ఉన్నపుడు కూడా నిమిషానికి పావులీటరు కార్బన్ డై ఆక్సైడ్ విడుదల చేస్తాం.

కారు, ద్విచక్రవాహనం

సంవత్సరంలో తిరిగిన దూరం × 0.79

విమానయానం చేస్తే సంవత్సరంలో ప్రయాణాలు × 1100

మొత్తం కూడితే వ్యక్తిగత కర్బన పాదముద్ర వస్తుంది.

ఇప్పుడు ఆలోచించండి, మనం కర్బన ఉద్గారాలు తగ్గించటానికి వ్యక్తిగతంగా ఏమైనా చేస్తున్నామా? మొక్కలు నాటి పెంచుతున్నామా? ఆలోచించండి.

దేశం అభివృద్ధి చెందాలంటే పారిశ్రామికీకరణ జరగాలి. దీనికి విద్యుచ్ఛక్తి అవసరం. అంటే ఎక్కువ పారిశ్రామికీకరణ అంటే ఎక్కువ హరిత గృహ వాయువుల విడుదల. అంటే భూమి ఎక్కువగా వేడెక్కుతుంది. ప్రపంచ దేశాలన్నీ ఈ విషయమై సమావేశమై ఒక్కో దేశం ఎంత పరిమాణంలో కర్బన



**వింజనంపాటి రాఘవరావు**

ఉద్గారాలను వెలువరించవచ్చో నిర్ణయించుకున్నాయి. ఈ ఒప్పందాన్నే 'క్యోటో ప్రోటోకాల్ అంటారు. అయితే కొన్ని దేశాలు తమకు కేటాయించిన దానికంటే తక్కువ శిలాజ ఇంధనాలను వాడటం వలన వాటి కార్బన్ ఫుట్ ప్రింట్ తక్కువగా ఉంటుంది. అంతేకాక అక్కడి అటవీ సంపద ఎక్కువగా ఉండటం వలన కర్బన ఉద్గారాల విడుదల కంటే వినిమయం ఎక్కువ. ఈ రెండింటి మధ్య తేడా, అంటే విడుదల కంటే వినిమయం ఎక్కువగా ఉంటే దాన్ని కార్బన్ క్రెడిట్ (Carbon Credit) అంటారు. ఎక్కువ కర్బన ఉద్గారాలు వెలువరించే దేశాలు మొక్కల పెంపకం ద్వారా కార్బన్ క్రెడిట్‌ను పెంచుకుంటాయి. తక్కువ ఉద్గారాలు వెలువరించే దేశాలు ప్రత్యేకమైన బాండ్ల ద్వారా కార్బన్‌క్రెడిట్‌ను అవసరమైన దేశాలకు అమ్ముతాయి. ఈ కార్యక్రమం మొత్తాన్ని కార్బన్ ఆఫ్‌సెట్టింగ్ (Carbon offsetting) అంటారు.

వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకునే పరిశ్రమలు, అపార్ట్‌మెంట్ నిర్మాణాలలో డెబ్బై శాతం నేల ఖాళీగా ఉంచి తప్పనిసరిగా చెట్లు పెంచాలని ప్రభుత్వాలు నిబంధన విధిస్తున్నాయి.

స్థానిక వనరుల వినియోగంతో కర్బన పాదముద్రను తగ్గించవచ్చు. ఏ వస్తువునైనా దూరం నుండి దిగుమతి చేసుకున్నట్లయితే ఈ పాదముద్ర పెరుగుతుంది. ఆహారపదార్థాల వంటి వాటిని, కొన్ని వస్తువులను వృథా చేయటం వలన కూడా కర్బన పాదముద్ర పెరుగుతుంది. దేన్నైనా వృథా చేయటం చట్టాలకు చిక్కని నేరం. ఈ నేరం చేయకుండా ఎప్పటికప్పుడు నియంత్రించు కోవాలి.

వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని పంచభూతాలను స్వచ్ఛంగా ఉంచుకోవాలని సనాతన ధర్మం చెబుతోంది. ఈ శాంతిమంత్రం అందరికీ తెలిసిందే. దీని అర్థాన్ని ప్రస్తుత ప్రపంచానికి అనుసంధానం చేసి ఆచరిస్తే ఈ భూమ్మీద సమస్త జీవరాశుల మనుగడ సుఖప్రదంగా ఉంటుంది.

**పృథ్వీశాంతిః ఆపఃశాంతిః అగ్నిఃశాంతిః**
**వాయుఃశాంతిః అంతరిక్షగ్ శాంతిః ఆదిత్యశాంతిః**
**చంద్రమా శాంతిః నక్షత్రాణిశాంతిః ఓషధయః శాంతిః**

**శాంతిరేవ శాంతిః** ★

# అక్టోబర్ 15 నుంచి దేవీ శరన్నవరాత్రులు

**శరన్నవరాత్రుల నిర్వహణలో ఆధ్యాత్మిక భావనతో పాటు సామాజిక బాధ్యత ఇమిడి ఉంది. ముఖ్యంగా విదేశీయులదాడులను ఎదుర్కొనేందుకు, స్వరాజ్య సాధన సందర్భంలోనూ ప్రజలను సంఘటితపరచి, చైతన్యవంతులను చేసేందుకు జాతీయ నాయకులు ఈ ఉత్సవాలను వేదికగా చేసుకున్నారు. అత్యాశతో అవకాశాలు (వరాలు) అందిపుచ్చుకొని లోక కంటకులుగా మారే వారికి శిక్ష దప్పదని, స్వార్థరహితంగా, పరమార్థ దిశగా, నలుగురికి ప్రయోజనం కలిగే దిశలో సాగాలని జగన్మాత చర్యలు చాటుతున్నాయి. నియంతృత్వపోకడలతో ధార్మికతను, ధార్మికశక్తిని, సనాతన ధర్మాన్ని అణచివేసే / అణచివేతకు యత్నించే భావపరంపర గలవారంతా అసుర లక్షణాలు కలవారేనని పెద్దలు వ్యాఖ్యానించారు. అలాంటి లక్షణాలు గల ఆధునిక మహిషాసురులను మర్దించేందుకు సజ్జనశక్తి జాగృతం కావాలి.**




భారతీయ సంస్కృతిలో శక్తి ఆరాధనకు విశిష్ట స్థానం ఉంది. దేవీ నవరాత్రులు శక్తి ఉపాసనకు ప్రతీకలు. ప్రకృతిలోని, మానవ ప్రవృత్తిలోని చెడులను దూరం చేయడానికి శక్తిని ఉపాసించ వలసిన ఆవశ్యకతను ఈ పండుగ గుర్తు చేస్తుంది. 'ధర్మం నశించి, అధర్మం పెరిగినప్పుడు ధర్మ సంస్థాపన కోసం ప్రతి యుగంలో నన్ను నేను సృష్టించుకుంటాను' అని శ్రీకృష్ణ భగవానుడు 'భగవద్గీత'లో చెప్పినట్లే 'దానవులు లోకంలో బాధలు కలిగించి నప్పుడల్లా వారిని సంహరించేందుకు అవతారాలు దాలుస్తుంటాను' (ఇత్థం యదా యదా బాధా దానవోత్థా భవిష్యతి/తదాతదా వతార్యాహం కరిష్యామి సంక్షయమ్) అని భగవతి చెప్పినట్లు 'దుర్గా సప్తశతి' పేర్కొంటోంది. ఆ ప్రకారమే, మధుకైటభు లను, శుంభనిశుంభులను, రక్తబీజుడిని, చండ ముండులను, మహిషాసురుడిని వివిధ రూపాలలో కడతేర్చి లోకాలను కాపాడారు. ఆశ్వీయుజ మాసంలో సకలలోక జనని ఆదిశక్తిని అనేక రూపాలుగా ఆరాధిస్తారు. శుద్ధ పాడ్యమి నుంచి నవమివరకు ఆదిశక్తి అవతారాలను రోజుకొక్కటి చొప్పున పూజిస్తారు. శైవులు, వైష్ణవులు, శాక్తేయులు స్వల్ప తేడాలతో దేవీపూజ చేస్తారు. నవరాత్రులలో నవదుర్గలను అర్చిస్తారు. శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కందమాత, కాత్యాయని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిధాత్రి అని 'దేవీకవచం' జగజ్జనని నవ రూపాలను పేర్కొంటోంది. అమ్మవారిని సాత్విక, రాజస, తామస అని మూడు విధాలుగా అర్చిస్తారు. యజ్ఞాలు, బలులు లేని పూజ సాత్వికం. బలులతో కూడిన పూజ రాజసం. జపయజ్ఞాలు లేకుండా సుర మాంసాది ఉపాహారాలు నైవేద్యంగా గల పూజ తామసం. దేశవ్యాప్తంగా ప్రస్తుతం సాత్విక విధానంలోనే పూజలు జరుగుతున్నా, కొన్ని ప్రాంతాలలో మిగిలిన రకాల పూజలు ఉన్నాయి.

ఒకప్పుడు దేవీ నవరాత్రులను వసంత రుతువులో (చైత్రమాసం) నిర్వహించేవారని, రామాయణ కాలం వరకు ఆ విధానం ఉండేదని చెబుతారు. రావణుడితో యుద్ధ సమయంలో శ్రీరామ చంద్రుడు ఆశ్వీయుజ మాసంలో చండీహోమం నిర్వహించి దుర్గాదేవి అనుగ్రహ పాత్రుడయ్యాడని, నాటి నుంచి శరదృతువులో నవరాత్రులు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని, అందుకే వీటిని శరన్నవరాత్రు లుగా వ్యవహరిస్తున్నారని ప్రతీతి.

నవరాత్రుల వ్రతం గురించి దేవీభాగవతంలోని తృతీయ స్కంధంలో వివరంగా ఉంది. దీక్షాకంకణధారులై తొమ్మిది రోజులూ కలశస్థాపన చేసి పొలిమేరలు

# పర్యావరణ పరిరక్షణి బతుకమ్మ

తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దంపట్టే పండుగ బతుకమ్మ. ఇది ఆ ప్రాంతవాసులు బతుకు చిత్రాన్ని ఆవిష్కరిస్తుంది. ప్రకృతిని ఆరాధించే అతి పెద్ద పండుగ. ధనిక-పేద, చిన్న-పెద్ద భేదం లేకుండా కలసికట్టుగా పాటలతో జరుపుకునే వేడుక. హైటెక్/ఆధునిక యుగంలోనూ అత్యంత ఆదరణ పొందుతున్న పండుగ అనడంలో అతిశయోక్తిలేదు. రాష్ట్రేతర, ప్రవాసాంధ్రులు ఈ వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు.

భాద్రపద అమావాస్య నుంచి ఆశ్వీయుజ శుద్ధ నవమి వరకు పండుగను ఎంతో సంబరంగా చేసుకుంటారు. ప్రకృతిని ఆధారం చేసుకుని భక్తి పారవశ్యంతో బతుకమ్మ తల్లిని కొలుస్తారు. ప్రకృతి అందాలను చాటి చెప్పే పండుగ ఇది. ప్రకృతిలో లభించే తంగేడు, గునుగు, గుమ్మడి, చేమంతి, గోరింట, సీతజడ, కట్ల, రుద్రాక్ష, బీర, గన్నేరు, సొర తదితర రకరకాల పూలను సేకరించి 'బతుకమ్మ'ను క్రమపద్ధతిలో పేరుస్తారు. వీటిలోని ఔషధ గుణాలు, సుగంధ పరిమళాలు ఆరోగ్యానికి హితమని వైద్య శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

పూలతో దేవతలను అర్చించడం సహజం. కానీ పూవులనే దేవతగా సంభావించడం బతుకమ్మ పండుగలోని ప్రత్యేకత. పూవులను గౌరీదేవిలా ఆరాధిస్తారు. ఈ తొమ్మిది రోజుల పాటు ఆలయ ప్రాంగణాల్లోనో, మైదానాల్లోనో, ఇళ్ల ముంగిటో బతుకమ్మను ఉంచి ఆమె చుట్టూ తిరుగుతూ 'బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు గౌరమ్మ ఉయ్యాలో...' లాంటి పాటలతో ఆనందంగా గడుపుతారు. పులిహోర, దద్ధోజనం, చక్కెర పొంగలితో పాటు ఆరు రకాల పొడులు (పల్లీలు, నువ్వులు, పెసర్లు, జొన్నలు, గోధుమలు, కొబ్బరి) తయారు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు.

బతుకమ్మ పండుగకు సంబంధించి సామాజిక, చారిత్రక గాథలు ప్రచారంలో ఉన్నాయి. ఒక కథనం ప్రకారం, చోళరాజ్యంలో ధర్మాంగద, సత్యవతి దంపతుల నూరుగురు పుత్రులు యుద్ధంలో మరణించగా, సత్యవతి కఠోర తపస్సు ఫలించి లక్ష్మీదేవి ఆమెకు కూతురుగా జన్మిస్తుంది. తాను బతికి ఎన్నో బతుకులకు దారి చూపే దేవతగా 'బతుకమ్మ'గా ప్రాచుర్యంలోకి వస్తుందని ఆమె

దాటకుండా ఈ వ్రతం చేయాలి. అవకాశం లేనివారు దుర్గాష్టమి, మహానవమి, విజయదశమి... ఈ మూడు రోజుల్లో అమ్మను ఆరాధించవచ్చని ఆధ్యాత్మికవేత్తలు చెబుతారు. ఎన్ని రోజులు పూజించారన్నది కాకుండా, ఎంత నిష్ఠతో అర్చించారన్నదే ఇక్కడ ప్రమాణం, ప్రధానం. దీక్ష నిరాటంకంగా సాగాలని, అభీష్టాలు సిద్ధించాలన్న ఆకాంక్షతో వెలిగించే అఖండ దీపం దీక్షా కాలమంతా కొండెక్కకుండా చూసుకోవాలి. నవరాత్రుల సందర్భంగా కన్యకాపూజ, సుమంగళి, పూజ, మహాచండీయాగం మున్నగునవి నిర్వహిస్తారు. దీర్ఘసుమంగళిగా ఉండాలని దేవిని భక్తిశ్రద్ధలతో అర్చిస్తారు. 2-10 సంవత్సరాల మధ్య వయస్సు గల వారితో చేయించే పూజను 'కుమారీ/కన్యకా పూజ'అంటారు. వీరిలో రెండేళ్ల వయసు శిశువును కుమారి, మూడేళ్ల చిన్నారిని త్రిమూర్తి, నాలుగేళ్ల పాపను కల్యాణి, అయిదేళ్ల బాలికను రోహిణి, అరేళ్ల బాలికను కాళిక, ఏడేళ్ల బాలికను చండిక, ఎనిమిదేళ్ల బాలికను శాంభవి, తొమ్మిదేళ్ల బాలికను దుర్గ, పదేళ్ల బాలికను సుభద్ర అని వ్యవహరిస్తారు. ఈ పూజ వల్ల కష్టాలు తొలగిపోయి,

# మోస్తుతే...!

అనుకున్నవి నెరవేరుతాయని, రోగ, శత్రు బాధ నివారణ మవుతుందని విశ్వాసం. శ్రీచక్ర పూజ కూడా ఈ సందర్భంలో ప్రాధాన్యత వహించింది.

దుర్గమ్మ పేరులో 'ద'కారం దైత్య నాశకం, 'ఉ'కారం విఘ్ననాశకం, 'గ'కారం పాపనాశకం. 'ఆ'భయ నాశక వాచకం. కనుకనే ఆ తల్లి నామాన్ని పలికినా, స్మరించిన సర్వపాపాలు నశిస్తాయని సాక్షాత్తు పరమశివుడే చెప్పినట్లు పురాణాలు పేర్కొంటున్నాయి. దుర్గమ్మ అవతారాలను మననం చేసుకుంటే... పాడ్యమినాడు జన్మించిన మహామాయ మహాకాళియై మధుకైటభులను సంహరించింది. విదియనాడు మహాలక్ష్మియై మహిషాసురమర్దిని అయింది. తదియ నాడు మహాసరస్వతిగా అవతరించి శుంభనిశుంభులను సంహరించింది, చవితినాడు యోగమాయగా నందుని ఇంట పుట్టి నందగా కంసుడిని భయ పెట్టింది. పంచమి నాడు విజృంభించి దమనుడు అనే రాక్షసుడిని చీల్చి రక్తదంతిగా పేరు పొందింది. షష్ఠినాడు శాకంబరి అయి కరవు కాటకాలను దూరం చేసింది. సప్తమి నాడు ఆవిర్భవించి దుర్గముడనే రాక్షసుడిని దునిమి దుర్గగా పేరుపొందింది. అష్టమినాడు మాతంగుని ఇంటి మాతంగినిగా జన్మించి అస్పృశ్యతను దూరం చేసింది. నవమి నాడు భ్రమరిగా అవతరించి భ్రమరాల సహాయంతో అరుణుడనే రాక్షసుడిని అంతమొందించింది. ఇలా అణచివేయడమో, సంహరించడమో, చేసి విజయ దుర్గగా లోకమాతగా నిలిచారు. ఈ విజయ పరంపరలన్నీ కలిపి జరుపుకునేదే విజయదశమి.

దేవదానవుల మధ్య హోరాహోరీ పోరు సాగుతున్న సమయంలో మహిషాసురుడు (దున్నపోతు) వరగర్వితుడై భౌతిక బలదర్పంతో విజృంభించాడు. నియంతగా వ్యవహరించాడు. వేదాలను దూషించాడు. యజ్ఞాలను ధ్వంసం చేశాడు. మునీశ్వరులను పీడించాడు. లోకాలు తల్లడిల్లుతున్నాయి. సజ్జనులు, ధర్మ పరాయణులు, దేవబృందం ఆతని దుశ్చర్యల గురించి విధాతకు మొరపెట్టుకున్నారు. 'అమేయశక్తి సంపన్నుడు మహిషుడు మరణంలేని వరం పొందాడు. అయితే, స్త్రీ శక్తిని తక్కువగా అంచనా వేసి, ఆమె చేతిలో చావులేని వరాన్ని పొందలేదు. కనుక అతను స్త్రీ చేతిలోనే మరణిస్తాడు. అయితే అతన్ని ఎదుర్కోగల స్త్రీ మూర్తి ఎవరు? ఆతని సంహారానికి ఒకరిద్దరు సరిపోరు. సంఘటిత తపోశక్తి, దైవశక్తి దీనికి అవసరం.




**డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి**

సీనియర్ జర్నలిస్ట్


తపోధనులు, దైవీ సంపన్నులైన మీరంతా మీమీ శక్తులను సంఘటితం చేయండి. దీనితో ఒక మహాశక్తిని సృష్టించి తద్వారా మహిషాసురుడిని మట్టుపెట్టవచ్చు' అని హితవు పలికాడు. ఆ ప్రకారం బ్రహ్మ తన ముఖం నుంచి పద్మరాగమణికాంతిని, శంకరుడు నల్లని శైలాకారాన్ని, శ్రీమహావిష్ణువు సర్వవ్యాప్తమైన ధవళకాంతిని ప్రసాదించారు. ఫలితంగా, అష్టభుజదేవియై, జగన్మోహనాకారమై, మహాశక్తి రూపిణిగా జగన్మాత అవతరించారు. సుజనులకు చల్లని తల్లిగా, కుజనులకు మహోగ్ర రూపంలో సింహవాహినిగా గోచరించారు. ఆమె గురించి అసుర గూఢచారులు మహిషుడికి తెలిపారు. ఆమె ముగ్ధసౌందర్యాన్నీ వర్ణించారు. కామమోహితుడైన మహిషుడు తనను వివాహమాడాలని 'అమ్మ'కు సందేశం పంపాడు. 'యుద్ధంలో నన్ను తగిన రీతిలో ఓడించి వివాహమాడవచ్చు' అని ఆమె ప్రత్యుత్తరం పంపగా, 'అదెంత పని' అనుకున్నాడు అసురుడు. ఇద్దరి మధ్య తొమ్మిది రోజుల పాటు భీకర పోరు సాగింది. మహిషుడు మహోగ్ర రూపంతో మాయా యుద్ధానికి దిగాడు. ఇక ఉపేక్షిస్తే లోకాలు సంక్షోభం చెందుతాయనే భావనతో, విష్ణువు ప్రసాదించిన సుదర్శన చక్ర ప్రయోగంతో అమ్మవారు అతనిని కడతేర్చారు. జగన్మాత శిష్టులకు రక్షగా నిలిచినట్లే, దుష్టులను శిక్షించక మానరని ఆధ్యాత్మికవాదుల విశ్వాసం. ★

---

పుట్టినప్పుడు మునులు ఆశీర్వదించారట. ఆ స్ఫూర్తితోనే 'గుమ్మడి పూలు పూయగా బ్రతుకు/తంగెడి పసిడి చిందగ బ్రతుకు/గునుగు తురాయి కులకగ బ్రతుకు/కట్ల నీలిమలు చిమ్మగ బ్రతుకు/బ్రతుకమ్మా బ్రతుకు/అమ్మని మరువని సంతానము గని/బ్రతుకమ్మా బ్రతుకు..' అని ప్రజాకవి కాళోజీ రాశారు. మరో కథనం ప్రకారం, భూస్వాముల అకృత్యాలను భరించలేక ఒక గ్రామీణ మహిళ బాలిక ఆత్మహత్య చేసుకోగా, ఆ ఊరి ప్రజలు చిరకాలం 'బతుకమ్మా' అని దీవించారని, ఆమె స్మృత్యర్థం పండుగను జరుపుకుంటున్నారని చెబుతారు. తమకు ఎలాంటి ఆపదలు వాటిల్లకూడదని, కుటుంబాలు చల్లగా ఉండాలని బతుకమ్మను కోరుకుంటారు. జీవితంలో ఒడుదొడుకులను అధిగమించి, జీవితాన్ని చక్కదిద్దుకునే తీరును బతుకమ్మ పాటలు వివరిస్తాయి.



కృష్ణా-మూసీనదుల సంగమ ప్రదేశంలో క్రీ.శ. 1211 'బ్రతుకేశ్వర స్థానం' ఉండేదని ఉమ్మడి నల్గొండ జిల్లా వాడపల్లిలో (ఓడపల్లి) దొరికిన కాకతీయ గణపతి దేవుని కాలానికి చెందిన శాసనం పేర్కొంటోంది. దానిని బట్టి అక్కడ బతుకమ్మలను నిమజ్జనం చేసేవారని తెలుస్తోంది.కాకతీయ రుద్రమ దేవి బతుకమ్మను ఆరాధించినట్లు సాహితీవేత్తలు పేర్కొన్నారు. ఆమె దేవగిరి రాజులపై విజయం సాధించి, రాజధాని ఓరుగల్లుకు చేరిన తరువాత విజయ సూచకంగా బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారని ఆచార్య తిరుమల రామచంద్ర రాశారు. మేలుగుంటు సోదరులు సుమారు ఎనిమిది శతాబ్దాల క్రితం అక్కడ బతుకమ్మ గుడిని నిర్మించారు. ★

కరోనా వారియర్ పేరు మారు మోగుతోంది. మొత్తం ప్రపంచమంతటా కాటలిన్ కరికో పేరే ప్రతిధ్వనిస్తోంది. విశ్వాన్ని వణికించిన మాయల మహమ్మారి కొవిడ్-19. అందులోని ప్రతీ అక్షరమూ రాకాసి రూపుగా మారి కరాళ నర్తనం చేస్తుంటే ఆసాంతం గడగడలాడలేదా జగతి? అంతటి ప్రాణాపాయ స్థితిలో 'నేను ఉన్నా' అంటూ ముందుకొచ్చి పోరాటయోధగా నిలిచి గెలిచారు కాటలిన్! వినూత్న రీతిన టీకాల పరంగా తనదైన పరిశోధన కేతనాన్ని ఎగురవేసి, వైద్యశాస్త్ర రంగాన ఈ సంవత్సరం నోబెల్ పురస్కార విజేత అయ్యారు. పలురంగాలతో పాటు వైద్యంలోనూ సాటిలేని మేటికి ఏటా ఈ పురస్కృతి పరిపాటి. ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రకోవిదుడు ఆల్ఫ్రెడ్ నోబెల్. స్వీడిష్ వాసి అయినా ఊరూవాడ అందరికీ చిరపరిచిత పేరు కాదూ అది! విశేష కృషి, విలక్షణ లక్ష్యం,విశిష్ట ఆచరణం నిండిన వారికే డిసెంబర్‌లో నోబెల్ స్మృతి సంచికగా అవార్డు ప్రదానం జరుగుతుంది. అంతటి బహూకృతిని మరో శాస్త్రకారుడితో సంయుక్తంగా అందుకోనున్న కాటలిన్ ఇప్పుడు మానవ సేవానాయిక. హంగరీలో పుట్టి అమెరికాలో ఉంటున్న ఆమె గురించి ఎంతైనా తలచుకోవచ్చు.

**'చెట్టు చేమలందో, గట్టు పుట్టలయందో**
**జంతుజాలమందో జన్మమిడిన్**
**బతికియుదును గదా'** అని మనిషి అనుకున్న రోజులవి!

**'ఇక భరించజాలనీ భయంకర బాధ**
**బతుకు దుఃఖతప్తం మహానరక ప్రాయం**
**ఆయువేదీ, ఔషధం ఇంకెక్కడ'** అని తల్లడిల్లిన కాలమిది.

అదిగో, సరిగ్గా ఆ రోజుల్లోనే విభిన్నయత్నం సాగించారు కాటలిన్. వ్యాధి నిరోధక టీకాల విధానంపైన చూపునంతటినీ కేంద్రీకరించారు. అప్పట్లో ఉన్నదల్లా కేవలం సంప్రదాయ పద్ధతి.

అత్యంత సూక్ష్మమైన వైరస్ విష పదార్థాలు ఇతర జీవుల కణాలపైన విరుచుకుపడితే, విజృంభించేది వ్యాధులే మరి. ఆ విపత్కర వాతావరణం నుంచి మానవాళిని పరిరక్షించాలంటే; లక్షిత రీతిన

# ఆరోగ్య భాగ్య 'కాటలిన్'


కాటలిన్

వైరస్‌లనో, వాటి భాగాలనో ఇబ్బడిముబ్బడిగా పెంపు చేయాల్సి ఉంది. అటు తర్వాతే శుద్ధీకరణ జరపాల్సి ఉంటుంది. క్రమానుగత దశలన్నీ అయ్యాకే, వ్యాక్సిన్ల ఉత్పత్తి సాధ్యమవుతుంది. అంటే, నిర్ణీత వైరస్‌లను దేహభాగంలోకి చేర్చాలి. అదే అంతకు ముందటి వరకూ ఉన్న రీతి. అందుకు భిన్నమైన ఆలోచన చేశారు కాటలిన్. జన్యు సంకేత తీరుతెన్నులను సమూలంగా సమగ్రంగా పరిశీలించారు. ప్రస్తుతం పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయంలో ప్రాచార్యురాలిగా ఉంటున్న తాను వేరే యోచనకు శ్రీకారం చుట్టారు. నిశ్చిత వైరస్‌లోని ఎంపిక భాగాన్ని ఉత్పత్తి చేయడం పెద్ద పని. ఆ మేర కణాలకు ఆదేశాలనేవి ఉంటుంటాయి. వాటిని అవగాహనకు తెచ్చుకో వాల్సింది మన లోపలి కణాలే. అప్పుడే ప్రొటీన్స్ (కృత్తులు) రూపుదిద్దుకుంటాయి. ఫలితంగా శరీరం ఫలవంతంగా వ్యాపితమవుతుంది. టీకా ప్రభావానికి సానుకూలత అప్పుడే సిద్ధిస్తుంది. ఇదీ కాటలిన్ పరిశోధనకు సంబంధించిన కీలకాంశం.

**శ్రమఫలితం**

ఆమె శోధన, సాధన అంతటితో ఆగలేదు. మరింత వేగంగా దూసుకెళ్లింది. తయారీ కృత్తుల వల్లనే మనిషిలోని వ్యాధి నిరోధక వ్యవస్థ స్పందిస్తుందని రుజువైంది. అంటే

అర్థం.... యాంటీ బాడీలు, తదితర ప్రయోజనకర కణాలు విడుదల కావడం. దీంతో, ఇక ముందు ఎప్పుడైనా వైరస్ దాపురిస్తే, స్పందన ప్రక్రియ వేగవంతమవుతుంది. దానివల్ల ఇన్‌ఫెక్షన్ల బెడద ఎదురుకాదు. దీనంతటినీ ప్రభావాత్మకంగా రూపొందించారామె. మెసెంజర్ పద్ధతిగా దీన్ని అభివర్ణించారు. అయితే ఇదంతా ప్రయోగశాల ఫలితమే, వృద్ధికి పర్యవసానమే. దీన్ని (తయారీ) శరీరంలోనికి చేరిస్తే, ప్రతి చర్య ఉండదా? అనవచ్చు. ఉంటుంది తప్పకుండా. మరి ఈ అవరోధాన్ని ఎదుర్కోవడం ఎలా? అనే దానిపైనే ఆ శాస్త్రజ్ఞురాలు చూపు సారించారు. నిరంతర శ్రమ పర్యవసానంగా ఫలితం సాధించగలిగారు. అదే 'అద్భుత ఔషధంబు, ఆయురారోగ్యత మఖిల శుభకరమ్ము..ఆర్తి హరమ్ము' అనేలా ఫలించింది. పలు జాగ్రత్తలతో టీకాలను ఆవిష్కరించడం, వాటిని అన్ని విధాలా వృద్ధిపరచడం సాధ్యమైంది. ఎటువంటి సంక్రమణ వ్యాధినైనా తిప్పికొట్టగలిగే మందుకు మార్గం కంటి ముందు కనిపించింది. చికిత్స రంగంలో సరికొత్త అధ్యాయం ప్రత్యక్షమైంది. శాస్త్ర విజ్ఞాన పటిమల్లనే కొవిడ్‌కు వ్యాక్సిన్లు లభించినట్లయిందని ఆ వనితా పరిశోధనమణి తేటతెల్లం చేశారు. కాబట్టే అత్యున్నత పురస్కారం తనను ఏరికోరి వరించి వచ్చినట్లయింది.

**ప్రయోగాల వెలుగులో...**

కారు చీకట్లో కాంతిరేఖలా ప్రభవించింది కాటలిన్ శాస్త్ర శోధన, వైరస్‌ను నిలువరించ ఔషధ వృద్ధికి కృషి ఎంతో ముమ్మరమైంది. ఈ క్రమంలో ఎంతగా పరిశ్రమించారో; శక్తి సమయం, వనరులను ఎంత పరిపూర్ణంగా వెచ్చించారో ఆమెకు మాత్రమే బాగా బాగా తెలుసు. ఇలా వైద్య విభాగాన పరమోన్నతికి అర్హత సాధించి గెలుపుబావుటా ప్రదర్శించిన లలనల్లో తాను పదమూడోవారు. జీవిత స్వప్నాన్ని సాకారం చేసుకున్న కాటలిన్‌కు ఇప్పుడు ఏడు పదులలోపు వయసు. తన బాల్యం పేదరికంలో గడిచింది. ఊళ్లో చిన్నపాటి ఇల్లు. అందులోనే ఇరుకు ఇరుకుగా నివాసం. తల్లిదండ్రులు శ్రమజీవులు. అంతటి బీదరికంలోనూ ఆమె ప్రతిభ ఎంతెంతో వికసించింది. బయాలజీలో డిగ్రీ చేశారు. బయో కెమిస్ట్రీలో పీహెచ్‌డీ సాధించారు. హంగరీలోనే బయోలాజికల్ రీసెర్చి సెంటర్ వరంగా పరిశోధనలూ ప్రయోగాలూ నిర్వహించారు. అటు తర్వాత అమెరికా పయనం. ఆ దంపతులకు ఒకరే సంతానం. ఫిల్‌డెల్ఫియాలో ఉన్న యూనివర్సిటీ కేంద్రంగా పరిశోధన ప్రక్రియల్ని ఆమె వేగవంతం చేశారు. ఆ వర్సిటీ నుంచి ప్రోత్సాహకాలు స్వీకరించారు. కృషిలో భాగంగా తాను చేసిన కొన్ని




ప్రతిపాదనలు స్వీకరణకు, మరికొన్ని తిరస్కరణకు! అయినా నిరాశ చెందకుండా రాత్రింబవళ్లూ ప్రయోగాల పరంపర కొనసాగిస్తూ వచ్చారు. నిధులలేమి ఎదురైనా వెరవలేదు. వృత్తిపరంగా నిరాశలు చుట్టుముట్టినా జంకనూ లేదు. లక్ష్యం నెరవేరేందుకు ఎంత చేయాలో అంతా చేశారు. దూషణభూషణ తిరస్కారాలను సమంగా స్వీకరించిన సహనశీలి. అదే తత్వం ఆమెను ఇవాళ నోబెల్ విజేతగా నిలిపింది.



**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్

**నవోత్తేజం అంటే ఇదే**

**'విరిగిపోవును లెమ్ము వెలుగు వెల్లువలలో**
**ఘోర దారిద్ర్యాంధకార ధార,**
**కరిగిపోవును సుమ్ము కలుషితాంతః**
**కల్పింతంబైన రణమేఘ డంబరమ్ము'**
**తొలగిపోవును లెమ్ము ధూమకేతు క్షోభ**
**రూపుదాల్చిన అనారోగ్య పీడ,**
**అణగిపోవును సుమ్ము అక్రమ వ్యాపార**
**సంభూత భయద దౌర్జన్య కాండ**
**కాంతి శాంతి సుఖమ్ము భాగ్యమ్ము నొసగు**
**నవారోగ్య కాంతి శోభిల్లులెమ్ము**
**బహువిధారిష్టములు భస్మపటలమగును**
**కొత్త వెలుగుల జగతి తళుకొత్తు సుమ్ము'**

అనేలా బాధలూ, వ్యాధులూ దారిద్ర్యాలూ అన్నింటినీ తొలగతోస్తూ కాటలిన్ సృజించిన ప్రక్రియ ప్రపంచానికి వెలుగుదివ్వె అయింది. ఆర్థిక ఇబ్బందుల్ని తట్టుకుని ముందడుగు వేసిన ఆ శాస్త్రికారిణికి మహోన్నత పురస్కృతి దరిచేరింది. నగదు మొత్తాన్ని చాలా మటుకు పెంచారు నోబెల్ నిర్వాహకులు. ఈ పురస్కారం ఎందరెందరో శాస్త్రవేత్తలు అందునా మహిళా పరిశోధకులకు ఉద్దీపన. వ్యాధిపైన పోరు యోధురాలికి పరమోత్కృష్ట సంభావనను నిఖిలావని అంతా స్వాగతిస్తోంది. వనితా శక్తి సంపన్నతకు ముక్తకంఠంతో జేజేలు పలుకుతోంది. జయోస్తు. ★

# కూకట్‌పల్లి భాగ్ విద్యార్థి సాంఘిక్

**భాగ్యనగర్:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల వైపు ముందడుగు వేస్తున్న తరుణంలో సికింద్రాబాద్ విభాగ్ కూకట్‌పల్లిభాగ్, ఈ సంవత్సరం ప్రతీ బస్తీలో ఒక విద్యార్థి శాఖ,ఒక ఉద్యోగి శాఖ ఉండాలి అనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నది. ఈ లక్ష్య సాధనలో భాగంగా ఈ నెల 1వ తేదీన భాగ్‌లో ఉన్న అన్ని విద్యార్థి శాఖల సాంఘిక్ నిర్వహించడం జరిగింది. ఈ సాంఘిక్ లో 66 విద్యార్థి శాఖలు నుండి 463మంది బాల స్వయంసేవకులు, 142 మంది కళాశాల విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరితోపాటు మరో 160 మంది అన్య స్వయంసేవకులతో కలిపి మొత్తం 765 మంది స్వయంసేవకులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యవక్తగా తెలంగాణ ప్రాంత సహ ప్రాంత ప్రచారక్ కల్వగూరి ప్రభుకుమార్ విద్యార్థి స్వయంసేవకులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి భాగ్ సంఘచాలక్ గొట్టుముక్కల సుభాష్ చంద్రబోస్ పాటు సికింద్రాబాద్ విభాగ్ ప్రచారక్, విభాగ్ కార్యకారిణి తదితరులు పాల్గొన్నారు ★






***"శతేషు జాయతేశూర సహస్రేషుచ పండిత।***
***వక్తా శత సహస్రేషు, దాతా భవతి వానవా।"***

**వందలమందిలో ఒక శూరుడు ఉంటాడు. కొన్నివేల మందిలో ఒక పండితుడు ఉంటాడు. కొన్ని లక్షల మందిలో ఒక వక్త ఉంటాడు. కాని కొన్ని లక్షల మందిలో ఒక్క దాతైనా ఉంటాడో ఉండడో చెప్పలేం. బుడ్డా వెంగళరెడ్డి కొన్ని లక్షలమందిలో అపురూపంగా కనబడే మహాదాత.**

ఈనాటి కడప జిల్లాలోని జమ్మలమడుగు తాలూకా, కర్నూలు జిల్లాలోని కోవిలకుంట్ల తాలూకాలను కలిపి పూర్వం 'రేనాడు' అనేవారు (కొందరి ప్రకారం రెడ్డినాడు).

1866లో రాయలసీమ దారుణమైన క్షామానికి గురైంది. అది ధాత నామ సంవత్సరం. అందుకే చరిత్రలోనే దాని పేరు 'ధాత కరవు'గా స్థిరపడింది. అనంతపురం మండలంలో ప్రారంభమై మొత్తం రాయలసీమను చుట్టబెట్టింది. అంతటి క్షామంలో బుడ్డా వెంగళరెడ్డి మూడు నెలలు ప్రజలను కన్నబిడ్డలవలె చూసుకున్నారు. 12 పాతర్ల ధాన్యం ఖర్చు చేశారు (12×120=1440 బస్తాలు). తన దగ్గరున్న ధాన్యం నిండుకుంటే, మిత్రుల దగ్గర ధాన్యం అప్పు చేసి క్షుధార్తులను ఆదుకున్నారు. అయితే, 'దాత దరిద్రా కృపణో ధనాఢ్య:' (ధనాఢ్య దాత దరిద్రుడౌతాడు, పిసినిగొట్టు కోటీశ్వరుడు అవుతాడు). వెంగళరెడ్డి విషయంలోనూ ఇది రుజువైంది.

లఘు వీరగాథలలో వెంగళరెడ్డి పాట ప్రశస్తమైనది. అంత ఖ్యాతి రాయలసీమలో మరొక పాటకు లేదు. బస్సులలోనూ, రైళ్లల్లోనూ ఈ పాటను బిచ్చగాళ్లు పాడుతూ ఉంటారు. ముఖ్యంగా కుంటి, గ్రుడ్డివారు ఎక్కువ పాడు కుంటారు. వెంగళరెడ్డి రేనాటి దానకర్ణుడు. రేనాటి సీమకు ఉయ్యాలవాడ నరసింహ రెడ్డి సూర్యుడు కాగా, వెంగళరెడ్డి చంద్రుడు. ఈ సూర్యచంద్రులిరువురు ఉయ్యాలవాడ వారే. 1822లో జన్మించిన వెంగళరెడ్డి 1900లో మరణించాడు. సైరా నరసింహారెడ్డి విప్లవ కాలంలో వెంగళరెడ్డి యువకుడు. వెంగళరెడ్డి దానశీలతకు అబ్బురపడిన విక్టోరియా మహారాణి 1866లో స్వర్ణ పతకం బహూకరించింది. ఇది ఉయ్యాలవాడలో వారి వంశస్థుల దగ్గర ఇప్పటికీ ఉంది (ఆచార్య తంగిరాల సుబ్బారావు విక్టోరియా రాణి పతకాన్ని తాను చూసినట్లు 17-4-1966న నమోదు చేశారు. మేలిమి బంగారంతో చేసిన 20 తులాల ఆ పతకం వడ్డాణం మాదిరి ఉన్నది). ఈ పతకం ముందు భాగంలో ఆంగ్లంలోనూ వెనుక తెలుగులోనూ ఇలా రాసి ఉంది.

Presented to Buddha Vengala Reddy as a token of the high appreciation of Her Majesty's Government of his munificent Liberality to his destitute countrymen in the famine of 1866 (1866 సంవత్సరంలో క్షామం సంభవించినప్పుడు నిరాధారంగా మిగిలిన సాటి ప్రజానీకం పట్ల ప్రదర్శించిన ఉత్కృష్టమయిన ఔదార్యానికి గుర్తుగా

# రేనాటిసీమకు చందమామ



హర్ మెజెస్టీ రాణి ప్రభుత్వం బుడ్డా వెంగళరెడ్డికి ఇచ్చిన బహుమానం).

పూర్వం నుండి వీరగాథల (Ballads) లోనూ, వీరగాథానికల (Balladings) లోనూ తరచు యుద్ధవీరుల ప్రశంస సంప్రదాయం. పేరంటాండ్ర కథలలోను, కట్ట పదాలలోనూ త్యాగ వీరత్వం ఉంటుంది. దాన వీరమును ప్రశంసించు కథానికలు కూడ తెలుగులో కొన్ని ఉన్నాయి. మానవసేవే మాధవసేవగా భావించి కరవు కాటకాల సమయంలో సాటి మానవులకు తమ సర్వస్వం ఇచ్చిన కలియుగ దానకర్ణులపై గూడ జానపదులు భక్తి ప్రపత్తులతో పాటలు పాడుతూ ఉంటారు. రాయలసీమలో బుడ్డా వెంగళరెడ్డి, యాదాళ్ల నాగమ్మ, చిన అండ్లూరి శివమ్మ, మోదిన ఫకర్‌దిన్ వంటి వారిపై ఇలాంటి పాటలు ఉన్నాయి. నెల్లూరు మండలంలో కోడూరి బాలకోటారెడ్డిపైన, గోదావరి మండలంలో డొక్కా సీతమ్మ పైన కూడా ఇలాంటి పాటలు పుట్టాయి. ఇవి కేవలం ప్రశంసలే. అయితే, జానపద గేయాలు (Folk songs) అని అంటాం. కానీ గాథానికలు కానేరవు కాని వీటిలో వెంగళరెడ్డి, డొక్కా సీతమ్మపైన వచ్చిన పాటలలో గాథా కథనం ఉన్నది. అందుచేత ఇవి వీరగాథానికలే. ఆచార్య తంగిరాల 'రేనాటి సూర్యచంద్రులు' (ఉయ్యాలవాడ నరసింహారెడ్డి యుద్ధ వీరగాథ, విప్లవకాలం క్రీ।।శ।। 1845-1847; బుడ్డా వెంగళరెడ్డి దాన వీరగాథానిక, జీవితకాలం క్రీ।।శ।। 1822-1900) అనే పరిశోధన గ్రంథం రాశారు. వెంగళరెడ్డి దానధర్మాలపై ఎన్నో కథలు, జనపదాలలో వ్యాప్తిలో ఉన్నాయి. రాయలసీమ జానపదులు ఇలా పాడుకుంటున్నారు.

***ఉత్తరాది ఉయ్యాలవాడలో ఉన్నది- దరమం సూడరయా***
***నేటికి బుడ్డా వెంగళరెడ్డీ - దొడ్డ ప్రెబువని తెలియదయా***
***దొడ్డ ప్రభువనీ దొరలు మెచ్చగా - ఇదుపున గూర్పోనుండనయా***

ధాత కరవులో తమ ప్రాణాలు నిలిపిన రాయలసీమ దానకర్ణుడిని జనం ఇలా దీవిస్తారు.

***దానం, ధరమం గ్యానం తెలిసీ - ధరమరాజువలె ఏలెనయా***
***సచ్చిన బతికిన ఎంగళరెడ్డికి - స్వర్గలోకమే ఉన్నదయా!***
***పున్నెం సేసిన వెంగలరెడ్డి పూలపానుపూ ఉందునయా***
***మాటా సొచ్చం తెలిసిన ప్రెబువని - మల్లెపూల పాన్పేతురయా,***

**అలాగే కొన్ని కథనాలు:** మండు వేసవిలో ఓ బ్రాహ్మణుడు, దాహంగా ఉంది మజ్జిగ ఇమ్మన్నాడట వెంగళరెడ్డి భార్యను. ఆమె బద్ధకించి లేదన్నదట. వెంగళరెడ్డికి కోపం వచ్చి పాడిలేని ఇంట ఆవు ఎందుకంటూ ఆ ఆవునే దానం చేశాడు. ఇలాంటిదే మరొకటి- ఒక బ్రాహ్మణుడు తన కుమారునికి ఉపనయనం చేసుకుంటానంటే మొలనున్న బంగారు మొలత్రాడును దానం చేసిన మహాదాత వెంగళరెడ్డి. మరో సంఘటన. ఓ ఫకీరు స్త్రీ వచ్చి కట్టుకోవడానికి ఏదైనా చీర ఇమ్మన్నదట. వెంగళరెడ్డి భార్య పుట్టింటివారు



విక్టోరియా మహరాణి బుడ్డా వెంగళరెడ్డికి ఇచ్చిన పతకం

పెట్టిన పట్టుచీరను ఆ బిచ్చగత్తెకు ఇచ్చివేశాడట. అది చూసి వెంగళరెడ్డి భార్య దానమిచ్చిన పట్టుచీర తీసుకొని వేరే నూలు చీర ఇచ్చిందట. దానితో వెంగళరెడ్డి బాధపడి బిచ్చగత్తెకు కొత్త పట్టుచీర కొని ఇచ్చాడట.

**మరో ఐతిహ్యం:** వెంగళరెడ్డి దగ్గర బలిసిన యెద్దొకటి ఉండేది. ఊరిలోని సన్నకారు రైతులు (మాల, మాదిగ) మీరు ఆ ఎద్దును దానం చేస్తే, మా దగ్గర ఓ ఎద్దుంది. ఆ జతను బండిగట్టి జీవనయానం కొనసాగించగలమన్నారట. వెంగళరెడ్డి తన ఎద్దును దానం ఇచ్చాడు. విషయం తెలిసిన వెంగళరెడ్డి సొంత పనివారు ఆ రైతులను చితకబాది ఆ ఎద్దును తోలుకొచ్చేశారట. ఈ విషయం తెలిసి వెంగళరెడ్డి ఆ రైతులకు చికిత్స చేయించి మళ్లీ ఆ ఎద్దును వారికే ఇచ్చాడట. కానీ ఆ రైతులు పునరాలోచన చేసి ఈ దానకర్ణుడి ఎద్దును మనం తీసుకుంటే వ్యవసాయం చేయలేడు, పంటలు పండవు. కరవు ప్రాంతంలో భోజనం పెట్టేవాడుండడని తిరిగి వెంగళరెడ్డికే అప్పజెప్పారట.

ఒకనాడు వెంగళరెడ్డి గుర్రం మీద చెన్నపట్నం వెళుతున్న సంగతి తెలిసి నలుగురు శత్రువులు చంపడానికి పథకం వేశారు. ఇంతకీ ఆ నలుగురిలో ఒకడు రెడ్డి గారి అభిమానే. కాబట్టి రహస్యంగా ఆ వార్తను ముందే వెంగళరెడ్డికి చేరవేశాడట. అనుకున్న ప్రకారం ఆయన వెళుతుండగా అడ్డగించారట. నాయన మీరు భోజనం చేసి ఎన్నిరోజులైందో! మంచి భోజనం పెడతాను, తిన్నాక చంపమన్నాడట. వాళ్లు రెడ్డిగారి కాళ్లపై పడ్డారట. వాళ్లకు భోజనం పెట్టించి, బియ్యం ఇచ్చి పంపాడట. తనను చంపబోతున్నారన్న తెచ్చిన వ్యక్తిని తానే పెంచి, వివాహం కూడా చేశాడు. వెంగళరెడ్డి ఎన్ని రకాల దానాలు చేశాడో చెప్పే ఈ పాటలో ఒకచోట ఈ వర్ణన ఉంది.




కాశింశెట్టి సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు


**హరి నారాయణ అన్న వారికీ అన్న వస్తరము లిప్పించెనయా**
**గోయిందాయని పాడే జనులకు - గోవు దానమే చేసెనయా**
**పాలు లేని పసిబాలురకెల్లా - పాల సలేంద్రలు పెట్టెనయా**
**పెళ్లిళ్లు కాని బీద జనులకూ - పెళ్లిళ్లే సేయించెనయా**
**కాలులేని కరమొండి వాళ్లకు - ఒంటెద్దు బళ్లు సేయించెనయా**
**కుంటివాళ్లకూ గుడ్డివాళ్లకూ- ఈడూ జోడూ మనుములు సూసీ**
**పెళ్లిళ్లే సేయించెనయా - పెళ్లిళ్లే సేయించెనయా**

ఉయ్యాలవాడలో ఉన్న వెంగళరెడ్డి వంశీకులు నేటికి ఉగాదికి ఆయన సమాధి దగ్గర దివ్యాంగులకు, అంధులకు పంచ భక్ష్య పరమాన్నాలు పెడతారు. పెద్ద ఎత్తున అన్నదానం చేస్తారు. వేలాదిగా బిచ్చగాళ్లు వస్తారు. వీరంతా భోజనానికి ముందు వెంగళరెడ్డికి విక్టోరియా మహారాణి ఇచ్చిన స్వర్ణ పతకాన్ని తప్పనిసరిగా కన్నుల కద్దుకొంటారు. అంధులు చేతులతో తాకి ఆ చేతులను ముద్దు పెట్టుకొంటారు. వెంగళరెడ్డి అన్నదానమే చేసేవారు. ధనదానం చేసేవారు కాదు. మనిషి ప్రాణాలు నిలిపేది పరబ్రహ్మ స్వరూపమైన అన్నమేనని ఆయన నమ్మకం.

రేనాటిచంద్రుడి గురించి పాణ్యం సోదరకవులు (పాణ్యం నరసరామయ్య, పాణ్యం లక్ష్మీనరసయ్య) ఇలా రాశారు.

**కలియుగ దానకర్ణుడనగా నుతికెక్కుచు, నాంగ్ల రాజ్ఞిచే**
**గలిత యశస్సువర్ణ పతకంబు బహూకృతి పొందినట్టియ**
**య్యలఘుడు దానశీల మహితాత్ముడు, వేంగళరెడ్డి గారికిన్**
**సులలిత జన్మభూమి యగుచున్, గణనీయతగాంచె మీదటన్**

★



సుందర హర్మ్యాలు, మణిమయ భవనాలు, స్వర్ణద్వారాలు, సువాసనలు వెదజల్లే పుష్పాలు, ఉద్యానవనాలతో, సరస్సులతో కొండపైన ఉన్న లంక కైలాసంలా, ఆకాశానికి తగిలించిన సుందర చిత్రపటంలా వానరసేనకు అగుపించిందం టాడు వాల్మీకి మహర్షి. ఆయన రామాయణంలో రావణరాజ్యం శ్రీలంక వర్ణన ఇది. ఆ స్వర్ణద్వారాలు, మణిమయ భవనాలు లేకున్నా ఆధునిక శ్రీలంక సుందర ఉద్యానవనాలు, కలవలూ తామరలతో కొలనులు, అద్దాల వంటి రహదారులు, వృక్షసంపదతో ఎలాంటి వారినైనా ఆకట్టుకునేలా ఉంది. ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నప్పటికీ, ప్రజలు ప్రశాంతంగా, చిరునవ్వుతోనే కనిపిస్తారు. ఇటీవలే దేశ అధ్యక్ష భవనంపై దాడి చేసి, తిరుగుబాటు చేసింది వీరేనా అని ఎవరికైనా అనిపించకమానదు. పుట్టిన చోట దాదాపు కనుమరుగైనా, అక్కడ మాత్రం క్రీపూ రెండవ శతాబ్దం నుంచి నేటివరకూ బౌద్ధం నిరాటంకంగా కొనసాగుతున్నది.

# శ్రీలంక...

బౌద్ధం అత్యున్నత స్థాయిలో విలసిల్లిన రాజ్యం శ్రీలంక. మౌర్య చక్రవర్తి అశోకుని కుమారుడు మహేంద్రుడు, కుమార్తె సంఘమిత్రలు క్రీపూ రెండవ శతాబ్దంలో పరిచయం చేసిన బౌద్ధాన్ని నేటికీ అనుసరిస్తున్నారు. నాటి పాలకుడైన దేవానామ్ పియ-తిస్స ఆహ్వానంతో వెళ్లిన మహేంద్రుడు బౌద్ధానికి అంకురార్పణ చేశారు. మహేంద్రుడు అనుయాయులతో కలసి అనురాధపురానికి 8 మైళ్ల దూరంలో గల మిహినతలె కొండ (పురాతన శాసనలు దొరికిన స్థలం)కు చేరుకుని తిస్సకు బౌద్ధ బోధనలను వినిపించి, బౌద్ధంలోకి తీసుకువచ్చారు. తర్వాత రాజు ఆహ్వానం మేరకు మహామేఘ ఉద్యానవనంలో స్థిరపడిన బౌద్ధ భిక్షువులు మొదట రాచకుటుంబానికీ, అనంతరం సామాన్య ప్రజలకూ బోధించడం ప్రారంభించారు. సంఘమిత్ర మూల బోధివృక్షం నుంచి ఒక కొమ్మను తీసుకునివెళ్లి అనురాధపురంలో నాటిందని చెబుతారు. నాటి నుంచి నేటివరకూ బౌద్ధులు ఆ బోధివృక్షాన్ని పరిరక్షించు కుంటూ వస్తున్నారు.

ఒకటవ శతాబ్దంలో ఆ దేశపాలకుడైన వత్తగామిని పాలనలో బౌద్ధ భిక్షువులు ఆలోక విహారంలో సమావేశమై, 'త్రిపీఠిక'లను పాళీ భాషలో తొలిసారి రచించారు. వాస్తవానికి ప్రముఖ తెరవాద బౌద్ధ తత్వవేత్త ఆచార్య బుద్ధఘోషుడు నేటి ఆంధ్రప్రదేశ్‌లోని పలనాడు జిల్లా, పిడుగురాళ్లకు సమీపంలోని కోటనెమలిపురకు చెందినవాడని చరిత్రకారుడు డాక్టర్ శివనాగిరెడ్డి చెప్తున్నారు. బుద్ధఘోషుడు అక్కడి నుంచి శ్రీలంకకు వెళ్లి అక్కడి కొండగుహలలో నివసించి క్రీశ 5వ శతాబ్దంలో 'విశుద్ధిమగ్గ'ను రచించారని ఆయన చెప్పారు.

**బౌద్ధంలో ప్రధాన స్రవంతులు**

బౌద్ధంలో హీనయాన, మహాయాన అన్నవి రెండు ప్రధాన స్రవంతులుగా కొనసాగుతున్నాయి. బుద్ధుని నిర్యాణానంతరం వెంటనే మహా కాశ్యపుడి అధ్యక్షతన జరిగిన తొలి సంఘ సమావేశంలోనే స్తవిరవాదులు లేక తెరవాదులు బుద్ధుడు సన్యాసుల జీవన విధానంలో పాటించవలసిన పది సూచనలు, నిషేధాలను పాటించి తీరాలని పట్టు బట్టినప్పుడు అత్యధికులు తిరస్కరించారు. ఆ తరువాత వారు రెండుగాచీలిపోయి అత్యధికులు తమను తాము మహాసంఘికులుగా అభివర్ణించుకున్నారు. ఈ తొలి చీలికే అనంతర కాలంలో, తెరవాద, మహాయాన, వజ్రయాన (మహాసంఘిక స్రవంతి ఒక్కటే 283 బిసిఇ నాటికి మూడు భిన్న శాఖలకు జన్మనిచ్చిందనే వాదన ఉంది)గా విస్తరించింది. వాస్తవానికి ఇంకా అనేక స్రవంతులు వచ్చాయని చరిత్రకారులు చెబుతున్నారు. వారిలో ఎన్ని చీలికలు, శాఖలు పుట్టుకువచ్చినప్పటికీ వారంతా కూడా బుద్ధుని బోధల సారాంశాన్ని, దార్శనికతను అంగీకరించారు. సిద్ధాంత వ్యాఖ్యానంలోను, కొన్ని ఆచరణలలోనూ భేదాల కారణంగా భిన్న శాఖలు పుట్టుకువచ్చాయి.

**శ్రీలంకలో తెరవాద బౌద్ధం**

బుద్ధుడి తొలి బోధనలు పాళీ సాహిత్యంలో కనిపిస్తాయి. అవి తెరవాద సిద్ధాంతానికి చెందినవై ఉన్న కారణంగా దీనిని బౌద్ధంలోనే అత్యంత సంప్ర దాయ సిద్ధాంతంగా భావిస్తారు. అందుకే తెరవాదులు బౌద్ధ మత స్థాపకుడి దార్శనికతకు అతి సమీపంగా ఉండేది తామేనని ప్రకటించుకుంటారు. వీరు ప్రధానంగా మూడు శిక్షణలపై (త్రిశిక్ష) దృష్టిపెడ తారు. ఈ సిద్ధాంతం ప్రకారం బుద్ధుడి బోధనలు అత్యంత సరళమైనవి. శీల (నైతిక వర్తన), సమాధి (ధ్యానం) ప్రజ్ఞ (వివేచన/ వివేకం). వీటిని అష్టాంగమార్గంలో భాగంగా, బుద్ధఘోషుడి స్ఫూర్తితో పాటిస్తారు. తెరవాదులు వ్యక్తిగతంగా బుద్ధ బోధనలను పాటించడం ద్వారా నిర్వాణాన్ని పొందా లని అంటే, మహాయానులు ప్రతి జీవికీ నిర్వాణాన్ని కోరుకుంటారు. అలాగే తెరవాదంలో విగ్రహాలు, గుర్తులు వంటివాటికి చోటు ఉండదు కానీ మహా యానంతో అలా కాదు. శ్రీలంకలో ప్రధానంగా తెరవాదమే ఉన్నప్పటికీ, నాటి రాజులు మహాయానంతో కూడా ప్రభావితం కావడంవల్ల అనేక బుద్ధ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఇక్కడ విహారంలోనూ, ఆరామంలోనూ మనకు ప్రముఖంగా కనిపించే విగ్రహం శయన బుద్ధ విగ్రహం. అనంత పద్మనాభుడిని తలపించేలా



గంగారామయ ఆలయం

డి. అరుణ

# బంగారు నెలవంక

శయనించిన బుద్ధ విగ్రహం మనకు పలు విహారాలలో , ఆలయాలలో కనిపిస్తుంది.

**ఆరామ, విహారాలమయం అనురాధపురం**

బౌద్ధాన్ని స్వీకరించిన దేవానామ్ పియ తిస్స దగ్గర నుంచి పాండ్యుల వరకు అందరూ అనురాధ పుర రాజ్యంలో బౌద్ధాన్ని పోషించారు. అక్కడి విహారాలు, స్తూపాలు చూసేందుకు రెండు కళ్లూ చాలవు. వాటి సౌందర్యం, శిల్పకళా నైపుణ్యం అద్భుతం. క్రీపూ నాటి కట్టడాల నుంచి క్రీశ వరకూ నిర్మించిన విహారాల వరకూ ఎన్నింటినో చూసేందుకు, ప్రార్థనలు జరిపేందుకు ప్రపంచం నలుమూలల నుంచీ పర్యాటకులు ఇక్కడకు వస్తుంటారు. యునెస్కో కొన్ని ప్రాంతాలను ప్రపంచ వారసత్వ సంపదగా ప్రకటించి, వాటి పునరుద్ధరణకు నడుం కట్టింది.

**రువాన్‌వెలిసేయ**

అనురాధపురంలో తప్పక దర్శించవలసిన స్తూపమిది. క్రీపూ 140లో దాదాపు 300 అడుగుల ఎత్తులో నాటి పాలకుడు దుత్తగామిని నిర్మాణాన్ని ప్రారంభించగా, చోళులు అనురాధపురాన్ని జయించిన తర్వాత దీనిని పూర్తి చేశారంటారు. ఈ స్తూపాన్ని 'మహా స్తూపం' అంటారు. చాలాకాలంగా ఆదరణ లేక శిథిలావస్థకు చేరిన ఈ స్తూపాన్ని ఇటీవలనే పునరుద్ధరించి, పునర్ వైభవం తెచ్చారు. ఈ స్తూపానికి ప్రధాన భక్కువుగా వెన్ పల్లెగామ హేమరతన తెరవ్యవహరిస్తున్నారు. పండుగలలోనే కాదు, వారాంతంలో వేలాది మంది భక్తులు వచ్చి, అక్కడి బోధివృక్షానికి కూడా పూజలు చేస్తారు.

**అభయగిరి విహార**

అత్యంత ప్రాచీనమైన అభయగిరి విహారాన్ని దర్శించకపోతే, బౌద్ధం అన్నది శ్రీలంకలో ఎంతటి విస్తృత స్థాయిలో విలసిల్లిందో అర్థం కాదు. ప్రపంచంలోనే ఎక్కువ శిథిలాలు కలిగిన ప్రదేశాలలో ఒకటిగా, ఆ దేశంలో పవిత్రమైన బౌద్ధ యాత్ర చేయవలసిన ప్రాంతంగా దీనిని పరిగణిస్తారు. ఈ ప్రదేశాన్ని క్రీపూ 2వ శతాబ్దంలో నిర్మించారు. ఇది క్రీశ 1వ శతాబ్దంనాటికి అంతర్జాతీయ సంస్థగా ఎదగడమే కాదు, ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి పండితులను ఆకర్షించి, అన్ని రకాల బౌద్ధ తాత్వికతలకు స్థానమిచ్చింది. అనేక అంతస్తులతో భిక్షువుల కోసం భవనాలు నిర్మించారు. నగరానికి ఉత్తర దిక్కున ఉండే ఈ విహారంలో, ఈత కొలనులు, స్తంభాల వరుసలతో మండపాలు, 'సందకద పహనలు' (అర్ధ చంద్రాకారంలో సంసార చక్రానికి సంకేతంగా రాతిలో చెక్కి ఉంటుంది –చంద్రశిల అంటారు) చెక్కారు. శ్రీలంకలో ఏ విహారానికి లేదా బౌద్ధ ఆలయాలకు వెళ్లినా ఈ చంద్రశిల అనేది ప్రముఖంగా మనకు తారసపడుతుంది. అనురాధ పురంలో ఉన్న దాదాపు పదిహేడు బౌద్ధ కేంద్రాలలో 'అభయగిరి' అతిపెద్దది. అక్కడి ఐదు ప్రధాన విహారాలలో అత్యంత విశాలమైనది.

ఇంతటి ప్రాముఖ్యం కలిగినప్పటికీ, ఆదరణలేక శిథిలమైన ఈ ప్రాచీన స్తూపాన్ని అభయగిరి దగాబా అంటారు. శ్రీలంకలోని కేంద్ర సాంస్కృతిక నిధి రూ. 519.5 మిలియన్లతో (3.9 మిలియన్ అమెరికన్ డాలర్లు)తో 2015 నాటికి పునరుద్ధ రించింది. వాస్తవానికి బుద్ధుడి దంతం అసలు సంరక్షకులు ఈ ఉత్తర విహారం వారే. కాలక్రమంలో దానిని అక్కడి నుంచి తరలించి కాండీ పట్టణంలోని ఆలయంలో ఉంచారు.

**సమాధి బుద్ధ**

అనురాధపురంలోనే మరొక దర్శనీయ కేంద్రం మహామేవనవ పార్కులోని సమాధి బుద్ధుని విగ్రహం. క్రీశ 4–6వ శతాబ్దాల కాలంలో చెక్కిన ఈ విగ్రహం శ్రీలంకలోని బుద్ధుడి విగ్రహాలన్నింటిలోకీ ప్రత్యేకమైనది. ధ్యానముద్రలో కనిపించే ఈ ఏడు అడుగుల మూడు అంగుళాల విగ్రహం ఆయన తొలి జ్ఞానోదయ క్షణాల నాటి భంగిమగా అభివర్ణిస్తారు. ఇది పవిత్ర బోధివృక్షం కలిగిన ఆలయం చుట్టూ ఉన్న నాలుగు విగ్రహాలలో ఒకటిగా చెప్తారు. అయితే,ఈ ఒక్కటి మాత్రమే ఇంతవరకు దాడులను, ప్రకృతి బీభత్సాలను తట్టుకొని నిలిచింది.

బుద్ధుడు పద్మాసనంలో కూర్చుని, రెండు అరచేతులను తెరిచి ఒకదానిపై ఒకటి ఉంచిన ధ్యాన ముద్రలో కనిపిస్తాడు. ముఖంలో సంతోషం, దయ రెండూ ఉట్టిపడేలా చెక్కడం విశేషం. ఈ ప్రతిమలో కనిపించే



శ్రీలంకలో మహిళా జర్నలిస్టుల బృందం

హస్తముద్రలు ఇతర విగ్రహాలలో కనిపించే వాటికంటే పూర్తి భిన్నమైనవి.

**పవిత్ర దంత ఆలయం, కాండీ**

కాండీలో చూడవలసిన ప్రదేశాలలో బుద్ధుని దంతం ఉన్న పవిత్ర ఆలయం ప్రధానమైంది. బుద్ధుడి మహా పరినిర్వాణానంతరం, ఈ దంతాన్ని కళింగలో భద్రపరచి, రాజైన గుహశివ ఆదేశాల మేరకు యువరాణి, హేమామాలి, ఆమె భర్త దంత రహస్యంగా శ్రీలంకకు తీసుకువచ్చారుట. అనురాధ పురాన్ని (క్రీపూ 301–328) సిరిమేఘవన్న పాలిస్తున్నకాలంలో వారు లంక పట్టణ ద్వీపాన్ని చేరుకుని, రాజుకు దంతాన్ని అప్పగించారు. మహారాజు అనురాధపురంలో నేటి 'ఇసురుమునియ' అయిన మేఘవిహారంలో ప్రతిష్ఠించారు. దానిని పరిరక్షించే బాధ్యత రాజులదే కావడం, అనంతర కాలంలో ఆ దంతం ఎవరి దగ్గర ఉంటే వారికే పాలించే హక్కు దక్కడం సంప్రదాయంగా మారింది. ప్రస్తుతమున్న ఆలయ నిర్మాణాన్ని విమలధర్మ సురియా–1, క్రీశ 1595లో పూర్తి చేశాడు. ఈ ఆలయంపై ఆధునిక కాలంలో జనతా విముక్తి పెరమునా (జేవీపీ), లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ ఈలం (ఎల్‌టిటిఇ) దాడులు చేశాయి. భవనం కొద్దిగా దెబ్బతిన్నది. దీనిని పునరుద్ధరిస్తున్నారు

వాస్తవానికి శ్రీలంకకు బుద్ధుని భిక్షాపాత్ర, ఆయన కుడి కంటి ఎముక, ఆయన కేశం, తర్వాత క్రీ.శ.4లో బుద్ధుని



రువాన్‌వెలిసేయ

దంతం వచ్చాయని కొందరు చరిత్రకారుల భావన. బహుప్రాచుర్యంలో ఉన్నది మాత్రమే బుద్ధుని దంతం కలిగిన ఆలయం మాత్రమే.

**కెలేనియా ఆలయం**

**(కెలేనియా రాజ మహా విహార)**

కొలొంబోకు ఈశాన్యంలో 11 కిమీ దూరంలో కెలేనియా బౌద్ధ ఆలయం ఉంది. ప్రజల విశ్వాసం ప్రకారం తనకు జ్ఞానోదయమైన ఎనిమిదేళ్లకు, ఆఖరుసారి అంటే మూడోసారి బుద్ధుడు వచ్చినప్పుడు దీనిని నిర్మించారు. అంటే బిసిఇ 500 నాటిది. మహావన్స పత్రాల ప్రకారం, ఈ ఆలయంలో మణిమయ సింహాసనంపై కూర్చుని బుద్ధుడు బోధనలు చేసేవాడట. ఆధునికకాలంలో మహారాజు కీర్తి శ్రీరాజసింఘ కాలంలో ఈ ఆలయాన్ని పునర్ని ర్మించారు. 20వ శతాబ్దంలో మెరుగులు దిద్దారు. ఇక్కడ దర్శనమిచ్చే శయన బుద్ధుడు అనంత పద్మనాభస్వామిని తలపిస్తాడు. కెలేనియాలోనే కాక అనురాధపురాలోని అనేక విహారాలలో కూడా శయనబుద్ధుడి విగ్రహాలుండడం విశేషం.

ఈ ఆలయంలో కళాకారుడు సోలియా మెండిస్ చిత్రించిన శ్రీలంకలో బౌద్ధం, బుద్ధుని జీవితం, జాతక కథల నుంచి ఘట్టాలు యాత్రికులను ఆకట్టుకుం టాయి. ఈ ఆలయంలో 18 అడుగుల ఎత్తైన బోధిసత్వ అవలోకితేశ్వర రాతి విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠించారు. సంఘమిత్ర బోధి మహావృక్షపు కుడి కొమ్మని తీసుకువచ్చి, నాటి రాజుకు అందిస్తున్న చిత్రం వీటిలో ఉంది. కాగా, ఇక్కడి బోధివృక్షం చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేసి, నీరు అర్పించడం సంప్రదాయం.

**గంగారామయ ఆలయం**

కొలంబోలో గల అతి ముఖ్యమైన ఆలయాలలో గంగారామ విహారం ఒకటి. బీరా కొలను పక్కనే స్థితమై ఉన్న ఈ విహారం 19వ శతాబ్దం చివరినాటికి పూర్తి చేశారు. ఇక్కడి శిల్పకళ శ్రీలంక, థాయ్‌లాండ్, భారతీయ, చైనా శిల్పకళల సమ్మిళితంగా ఉంటుంది. ఈ ఆలయంలో విహార మందిరం, చైత్యంతో పాటుగా ఒక మ్యూజియం కూడా ఉన్నది. ఈ మ్యూజియంలో పైన పేర్కొన్న అన్ని దేశాల నుంచి సేకరించిన, బుద్ధ విగ్రహాలతో పాటు, పురాతన వస్తువులు కనిపిస్తాయి. ముఖ్యంగా, అన్ని రకాల విలువైన రాళ్లతో మలచిన బుద్ధుని విగ్రహాలు ఇక్కడ ఆకర్షణగా చెప్పవచ్చు. ఇక్కడ గ్రంథాలయంలో పలు దేశాల నుంచి సేకరించిన గ్రంథాలు కనిపిస్తాయి. ఇక్కడ చెప్పుకోదగిన విషయం ఏమిటంటే, వారు భిన్న మతాలనూ ఆహ్వానిస్తారు. అమెరికా, టాంజేనియా వంటి ఇతర దేశాలలో దమ్మాన్ని ప్రచారం చేసేందుకు పలు కేంద్రాలను స్థాపించ డంలో కీలక పాత్రను పోషించిన ఆలయం ఇది.

ప్రాచీనకాలం నుంచీ భారత్, శ్రీలంకల మధ్య



చంద్రశిల

సాంస్కృతిక, రాజకీయ, సామాజిక, వాణిజ్య సంబంధాలు బలంగా ఉంటూ వచ్చాయి. ముఖ్యంగా బలమైన సాంస్కృతిక సంబంధాలు ఉండడం వల్ల అనేకమంది శ్రీలంకవాసులు తమ వారసత్వ మూలాలు భారత్‌లో ఉన్నాయంటారు. ఇరుదేశాల మధ్య సంబంధాలు 2,500 ఏళ్ళ వెనక్కి వెడతాయి. తమ సాంస్కృతిక సంబంధాలను పునరుద్ధరించు కోవడంలో భాగంగా 2012లో బుద్ధుడు జ్ఞానోదయం పొందిన (సమబుద్ధత్వ జయంతి అంటారు) 2600 సంవత్సరాన్ని ఉమ్మడి కార్యక్రమాల ద్వారా నిర్వహించుకున్నారు. ఇందులో భాగంగా, కపిలవస్తుకు చెందిన పవిత్ర అవశేషాలను ఆ ఏడాది ఆగస్టు నుంచి సెప్టెంబర్ వరకు పది ప్రదేశాలలో ప్రదర్శించగా, శ్రీలంక జనాభాలో 15 శాతమైన మూడు మిలియన్ల మంది ఈ పవిత్ర అవశేషాలను దర్శించి అర్చించుకున్నారు.

**తెలంగాణ - శ్రీలంకల మధ్య బౌద్ధ మైత్రి**

**బుద్ధవనం - సెంట్రల్ కల్చరల్ ఫండ్**

రాజకీయాల మాట ఎలా ఉన్నా ఇరు దేశాల ప్రజల మధ్య సాంస్కృతిక సంబంధాలు అనాదిగా బలంగానే కొనసాగుతున్నాయి. ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలోని బుద్ధవనం, శ్రీలంక సాంస్కృతిక విభాగం మధ్య బౌద్ధ సర్క్యూట్ వ్యాప్తికి జరుగుతున్న ప్రయత్నాలు అత్యంత చురుకుగా సాగుతున్నాయి. ఇటీవలే బుద్ధవనం ప్రాజెక్టు, శ్రీలంక కల్చరల్ అండ్ హెరిటేజ్ సంయుక్తంగా నిర్వహించిన ఎక్స్‌చేంజ్ ప్రోగ్రాంలో భాగంగా జర్నలిస్టుల బృందం ఒకటి శ్రీలంకలో పర్యటించింది. అందులో భాగంగానే పలు బౌద్ధ పర్యాటక కేంద్రాలను సందర్శించింది.

తెలంగాణలో 279 ఎకరాలలో బౌద్ధ ఇతి వృత్తంతో అభివృద్ధి చేసిన ప్రాంతం బుద్ధవనం. సిద్ధార్థ గౌతముని సుప్రసిద్ధమైన, వినయశీల, సరళ జీవితం గురించి, బుద్ధ చరిత వనం, జాతక పార్క్, ధ్యాన వనం, స్తూప వనం, మహాస్తూపంతో పాటుగా అంతర్గత బౌద్ధ వారసత్వ మ్యూజియం ఇక్కడ ఉన్నాయి. మహాస్తూపంలో శిల్పకళా సంపద పర్యాటకులను సమ్మోహన పరుస్తుంది.

నాగార్జునసాగర్‌లోని నాగార్జునకొండలో 1954-60ల మధ్య జరిపిన తవ్వకాలలో మహా స్తూపాలు, చైత్యాలు, ఇతర కళాఖండాలు, కొన్ని ఆలయాలు బయిటపడ్డాయి. వాటిని అలాగే ఉంచితే ముంపునకు గురవుతాయి కనుక వాటిని నాగార్జున కొండలోని మ్యూజియంలో ఉంచారు. ప్రసిద్ధ బౌద్ధ ఆచార్యుడు నాగార్జునుడు ఇక్కడి వాడే. మహాయాన బౌద్ధానికి నాగార్జునకొండ ప్రముఖ కేంద్రం. బౌద్ధ దమ్మాన్ని వ్యాప్తి చేసేందుకు అనేక బౌద్ధ స్రవంతులు ఇక్కడ అధ్యయన పీఠాలను నెలకొలిపాయి.

**బుద్ధవనంలో హాలివుడ్ భాగస్వామ్యంతో చిత్రం**

దాదాపు దశాబ్దం కిందట బుద్ధుడి జీవితంపై సిద్ధార్థ గౌతమ పేరుతో గగన్ మాలిక్ హీరోగా బాలీవుడ్ చిత్రం విడుదలైంది. ప్రస్తుతం దానికి రెండో భాగాన్ని, హాలివుడ్-బాలీవుడ్ సంయుక్త నిర్మాణంలో శ్రీలంకలోనూ, బుద్ధవనం లోనూ చిత్రీకరిస్తున్నారు. ఇందుకు సంబందించిన అవగాహన పత్రంపై



హీరో గగన్ మాలిక్ — ప్రొఫెసర్ గామిని రణసింగె

బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లెపల్లి లక్ష్మయ్య, చిత్ర నిర్మాత సంతకాలు చేశారు. అక్టోబర్ ఆఖరుకు హీరో తదితరులు బుద్ధవనం ప్రాజెక్టును సందర్శించ నున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో హీరో గగన్ మాలిక్ తాను బుద్ధుని జీవితంతో ఎలా ప్రభావితమై, బౌద్ధాన్ని స్వీకరించింది.

**శ్రీలంక కేంద్ర సాంస్కృతిక నిధి**

శ్రీలంకలోని సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించి, నిర్వహించడం ద్వారా దాన్ని యావత్ ప్రపంచానికీ బౌద్ధ వారసత్వాన్ని అందించేలా చేయడమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్న సంస్థ ఇది. భారత్‌లో, ముఖ్యంగా తెలంగాణలో బుద్ధవనం ప్రాజెక్టుతో కలిసి పని చేసే అవకాశాలను ఇరు పక్షాలూ అన్వేషిస్తున్నాయి. బుద్ధ పర్యాటక సర్క్యూట్‌ను పెంపొందించడం ద్వారా ఇరు దేశాలూ లాభపడవచ్చున్నది వారి భావన. ఈ సంస్థ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ గామిని రణసింగె భారత్ నుంచి వెళ్లిన జర్నలిస్టుల బృందానికి తమ దేశంలోని గ్రామీణ వ్యవస్థను, అనుబంధంగా ఉన్న చెరువులను, ఆలయాలను, అక్కడి జీవన, వ్యవహారశైలిని పరిచయం చేశారు. ప్రతి గ్రామానికీ ఒక చెరువు, ఒక బౌద్ధ ఆలయం, గ్రామం మొదట్లో వినాయకుడు, ఆ గ్రామ క్షేత్ర పాలకుడి విగ్రహాలు చూసినప్పుడు భారతీయులకు తమ దేశం గుర్తురాక మానదు. ★

సెప్టెంబర్ 27వ తేదీన ఐక్యరాజ్య సమితి సాధారణ సమావేశంలో ప్రపంచ దేశాలను హెచ్చరించిన భారత విదేశాంగ మంత్రి జైశంకర్ అక్కడితో ఆగలేదు. రెండు రోజుల తరువాత వాషింగ్టన్ గడ్డ మీద నుంచే కెనడాకు పరోక్షంగా మొట్టికాయలు వేశారు. నిజ్జర్ హత్య ఆరోపణల నేపథ్యంలోనే మా దేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛ ఉందంటూ అక్కడి అధికార ప్రతినిధులు చేసిన అధిక ప్రసంగానికి జవాబుగానే జైశంకర్ స్పందించారు.



# అగ్రరాజ్యాలకు జైశంకర్ పాఠాలు

కెనడాలో హింసాత్మక వాతావరణం, దౌత్య వేత్తలను భయపెట్టే పరిస్థితులు ఉన్నాయని ఆయన అన్నారు. ఇది ఎందుకంటే అక్కడ భావ ప్రకటనా స్వేచ్ఛ ఉందని ట్విస్ట్ ఇచ్చారు. అంటే ఖలిస్తాన్ ఉగ్రవాదుల స్వర్గంలో భావ ప్రకటనా స్వేచ్ఛ స్వరూప స్వభావాలు ఇవేనని ఆయన ఎద్దేవా చేసినట్టయింది. కెనడాను, పాకిస్తాన్‌ను జమిలిగా విమర్శిస్తూ, నిజం చెప్పాలంటే ఆ రెండు దేశాలకు పెద్ద తేడాలేదని ప్రపంచం గుర్తించాలని కూడా ఆయన చెప్పినట్ట యింది. అదే సమయంలో ఇక్కడ ప్రధాని నరేంద్ర మోదీ చెప్పిన మాట ఎంత వాస్తవమో జైశంకర్ తన వాదనతో రుజువు చేశారు. జి20 యూనివర్సిటీ గ్రాండ్ ఫినాలే కార్యక్రమంలో పాల్గొన్న మోదీ భారత్ దౌత్య విధానం ఇప్పుడు శిఖరాగ్రం మీద ఉందని చెప్పారు. నిజానికి ఇవాల్టి ఉగ్రవాదం, ఇతర సమస్యలకు మూలం కొన్ని అగ్రరాజ్యాలేనన్నది సత్యం.



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

ఉగ్రవాదం విషయంలో తమ దేశ రాజకీయ ప్రయోజనాలను బట్టి కాకుండా, ఆ సమస్య నిర్మూలనకు చిత్తశుద్ధితో పాటు పడాలని ఆయన పిలుపునిచ్చారు. భద్రతామండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం రాకుండా అడ్డుకుంటున్న దేశాలను కూడా జైశంకర్ తూర్పార పట్టారు. ఈ క్రమంలోనే ఆయన అగ్రరాజ్యాల గుత్తాధిపత్యానికి అంతిమ ఘడియలు సమీపించిన సంగతిని కూడా గుర్తించాలని అన్నారు. ఇదే జైశంకర్ ఉపన్యాసంలో ప్రపంచాన్ని ప్రధానంగా ఆకర్షించింది. ఐక్యరాజ్య సమితిపై కొన్ని దేశాలే ఆధిపత్యం వహించే రోజులు పోయాయని ఆయన తేల్చి చెప్పేశారు. జి20లో ఆఫ్రికన్ యూనియన్‌కు స్థానం ఇచ్చిన చారిత్రక ఘటన ఐరాసకు ప్రేరణగా ఉండాలని కూడా జైశంకర్ స్పష్టం చేశారు.

తలపండిన దౌత్యవేత్త జైశంకర్ మాట్లాడు తున్నారంటేనే ప్రతి ఒక్కరు ఆసక్తి ప్రదర్శిస్తారు. ముఖ్యంగా ఎదుటివారు నోరెత్తని రీతిలో ధైర్యంగా ఆయన చెప్పే మాటలు ప్రతి ఒక్కరినీ ఇట్టే ఆకర్షిస్తాయి. ఇటీవల ఐక్యరాజ్య సమితిలో ప్రసంగించిన సుబ్రహ్మణ్యం జైశంకర్ "కొన్ని దేశాలు ఉగ్రవాదాన్ని తమకు అనుకూలమైన రీతిలో నిర్వచిస్తున్నాయి'' అని పరోక్షంగా కెనడాకు చురకలంటించడమే కాదు, ప్రపంచ దేశాల్లో పెరుగుతున్న భారత ప్రతిష్టను, నాయకత్వ లక్షణాలను వెల్లడించడానికి అధిక ప్రాధాన్యమివ్వడం విశేషం. కెనడాను దోషిగా నిలపడంలో భారత్ సాధించిన విజయం తక్కువదేమీ కాదు. ప్రధాని జస్టిన్ ట్రూడోయే మెట్టు దిగవలసిన పరిస్థితికి మన విదేశాంగ విధానం తెచ్చింది. "నాయకత్వం వహించే శక్తిగా ఎదగాలన్న ఆకాంక్షతో ముందుకు పోతున్న పుడు మరింత బాధ్యతాయుతంగా, తోడ్పాటు నందించే రీతిలో వ్యవహరించాలి. మనం ఏర్పరచుకున్న లక్ష్యాలే, ముందువారి కంటే మనల్ని ప్రత్యేకంగా నిలబెడతాయి'' అన్నారు జైశంకర్. తూర్పు-పశ్చిమ దేశాలమధ్య ధ్రువాత్మకత బాగా పెరిగిపోవడం, ఉత్తర-దక్షిణ ప్రాంతాల మధ్య విభజనరేఖ మరింత లోతుగా ఉన్న తరుణంలో దీన్ని సరిచేసేందుకు దౌత్యమార్గాలే చక్కని పరిష్కారమని జి-20 ఢిల్లీ సదస్సు పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యంగా ఇటీవల ముగిసిన జి-20 సమావేశాన్ని అధ్యక్ష స్థానంలో భారత్ విజయ వంతంగా నిర్వహించిన తీరును సభ దృష్టికి తెచ్చారు. ఇదే సమయంలో "తీవ్రవాదం, హింసపై ప్రపంచం

రాజకీయంగా తనకు అనుకూలమైన రీతిలో స్పందించే విధానం తప్పని" స్పష్టం చేశారు. పాకిస్తాన్ పెంచి పోషిస్తున్న తీవ్రవాదం, జమ్ము- కశ్మీర్‌లోకి ఉగ్రవాదులను చొప్పిస్తున్న తీరును ఎండగట్టడం సాధారణంగా భారత ప్రతినిధులు చేసే ప్రసంగాల్లో చోటుచేసుకుంటుంది. కానీ ఈసారి కెనడా పేరును ప్రస్తావించకుండానే ఆ దేశంపై విమర్శల అస్త్రాలను సంధించడం విశేషం.

నిజానికి భారత్, యు.ఎన్. వేదికపై ఎప్పుడూ పాకిస్తాన్, చైనా పేర్లను నేరుగా ప్రస్తావించదు. ప్రస్తుత పరిస్థితిలో కెనడా పేరును నేరుగా ప్రస్తావిస్తే, ప్రపంచవ్యాప్తంగా ఈ వార్త ఇప్పటికే పతాకశీర్షికల్లో ఉన్నందువల్ల, ఐక్యరాజ్య సమితి వేదికపై సమస్య మరింత జటిలమవుతున్న ఉద్దేశంతోనే జైశంకర్ ఆ పని చేయలేదని దౌత్యనిపుణుల అభిప్రాయం. అంతేకాదు ప్రస్తుతం ఈ సమస్య కేవలం తమ రెండు దేశాలకే పరిమితమని భావించి దీన్ని మరింత రచ్చ చేయకూడదన్న ఉద్దేశంతోనే భారత్ సంయమనంతో వ్యవహరించిందన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.

కెనడా ఆరోపణల 'మబ్బులు' ఇప్పటి వరకు తిరుగులేకుండా సూర్యుడి మాదిరిగా వెలిగిపోతున్న భారత దౌత్యాన్ని కొంతమేర కప్పేసిన నేపథ్యంలో, మన దేశ ఆకాంక్షలను ప్రపంచానికి వెల్లడించడానికి జైశంకర్ ఈ వేదికను ఉపయోగించుకున్నారనే చెప్పాలి. "గ్లోబల్ సౌత్"కు వాణిగా నిలబడటం, వర్ధమాన దేశాల్లో నెలకొన్న అసహనాన్ని ప్రపంచానికి తెలియజేయడానికి ప్రాధాన్యతనివ్వడం కనిపిస్తుంది. గ్లోబల్ సౌత్‌కు చెందిన 125 దేశాల సమస్యలను జి-20 అజెండాలో చేర్చడంలో అధ్యక్షురాలిగా భారత్ కృతకృత్యమైన అంశంతో పాటు, కేవలం భారత్ ప్రయత్నం వల్లనే ఆఫ్రికన్ యూనియన్ దేశాలకు జి-20లో శాశ్వత సభ్యత్వం లభించిందన్న సత్యాన్ని కూడా ఆయన సమావేశం దృష్టికి తెచ్చారు. అదీ కాకుండా ప్రపంచంలోనే అత్యధిక జనాభా గల దేశంగా, బలీయమైన ఆర్థికశక్తిగా రూపొందుతున్న భారత్ ప్రాధాన్యతను వెల్లడిచేసే రీతిలో ఆయన ప్రసంగం కొనసాగింది. ముఖ్యంగా 415 మిలియన్ ప్రజలను పేదరికం నుంచి బయటపడేసిన దేశంగా భారత్ విజయాన్ని ఆయన సభ దృష్టికి తెచ్చారు.

నిజానికి కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తప్పులు మీద తప్పులు చేస్తున్నారు. ఇటీవల ఉక్రెయిన్ అధ్యక్షులు వ్లాదిమిర్ జెలన్‌స్కీ కెనడా పార్లమెంట్‌ను సందర్శిం చినప్పుడు, రెండో ప్రపంచయుద్ధంలో నాజీల తరపున పోరాడిన ఉక్రెయిన్ వృద్ధ సైనికుడు యారోస్లావ్ హంకా (98)ని పార్లమెంట్‌కు పిలిచి జస్టిన్ ట్రూడోతో సహా పార్లమెంట్ సభ్యులు 'హీరో'గా ఆకాశానికెత్తేయడం తీవ్ర విమర్శలకు దారి తీయడమే కాదు ఏకంగా ఇజ్రాయిల్, రష్యాలు తీవ్ర నిరసన


కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో

వ్యక్తం చేసే దాకా వెళ్లింది. యారోస్లావ్ హంకాను ఆహ్వానించడానికి ప్రధాన కారకుడైన స్పీకర్ ఆంథోనీ రోటా అన్ని రాజకీయ పార్టీల ఒత్తిడితో రాజీనామా చేశాడు. చివరకు ప్రధాని ట్రూడో కెనడా ప్రజలకు క్షమాపణలు చెప్పాల్సి వచ్చింది. దీంతో కెనడా పరువు పోయింది. ఈ ప్రతికూల పరిణామం, నిజ్జర్ హత్య విషయంలో భారత్‌పై ఆరోపణలు చేస్తున్న జస్టిన్ ట్రూడో ప్రభుత్వంపై పడిందన్న సత్యాన్ని తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. హర్దీప్‌సింగ్ నిజ్జర్ విషయంలో భారత్‌పై తీవ్ర ఆరోపణలు చేసిన కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తాజాగా భారత్‌కు అనుకూలంగా మాట మార్చడం ఆయన క్రమంగా నిజాన్ని గ్రహిస్తున్నారనడానికి సంకేతం. సెప్టెంబర్ 28న మాంట్రియల్‌లో ఆయన మాట్లాడుతూ "గ్లోబల్ స్థాయిలో భారత్‌కు పెరుగుతున్న ప్రాధాన్యతను గుర్తిస్తున్నాం. ఇలాంటి సమయంలో కెనడా దాని మిత్ర పక్షాలు భారత్‌తో సంబంధాలను మెరుగు పరచుకోవాలని ప్రయత్నిస్తున్నాయి" అన్నారు. భారత్ అభివృద్ధి చెందుతున్న ఆర్థికశక్తి. భౌగోళిక రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. కిందటేడాది ఇండో-పసిఫిక్ వ్యూహాన్ని మేం అందించాం. తమ దేశం ఇప్పటికీ భారత్‌తో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకోవడానికి కట్టుబడి ఉందని, ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తేలేదన్నారు. అయితే నిజ్జర్ హత్య విషయంలో అమెరికన్లు తమతోనే ఉన్నారని ఆయన పాతపాటే పాడినా, బ్లింకన్, జైశంకర్‌ల మధ్య వాషింగ్టన్‌లో జరిగిన ద్వైపాక్షిక సమావేశంలో అసలు నిజ్జర్ ప్రస్తావనే రాకపోవడం కెనడా ప్రధానికి అశనిపాతం వంటిదే. భారత్- మధ్య ప్రాచ్యం-యూరప్ కారిడార్‌పై వీరి మధ్య ప్రధానంగా చర్చలు జరగడం నిజ్జర్ హత్య వివాదాన్ని నెత్తికెత్తుకొని 'తలకు రోకలి చుట్టుకున్న చందంగా' ఇబ్బందులు ఎదుర్కొనడానికి అమెరికా సిద్ధంగా లేదన్నది స్పష్టమైంది. అవసరాలు మాత్రమే సంబంధాలను శాసిస్తాయన్న సత్యాన్ని జస్టిన్ ట్రూడో ఇప్పటికైనా గ్రహించడం మంచిది.

ఇదిలాఉండగా కెనడాలో దారుణహత్యకు గురైన బెలూచిస్తాన్‌కు చెందిన మానవ హక్కుల కార్యకర్త కరీమా బెలూచ్ విషయంలో ఆ దేశ ప్రభుత్వం ఎందుకు విచారణ జరపడం లేదని బెలూచ్ వాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు మునీర్ మంగల్ వేస్తున్న ప్రశ్నకు కెనడా ప్రభుత్వం నుంచి సమాధానం లేదు. మానవ హక్కులు కేవలం తీవ్రవాదులకేనా? సాధారణ ప్రజలకు ఉండవా? అన్న ప్రశ్నలను ఆయన లేవనెత్తుతున్నారు.

"పంచనేత్రాల"ల్లో భాగమైన న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ దేశాలు నిజ్జర్ హత్య వివాదంలో తలదూర్చడం లేదు. కానీ కెనడా ఒత్తిడి అమెరికాపై తీవ్రంగా ఉంది. సాటి ఆంగ్లోసాక్సన్ దేశంగా, తన ఆర్థిక వ్యవస్థపై ఆధారపడే దేశంగా కెనడాకు మద్దతివ్వక తప్పని పరిస్థితి అమెరికాది. కానీ వర్తమాన భౌగోళిక రాజకీయ పరిణామాల నేపథ్యంలో అమెరికా ఎట్టిపరిస్థితుల్లో భారత్‌ను వదులుకోలేదు. ఇదే సమయంలో అమెరికా రాజకీయాల్లో యూదుల లాబీ చాలా బలంగా ఉంటుందనేది తిరుగులేని సత్యం. డెమోక్రాట్స్ లేదా రిపబ్లికన్స్ వీరి మద్దతుకోసం విపరీతంగా ప్రయత్నిస్తారు. యూదు దేశమైన ఇజ్రాయిల్ భారత్‌కు అత్యంత సన్నిహిత మిత్రుడు. అమెరికాకు ఇక చెప్పాల్సిన అవసరమే లేదు. భారత్‌కు అనుకూలంగా అమెరికాలో పావులు తిప్పే సామర్థ్యం ఇజ్రాయిల్ సొంతం. రాబోయే ఎన్నికల్లో ఒకవేళ డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడైతే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఆగిపోయే అవకాశాలే ఎక్కువ. అప్పుడు ప్రపంచ రాజకీయం సమూలంగా మారిపోక తప్పదు. ఇక కెనడా విషయానికి వస్తే 2025లో ఆ దేశంలో జరిగే ఎన్నికల్లో జస్టిన్ ట్రూడో ఓటమి ఖాయమని ప్రస్తుత పరిణామాలు వెల్లడిస్తున్నాయి. ఒకవేళ అదే జరిగితే భారత్-కెనడాల మధ్య సంబంధాలు మళ్లీ మామూలు స్థితికి రావచ్చు. కానీ భారత్‌లో వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో నరేంద్రమోదీ నేతృత్వంలో ఎన్.డి.ఎ. మళ్లీ అధికారంలోకి రావడం తథ్యమని ఎన్నికల సర్వేలు చెబుతున్నాయి. అంటే అమెరికా, కెనడాల్లో నాయకత్వ మార్పులు జరిగే అవకాశాలు ఎక్కువ కానీ భారత్‌లో మాత్రం కాదు. ఈ పరిణామాలను గమనిస్తే, భారత్ విదేశాంగ విధానం "మబ్బు లేని సూర్యుడిలా" వెలిగిపోవడం ఖాయం. ఇటీవల పాక్‌లో అమెరికా రాయబారి డేవిడ్ బ్లోమ్ పాక్ ఆక్రమిత గిల్గిట్-బల్టిస్థాన్ ప్రాంతంలో ఆరు రోజుల పాటు జరిపిన రహస్య పర్యటన వివాదం రేపింది. ఏడాది కాలంలో ఆయన ఈ ప్రాంతంలో

పర్యటించడం ఇది రెండోసారి. కెనడా వివాదం నేపథ్యంలో భారత్‌ను ఇబ్బందిపెట్టే రీతిలో అమెరికా, పాక్ అనుకూల వైఖరి అవలంబిస్తున్నదంటూ వస్తున్న వార్తలను పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే పి.ఒ.కె.లో ఇప్పటికే పెద్ద ఎత్తున ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు జరుగుతున్నాయి. వీటినుంచి ప్రపంచ దృష్టిని మళ్లించడానికే అమెరికా రాయబారి పర్యటనను వెలుగులోకి తెచ్చారని భావించాలి. రాజకీయాలు ప్రజల ఆకలిని తీర్చవు. పి.ఒ.కె. ప్రజల ఇక్కట్లను డేవిడ్ బ్లోమ్ ఏ విధంగానూ తీర్చలేడు. యు.ఎస్. ఆ పని చేయదు. ఇక చైనా పాకిస్తాన్‌లో తన ఆర్థిక నడవాకు తగులుతున్న ఎదురుదెబ్బల నేపథ్యంలో, ఆఫ్ఘనిస్తాన్ ద్వారా ప్రత్యామ్నాయంగా తన ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో ఉన్నదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మనదేశాన్ని వ్యతిరేకించిన పాక్ అడుక్కుతింటోంది. చైనా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలి పోతోంది. కొండను ఢీకొన్న పొట్టేలు మాదిరి పరిస్థితి ప్రస్తుతం కెనడాది!

**నిజ్జర్ హత్యకేసులో మరో ట్విస్ట్**

హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్యకేసులో మరో ఆశ్చర్యకరమైన ట్విస్ట్ చోటుచేసు కుంది. పాకిస్తాన్‌కు చెందిన ఐ.ఎస్.ఐ.పక్కా ప్రణాళికతో నిజ్జర్‌ను మట్టుబె ట్టినట్టు తాజాగా వార్తలు వస్తుండటం, భారత్–కెనడాల మధ్య ప్రస్తుతం కొనసాగుతున్న దౌత్య పరమైన ఇబ్బందుల నేపథ్యంలో కీలక పరిణామంగా చెప్పాలి. తారిఖ్ కియానీ, రహత్‌రావు అనే ఇద్దరు అపరేటివ్స్‌ను ఐ.ఎస్.ఐ. కెనడాలో నియమించి వారి ద్వారా సీమాంతర దేశాల్లో తమ కార్యకలాపా లను కొనసాగిస్తున్నదన్నది ఈ వార్తల సారాంశం. రావు, కియానీ, గురుచరణ్ పన్నులకు ముఖ్యమైన ఆదాయ వనరు మత్తుమందులు, ఇమ్మిగ్రేషన్ వ్యాపారం. నిజ్జర్ హత్యకు ప్రధానంగా మూడు కారణాలు ఈ వార్తల ద్వారా వెల్లడవుతున్నాయి. పాకిస్తాన్‌కు చెందిన వాధ్వాసింగ్, రంజిత్‌సింగ్ నీతాలు తమకు అప్పగించిన పనులను సక్రమంగా నిర్వర్తించలేక పోవడం, ఐఎస్ఐకి తలనొప్పిగా మారిన నేపథ్యంలో గత రెండేళ్లుగా కెనడాలోకి కొత్తగా తాము ప్రవేశపెట్టిన గాంగ్‌స్టర్‌లకు మద్దతివ్వాలని వత్తిడి తీసుకు వస్తున్నప్పటికీ, నిజ్జర్ పెడచెవిన పెట్టి, మాజీ ఖలిస్తానీ నేతలతో సాన్నిహిత్యం పెంచుకోవడం ఐ.ఎస్.ఐ బాస్‌లను ఆగ్రహానికి గురి చేసిందన్నది మొదటి కారణం. నిజ్జర్‌కు స్థానిక సిక్కు జాతీయుల్లో క్రమంగా పలుకుబడి పెరుగుతుండటం ఐఎస్ఐ కన్నెర్రకు రెండో కారణం. కెనడాలో ఖలిస్తానీ శక్తులను మరింత బలోపేతం చేసే చర్యల్లో భాగంగా నిజ్జర్ స్థానంలో మరొకరిని తీసుకొనిరావాలన్న ఉద్దేశంతో ఐఎస్ఐ ఈ దుశ్చర్యకు పాల్పడిందన్నది మూడో కారణం. కెనడాలో నిజ్జర్ నివాసానికి



హర్‌దీప్ సింగ్ నిజ్జర్

సమీపంలో పాకిస్తాన్‌కు చెందిన మాజీ జనరల్స్, హవల్‌దార్లు ఐ.ఎస్.ఐ. అధికార్లు నివసిస్తుం టారనేది బహిరంగ రహస్యమే. ఈ నేపథ్యంలో కొత్తవారు నిజ్జర్‌ను సమీపించడం దుస్సాధ్యం కాబట్టి, అతడి హత్యకు రావు, కియానీలను ఐ.ఎస్.ఐ. నియోగించి ఉండవచ్చునన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికంగా డ్రగ్స్ వ్యాపా రం తారిఖ్ కియానీ, రహత్‌రావులు నియంత్రిస్తుండటం వల్ల, వీరిలో ఎవరో ఒకరికి నిజ్జర్‌ను హత్యచేసే బాధ్యతను ఐఎస్ఐ అప్పగించి ఉండవచ్చునని ఈ వార్తలు పేర్కొంటున్నాయి. అయితే తాను కొత్తగా కెనడాలో ప్రవేశపెట్టిన క్రిమినల్ నేపథ్యమున్న గ్యాంగ్‌లను నిజ్జర్ హత్యకు ఐ.ఎస్.ఐ. నియోగించిం దనేది మరో కథనం. కథ ఎన్ని మెలికెలు తిరిగినా నిజ్జర్ హత్యలో అన్ని వార్తలూ ఐ.ఎస్.ఐ.నే చూపుతున్నాయి. ముసుగులు ధరించిన ఇద్దరు దుండ గులు, సెడాన్ కారులో వచ్చి నిజ్జర్ నడుపుతున్న ట్రక్‌కు అతి సమీపం నుంచి కాల్పులు జరపడంతో అక్కడికక్కడ మృతి చెందాడన్నది కథనం. ఏకంగా అతనిపై దుండగుడు 50 బుల్లెట్లు పేలిస్తే, 34 నిజ్జర్ శరీరంలో దూసుకుపోయాయని కూడా వార్తలు వచ్చాయి. ప్రభుత్వ సంస్థలే ఇటువంటి హత్యకు పాల్పడితే ఇన్ని బుల్లెట్లు పేల్చరని, కేవలం ఇది ప్రతీకారంగా చేసిన హత్యేనన్నది ఈ వార్తల్లో వ్యక్తమవుతున్న ఒక వాదన కోణం భారత్‌కు అత్యంత బలాన్నిచ్చే అంశం. సంఘటన జరిగిన 20 నిమిషాల వరకు పోలీసులు ప్రదేశానికి చేరుకోలేదని కూడా వార్తలు వచ్చాయి. హత్యకు ఆరురోజుల ముందు నిజ్జర్ కెనడా అధికార్లను కలిసాడని అదేవిధంగా హత్య జరగడానికి ముందు గురుద్వారాకు వెళ్లమని కొంతమంది కెనడా అధికార్లు నిజ్జర్‌కు సూచించారన్నది కూడా వార్తల సారాంశం. మరి అన్ని జాగ్రత్తలు తీసుకునే నిజ్జర్ గురుద్వారాకు వెళు తున్నాడని హంతకులకు చెప్పిందెవరన్నది ఇప్పటికీ మిస్టరీనే! ఏమైతేనేం ఐఎస్ఐ చాలా జాగ్రత్తగా పక్కా ప్లాన్‌తో నిజ్జర్‌ను హతమార్చి ఆ పాపాన్ని భారత్ మీదకు నెట్టడంలో విజయం సాధించిందని కూడా ఈ వార్తలు వెల్లడించాయి.

కేవలం గుప్పెడు మంది తీవ్రవాదులు, ప్రపంచ దేశాల సంబంధాల్లో ఏ విధంగా చిచ్చుపెట్టగలరో, దౌత్యనీతిని ఏ విధంగా ఛిద్రం చేయగలరో తెలియ జెప్పే ఒక గొప్ప దృష్టాంతం ఇది. జస్టిన్ ట్రూడో వంటి అపరిపక్వ దేశాధినేతలు వీరి ఉచ్చులోపడి, తమ దేశ ప్రతిష్టను ఏ విధంగా మంట గలుపుతారో, ఇదే సమయంలో భారత్‌లో మోదీ వంటి పరిణితి చెందిన రాజకీయ నాయకత్వం ఈ విపరిణామాన్ని ఏ విధంగా సమర్థవంతంగా తిప్పికొట్టగలదో కూడా ప్రపంచ రాజకీయ యవనిక వీక్షించిన అరుదైన 'విచిత్ర' సంఘటనగా నిజ్జర్ ఉదంతం ప్రపంచ చరిత్ర పుటల్లో నిలిచిపోతుంది. ★



కథ

పచ్చలు రాశి పోసినట్టుందా ఆ అడవి మధ్యలోని దేవదారు వృక్షం.

వెండిధూళి పరుచుకున్నట్టున్నట్టే ఉంది ఆ దళసరి ఆకులు మీద. ప్రతి ఆకు గాలికి సుతారంగా ఊగుతూ ఉంటే, ఎండలో మరింత అందంగా ఉంది చెట్టు. చిరుగాలికి నది అలల అంచులు కదులుతున్నట్టు రమణీయంగా కదులుతున్నాయా ఆ చెట్టు శాఖలు. దట్టమైన అడవి. అడుగడుగునా, అణువణువునా పచ్చదనమే. అయినా ఆ దేవదారు చెట్టు పచ్చదనం ఏదో తేజస్సుతో వెలిగి పోతోంది. పవిత్రతతో పరిమళిస్తోంది.

అందుకే పరవశించి చూస్తున్నాడు దిలీప మహారాజు. అడవంటేనే ఆయన సర్వం మరచి పోతాడు. అది ఎన్నెన్నో జీవరాశులకు ఆవాసం. రుషి పుంగవుల పేరుతో పుడమి మీద నడయాడే దేవతా మూర్తుల, జ్ఞానుల తపోభూమి. ఔషధజాతి మొక్కల కాణాచి. అమాయకత్వాన్ని చిరకాలం కాపాడడానికే ఉన్నట్టు కనిపించే గిరిపుత్రులకు అడవే నీడ. వనం, రాజ్య సంపదను ప్రతిబింబిస్తుంది. అంతేనా, రాజ్యానికి పెట్టని కోట. ఇక అందం గురించి చెప్పాలంటే! ఈ చరాచర సృష్టిని సౌందర్యవంతం చేసినవే అడవులు. అడవి లేని పుడమిని ఊహించగలమా!

తన కర్తవ్యం మరిచిపోకుండా తూరుపు దిక్కుకేసి ఒక్కసారి దృష్టి సారించాడు. అల్లంత దూరంలో నందిని.

ఆ దేవదారు చెట్టు నీడకు కొంచెం ఇవతలే



# గోరక్షకుడు

కల్యాణ

పచ్చికను కొరుకుతోంది.

కామధేనువు సంతానం నందిని. దేవతలు, మునులు అనే ఏమిటి! ముల్లోకాలు కూడా పూజించే గోమాత. ఆవగింజంత మచ్చయినా లేకుండా తెల్లని శరీరంతో, నల్లటి కనులతో రమణీయంగా ఉంటుంది నందిని. నెలవంకను పోలిన శృంగాలు ఆ గోవుకు మరింత సౌందర్యాన్ని ఇస్తున్నాయి. ఎంతసేపయినా చూస్తూనే ఉండాలని అనిపిస్తుంది. చిన్నగా తలవూపుతూ, గంభీరంగా అడుగులో అడుగు వేసుకుంటూ నడిచే నందినిని చూస్తుంటే నాలుగు పాదాల ధర్మం నడచి వస్తున్నట్టే ఉంటుంది. నిత్యపూజలో పూసే పసుపుతో ఆ గోమాత కాలి గిట్టలు ఆ రంగులోకి వచ్చేశాయి.

అయోధ్యను పాలిస్తున్న దిలీపుడు ప్రారంభించిన దీక్ష అవాళ 22వ రోజుకు చేరుకుంది. దిలీపుడు మహాచక్రవర్తి. దేవేంద్రుడికి సాయపడగల ధీరుడు. అంతటి సాయుధ సంపత్తి, సైనిక బలగాలు కలిగినవాడు. కానీ ఆ చక్రవర్తిత్వాన్ని చాటే, శౌర్యాన్ని సంకేతించే ఏ భుజకీర్తులూ ఇప్పుడు శరీరం మీద లేవు. నారబట్టలతో, విల్లంబులతో మాత్రమే ఆ కారడవిలో నడుస్తున్నాడు. మంచి వయసులో ఉన్న దిలీపుడు మానవరూపం ధరించిన సింహంలాగే ఉన్నాడు, ఆ వనంలో.

* * *

దిలీపుడు ఆదర్శనీయుడైన చక్రవర్తి.. న్యాయం, ధర్మం ఆయనకు రెండు కళ్లు. అందుకే సమయానికి వర్షాలు కురుస్తూ రాజ్యం సుభిక్షంగా ఉంది. కర్ష కులనీ, పండితులనీ, సామాన్య ప్రజలనీ అడవులలో తపస్సు చేసుకునే రుషులనీ కంటికి రెప్పలా కాపాడుతున్నాడు. నూరు యజ్ఞాలు చేసి ఖట్వాంగుడు అన్న పేరు కూడా తెచ్చుకున్నాడు.

కానీ లేనిది ఒక్కటే– మనశ్శాంతి. కారణం సంతానం లేదు. ఇంత మహా సామ్రాజ్యానికి వారసుడు లేడు. తనతోటే తన వంశం అంతరించి పోవాలా? ఇదే అతడిని వేధిస్తున్న ప్రశ్న. ఆయన భార్య సుదక్షిణాదేవి మరింత కుంగి పోతున్నది.

ఒకరోజు ఇద్దరూ కలసి కులగురువు వసిష్ఠముని ఆశ్రమానికి వచ్చారు.

వసిష్ఠుడు, అరుంధతీ ఆ దంపతులను ఆహ్వానించారు.

తన సమస్య చెప్పాడు దిలీపుడు.

అయోధ్యకు దూరంగా అడవి అంచున ప్రశాంతంగా ఉంది ఆశ్రమం. సువాసనలతో కూడిన గాలి మెల్లగా వీస్తోంది. సాధు జంతువులు ఎలాంటి జంకూగొంకూ లేకుండా ఆశ్రమ ప్రాంగణంలో సంచరిస్తున్నాయి. రంగురంగుల పక్షులు ఆ కుటీరం స్తంభాలను చుట్టుకుని ఉన్న లతలతో దోబూచులాడు తున్నాయి. అరుగుల మీద కొన్ని పక్షులు పొందికగా కూర్చుని ఉన్నాయి. ఎక్కడో మరొక కుటీరం నుంచి మంత్రోచ్చాటన మధురంగా, మంద్రంగా వినిపిస్తోంది. మరోపక్క అప్పుడే వికసిస్తున్న మునికుమారుల గొంతు నుంచి ఓంకారనాదం వీనుల విందుగా వెలువడుతోంది.

ఒక్క క్షణం మౌనం తరువాత వాత్సల్య పూరితమైన గొంతుతో అన్నారు వసిష్ఠులవారు.

“మహారాజా! నీకు సంతానయోగం లేకపోలేదు. కానీ నీవు చేసిన చిన్న తప్పిదం వల్ల ప్రస్తుతం నీవు ఆ యోగానికి దూరంగా ఉన్నావు.”

“నావల్ల తప్పిదం జరిగిందా?” విస్తుపోయాడు దిలీపుడు.

“ఔను. నీవు గతంలో దేవేంద్రునికి సహక రించడానికి ఇంద్రలోకం వెళ్లావు. తిరిగి అయోధ్య వస్తుండగా దారిలో ఒక చెట్టు నీడన కామధేనువు విశ్రమించి ఉంది. నీవు ఆ పవిత్ర గోమాతను చూడలేదు. ఇది అక్షరసత్యం. గతంలో ఒకసారి ఆ లోకం వెళ్లినప్పుడు ఎంతో మమకారంతో, గౌరవంతో ఆ మహోన్నత గోమాతను పూజించావు. కానీ ఈసారి కామధేనువు వైపు నీవు చూడలేదు. ఇందుకు ఆ గోమాత మనసు నొచ్చుకుంది. దాని ఫలితంగానే ప్రస్తుతం నీవు సంతానం గురించి క్షోభకు గురి అవుతున్నావు. గోవును నిర్లక్ష్యం చేసినా, వాటి పట్ల నిర్దయగా ఉన్నా మానవజాతి మనుగడే ప్రశ్నార్థకమవుతుందన్న మహా సత్యాన్ని నీవు విస్మరించావని నేను అనడం లేదు. కానీ గోవు కనిపిస్తే మనం మనసులో అయినా మొక్కుతాం. ఆ మహితాత్మ జీవి మీద మనకున్న గౌరవాన్ని మనం నిరంతరం వ్యక్తీకరిస్తూనే ఉంటాం. అది మన బాధ్యత. మనదైన పరంపర. తెలియక జరిగినా ఆ క్షణంలో కామధేనువు సమక్షంలో ఇందుకు సంబంధించిన లోపం జరిగిపోయింది మహారాజా!” అన్నాడు వసిష్ఠుడు.

తన మూలంగా ఒక గోవు బాధపడిందన్న వాస్తవం మహారాజును మరింత కలతపడేటట్టు చేసింది. కానీ తాను తెలిసి తప్పు చేయలేదు. అలా అని ఎలా సర్దుకోగలడు! తాను మహారాజు. తెలిసి చేసినా తెలియక చేసినా తప్పు తప్పే. పాలకుల విషయంలో అది శాశ్వతసత్యం. కొంత మౌనం తరువాత నెమ్మదిగా, దీనంగా అడిగాడు దిలీపుడు.

“దీనికి ప్రాయశ్చిత్తం లేదా గురుదేవా?”

“లేకేమీ, ఉంది. కామధేనువు క్షీరసాగరం నుంచి పుట్టిన పుణ్యరాశి. మనందరికీ మాతృమూర్తి వంటిది. అలాంటి దేవత మనసును నొప్పించకుండా మనమే జాగ్రత్త పడాలి. కానీ కొన్నిసార్లు తప్పులు చేస్తాం. ఆ తప్పు దిద్దుకుంటే చాలు. దానికే ఆ దేవలోకపు గోవు సంతుష్టి చెందగలదు. కామధేనువు సంతానం నందిని. నందిని భూలోకంలోనే ఉంటుంది. పైగా మన ఆశ్రమంలోనే నివశిస్తోంది ఆ గోవు. ప్రస్తుతం వరుణుడు చేస్తున్న యాగం కోసం పాతాళలోకం వెళ్లింది. యాగానికి అవసరమైన క్షీర, ఘృతాలతో పాటు, రుత్విక్కులకు కావలసిన పెరుగు నందిని ద్వారానే అందుతున్నాయి. పంచామృతాలలో నందిని పాలు, పెరుగే వినియోగిస్తారు. నందిని మన ఆశ్రమానికి తిరిగి వచ్చిన తరువాత నీవు పూజించు. భక్తిగా అర్చించు. అమ్మ, అడవి, ఆవు మన జాతికి నిత్య పూజనీయాలు.”

“ఇది రాజ కుటుంబానికి పరిమితమైన సమస్య కాదు. ఒక జాతి మనుగడకు సంబంధించిన వాస్తవ మని అర్థమవుతోంది. ఆ పూజా విధానం ఏమిటో చెప్పండి గురుదేవా!” అన్నాడు దిలీపుడు.

“నందినిని సేవిస్తే కామధేనువు ప్రసన్న మవు తుంది. నందిని నిత్యం అడవిలో సంచరిస్తుంది. ఆ సమయంలో నీవే రక్షగా ఉండాలి. అమ్మా! సుదక్షిణా! వేకువనే లేచి అప్పుడే పూచిన పుష్పాలతో నిత్యం నీ మగనితో కలిసి ఆ గోమాతను పూజించాలి. నందిని, ఆ పవిత్ర గోమాత అడవికి వెళ్లినప్పుడు వెనుక నీ భర్త రక్షణగా వెళతాడు. నీవు ఆశ్రమంలోనే ఉండి, అదిగో...నందినికి జన్మించిన ఆ వత్సను నీవు సాకాలి. మీ దంపతులు ఇరువురు నందినిని భక్తిగా సేవించాలి. ఆ గోమాత ఆశీస్సులు పొందాలి. ఫలితంగా మీకు గొప్ప సంతానం ప్రాప్తిస్తుంది. ఇదంతా కఠోర శ్రమతో కూడినది. అయినా సహనంతో చేయాలి!’ అన్నాడు రాజగురువు.

* * *

నందిని వసిష్ఠుని ఆశ్రమానికి చేరుకుంది. ఒక్క రోజు కూడా ఆలస్యం చేయకుండా దిలీపుడు రాజ్యాన్ని మంత్రులకు అప్పగించి సతీసమేతంగా ఆశ్రమానికి చేరుకున్నాడు.

వసిష్ఠుడు చెప్పినట్టే వచ్చిన మరుక్షణం నుంచే రాజదంపతులు నందిని సేవకు అంకితమయ్యారు. వేకువనే లేచి ఆశ్రమానికి సమీపంలోనే ఉన్న ఏరులో స్నానాదికాలు ముగించుకుని, అడవిలోకి వెళ్లి

సువాసనలు వెదజల్లే పుష్పాలను తీసుకువచ్చి వాటితో నందినిని పూజించడం ఆరంభించారు. గరికగడ్డి తెచ్చి తినిపిస్తున్నారు. ఆ పుణ్యకార్యంలో వారు సంతానం లేదన్న బాధను సైతం తాత్కాలికంగా మరచిపోయారు. గోసేవలో ఉన్న మహత్త్యం వారిని తన్మయులను చేస్తోంది. గతం కంటే వారు ఎంతో అన్యోన్యంగా, ఆనందంగా ఉండగలుగుతున్నారు.

అడవిలో నందిని ఎటు వెళితే అటు వెళుతున్నాడు దిలీపుడు. ఎక్కడ నిలబడితే అక్కడ నిలబడుతున్నాడు. నందిని విశ్రమిస్తే తాను జాగరూకుడై కాపలా కాస్తున్నాడు.

సాయంత్రం కాగానే ఆ గోమాతనే అనుసరించి వచ్చే దిలీపుడు మొదట చేసే పని ఆశ్రమం దగ్గర ఉండే గోవత్సాన్ని తల్లి దగ్గరకి పంపించడం. గోధూళి వేళకి నిండుగా కనిపించే నందిని పొదుగు నుంచి ఆ గోవత్సం తన్మయంగా పాలు కుడుచుకునేది. ఆ దూడ చాలినన్ని పాలు తాగిన తరువాత మిగిలినవి తనే పిండి ఆశ్రమంలో స్వయంగా అందిస్తున్నాడు మహారాజు.



"గోరక్షణలో జరిగిన ఈ ఘోర తప్పిదం వల్ల మా గురుదేవులు నాకు ఇవ్వ బోయే శాపం నుంచి రక్షించు. అలాంటి మహోన్నత తపస్వికి మనస్తాపం కలిగించానన్న బాధ నాకు జన్మజన్మల పాటు ఉండేటట్టు చేస్తూ, అంత ఘోరమైన శిక్ష విధించకు. ఆశ్రమం దగ్గర తల్లి కోసం ఎదురు చూసే ఆ గోవత్సం తన తల్లి ఇక లేదన్న శరాఘాతం వంటి సమాచారాన్ని విని తట్టుకోగలదా? ఆ లేగకు ఏం జరిగినా ఆ పాపం కూడా నాకే కదా! ఆ చిన్నారి ప్రాణికి తల్లిని దూరం చేయకు." అన్నాడు, వినమ్రంగా చేతులు జోడించి.

* * *

"అంబా!" ఒక్కసారిగా ఆర్తరావం.

దానితో అడవంతా ప్రతిధ్వనించింది. గుహలన్నీ మార్మోగాయి.

ఉలిక్కిపడి చూశాడు దిలీపుడు. నవనాడులు కుంగిపోతుండగా చుట్టూ పరికించాడు.

ఆ దేవదారు వృక్షం దగ్గరగానే ఉంది నందిని. కానీ ప్రాణభయంతో విలవిల లాడిపోతోంది.

అత్యంత బలశాలి అయిన ఒక సింహం తన వాడి గోళ్లను దింపడానికి ఆ గోమాత వీపు మీద ఆన్చి ఉంది.

ఒక్క ఉదుటన వెళ్లాడు దిలీపుడు. రక్తం ఉడికిపోతోంది.

బాణం తీయడానికి పొది వైపు చేయి చాచాడు. అక్కడ పొది లేనట్టే అనిపించింది. త్రుటికాలంలోనే పొది నుంచి బాణం తీసి సంధించగల విలుకాడా యన. అదేమిటో! పెద్ద ప్రయత్నం తరువాత గాని బాణం అందుకోలేకపోయాడు ఆ లిప్తలో. తీరా బాణం తీశాక మంత్రించి సంధిద్దామంటే ఏమీ గుర్తుకు రావడం లేదు. విల్లు సహకరించడం లేదు. వింటి నారి మీద బాణం అమరడం లేదు.

ఆ సింహం నందిని వీపు మీద నుంచి తన రెండు కాళ్లు తీసి, భూమ్మీద నిలబడి దిలీపునికేసి అత్యంత హేళనగా చూసి అంది.

"అయిందా నీ శౌర్య ప్రదర్శన!? ఇక ఆ వృథా ప్రయాస కట్టిపెట్టు" అంది మనిషి గొంతుతో.

కుపితుడైపోయాడు దిలీపుడు. అదే సమయంలో విస్తుపోయాడు కూడా. మనుష్య భాష మాట్లాడుతున్న ఆ సింహం మామూలు సింహం కాదని అర్థమైంది.

"నీవు ఎవరవు? పరమ పవిత్రమైన ఈ గోవును ఎందుకు హింసించాలని అనుకుంటున్నావు? ఏం పాపం చేసింది ఆ సాధుజీవి?" అన్నాడు దిలీపుడు.

నందిని ఒక పక్కకు నిలబడి విచలిత నేత్రాలతో బేలగా మహారాజు కేసి చూస్తోంది. అదేమీ పట్టించుకోవడం లేదు సింహం. నందిని పారిపోతుందన్న భ్రమ, భయం కూడా లేనట్టే ఉంది. అవును, నందిని గోజాతిలో గొప్ప జీవి.

"మహారాజా! ఈ దేవదారు చెట్టు పరిసరాలలోకి ఎవరు వచ్చినా నేను చంపుతాను. నా పేరు కుంభోదరుడు. నేను పరమశివుడి ప్రమథ గణాలలో ఒక భూతాన్ని. ఈ చెట్టు జగజ్జనని పార్వతీదేవి అమ్మవారిది. ఆ అమ్మే నాటింది. అపురూపంగా పెంచింది. ఒకసారి ఏదో జంతువు వచ్చి తినేస్తే, ఆమె ఎంతో బాధపడింది. ఆ బాధ చూడలేక నేను సింహం రూపంలో ఇక్కడే కాపలా ఉన్నాను. ఈ ఆవు నా పరిధిలోకి వచ్చింది. అందుకే చంపి తింటాను. ఇది తథ్యం!" అని ప్రకటించింది.

"మృగరాజు రూపంలో ఉన్న కుంభోదరునికి వందనం." అన్నాడు దిలీపుడు.

"నేను సింహాన్ని. అలాగే పిలువు. అలాగే చూడు!" అన్నాడు కుంభోదరుడు.

"ఆజ్ఞ!" వినయంగా వంగి అన్నాడు దిలీపుడు. మళ్లీ తనే అన్నాడు.

"నీవు సాధారణ సింహానివి కావు. కాబట్టి ధర్మం ఆలోచించు. నా విన్నపాన్ని ఆలకించు. నా మాటలు కూడా విను. ఈ గోమాత నా వంశాంకురానికి ఆధరువు. ఒక ధర్మానికీ, ఒక జీవన విధానానికీ, ఒక సంస్కృతికీ ఆలంబన ఆ గోవు. ఆ గోమాతను విడిచిపెట్టు. ఇది నా విన్నపం. ఇక నా మాట. నేను ఈ ధరాతలానికే చక్రవర్తిని. అయినా సవినయంగా అడుగుతున్నాను. నాయందు దయ ఉంచి ఆ గోవును క్షేమంగా వదిలిపెట్టు." అన్నాడు దిలీపుడు.

సింహం మనసు కరిగినట్టు లేదు. అంతటి చక్రవర్తి కూడా దీనుడై సజల నేత్రాలతో మళ్లీ అన్నాడు.

"గోరక్షణలో జరిగిన ఈ ఘోర తప్పిదం వల్ల మా గురుదేవులు నాకు ఇవ్వబోయే శాపం నుంచి రక్షించు. అలాంటి మహోన్నత తపస్వికి మనస్తాపం కలిగించానన్న బాధ నాకు జన్మజన్మల పాటు ఉండేటట్టు చేస్తూ, అంత ఘోరమైన శిక్ష విధించకు. ఆశ్రమం దగ్గర తల్లి కోసం ఎదురు చూసే ఆ గోవత్సం తన తల్లి ఇక లేదన్న శరాఘాతం వంటి సమాచారాన్ని విని తట్టుకోగలదా? ఆ లేగకు ఏం జరిగినా ఆ పాపం కూడా నాకే కదా! ఆ చిన్నారి ప్రాణికి తల్లిని దూరం చేయకు." అన్నాడు, వినమ్రంగా చేతులు జోడించి.

"నీవు మహావీరుడవని విన్నాను. కానీ ఇదేమిటి, ఈ దీనాలాపాన?" అంది సింహం.

"మృగరాజా! గోబ్రాహ్మణ రక్షణ నా విధ్యుక్త ధర్మం. నిత్యంచేసుకునే సంకల్పంలో ఇది తప్పక చెప్పుకుంటాను కదా! నా ప్రారబ్ధం. ఇవాళ ఒక గోవు నా కళ్ల ముందు చావబోతోందన్న ఊహే నన్ను దహించివేస్తోంది. ఒక గోవును రక్షించకుండా నేను నా రాజ్యానికి కాదు కదా, ఆ మున్యాశ్రమానికి కూడా వెళ్లలేను."

"అయితే ఏమంటావు?"

రెండు క్షణాలు గడిచిన తరువాత స్థిరంగా మహారాజు గొంతు నుంచి ఈ మాటలు వచ్చాయి.

"ఆ గోమాతను విడిచిపెట్టు. అందుకు బదులుగా నా ప్రాణం తీసుకో! నా శరీరాన్ని ఆహారంగా స్వీకరించి, నీ ఆకలి తీర్చుకో!" దృఢంగా అన్నాడు దిలీపుడు.

"నీవు దిలీపుడవేనా! ఒక ఆవు కోసం నీ ప్రాణాలు వదులుకుంటావా? రాజ్యం వదిలేస్తావా? అయినా నీవే లేనపుడు ఇక సంతానం కావాలన్న నీ కోరికకు విలువేది? ఆ కోరిక ఫలించే దారేది అమాయకుడా! నీ గురువు శాపానికి భయపడుతున్నావా ఏమిటి? నీవు తలుచుకుంటే లక్ష ఆవులను ఇచ్చి ఆ ముని కోపం చల్లార్చగలవు." అంది మృగరాజు. ఆ మాటలో దారుణమైన విరుపు.

చేతులు ఎత్తి నమస్కరించి అన్నాడు దిలీపుడు, సంయమనం కోల్పోకుండా.

"నిజమే! లక్ష ఆవులను తెచ్చి ఇవ్వగలను. కానీ ఒక్క గోహత్యను కూడా నేను నా రాజ్యంలో అనుమతించలేను. ఈ గోవుతో, ఈ మహోన్నత గోజాతితో నా మానవజాతికి అవినాభావ సంబంధం ఉంది. నా వంశానికి ఆయువు పట్టు ఈ గోమాత. అందుకే నా ప్రాణం పోయినా నేను గోవును



"మృగరాజా! గోబ్రాహ్మణ రక్షణ నా విధ్యుక్త ధర్మం. నిత్య చేసుకునే సంకల్పంలో ఇది తప్పక చెప్పుకుంటాను కదా! నా ప్రారబ్ధం. ఇవాళ ఒక గోవు నా కళ్ల ముందు చావబోతోందన్న ఊహే నన్ను దహించివేస్తోంది. ఒక గోవును రక్షించ కుండా నేను నా రాజ్యానికి కాదు కదా, ఆ మున్యాశ్రమానికి కూడా వెళ్లలేను."

"అయితే ఏమంటావు?" రెండు క్షణాలు గడిచిన తరువాత స్థిరంగా మహారాజు గొంతు నుంచి ఈ మాటలు వచ్చాయి.

"ఆ గోమాతను విడిచిపెట్టు. అందుకు బదులుగా నా ప్రాణం తీసుకో! నా శరీరాన్ని ఆహారంగా స్వీకరించి, నీ ఆకలి తీర్చుకో!" దృఢంగా అన్నాడు దిలీపుడు.

రక్షించుకోవాలి. మనిషి ప్రాణానికి ఇచ్చే విలువే, ఒక గోవు ప్రాణానికి మేం ఇవ్వాలి. ఆవుకు హాని తలపెట్టడమంటే ఒక జంతువును గాయపరచడమని కాదు. చంపి తినడమనీ కాదు. నీవు నా మాటను సరిగ్గా గ్రహించలేదు. నేను ముని శాపానికి భయ పడడం లేదు. గోహత్యకు కారణం కావడం వల్ల నా వంశానికి జరిగే ఘోరనష్టం గురించి క్షోభ పడుతు న్నాను. మృగరాజా! ఒక్క గోవును పోగొట్టుకున్నా ఈ ధరాతలానికి జరిగే హానిని తలుచుకుని తల్లడిల్లుతున్నాను. గోహత్యా పాతకం నీకు కూడా తగులుతుంది సుమా! ఇందుకు కారకుడనైన నాకు ఇంకా ఎక్కువ తగులుతుంది. గోవును చంపడమంటే జాతి మనుగడకు గొడ్డలిపెట్టు అని మానవజాతి విశ్వాసం. అందుకే వదిలిపెట్టమని ప్రాధేయపడు తున్నాను మృగరాజా! ఇది నా విన్నపం! ఈ ధరాతలాన్ని ఏలే ప్రభువుగా కూడా చెబుతున్నాను. ఆవును విడిచిపెట్టు. నాకు ఆనందం కలగచేయి. మానవజాతికి మోదం కలిగించు."

"ఇది బెదిరింపా? విన్నపం వంటి బెదిరింపా? లేకపోతే చక్రవర్తినన్న దర్పమా! నీకు మా మీద ఆధిపత్యం ఉందని ఎంత లౌక్యంతో చెప్పావు!" గడుసుగా అంది సింహం.

"కాదు. మనం ఒక ఇంట్లో కాకున్నా, ఒకే నేల మీద నివశిస్తున్నాం. ఒకే రాజ్యంలో ఉన్నాం. ఈ నేల మీద నివశించమని ప్రకృతి నీకు వరమిచ్చింది. ఆ వరాన్ని నేను నిరాకరించలేను కూడా. ప్రకృతి మాకు కూడా అలాంటి వరమే ఇచ్చిందని నా నమ్మకం. నేను పాలకుడిని కాబట్టి అధికుడిని అనడం లేదు. నీవు సింహజాతిలో పుట్టావు కాబట్టి నిన్ను కించపరచడం లేదు. ప్రకృతి పట్ల మానవాళి అనుసరించవలసిన కొన్ని శాశ్వత ధర్మాల విషయంలో ఒక గౌరవప్రద ఒప్పందం అవసరమని నా అనుభవం. నిన్నూ నీ జాతినీ నిర్మూలించడం నాకూ నా సైన్యానికీ కష్టం కాదు. కానీ నీ జాతిని నిర్మూలించి ఈ సంపదల కాణాచిని, ఈ తపోవనాన్ని, ఈ ఔషధాల నిలయాన్ని నాశనం చేసుకోలేను. ఈ అడవికి నీ జాతి రక్షాకవచం. అలాంటి దుశ్చర్యకు పాల్పడి మనిషిగా నా మీద శాశ్వతంగా ఉండిపోయే రక్తపు మరకను మోయలేను. ఇలాంటి తెగను నిర్మూలించిన నన్ను పైన దేవతలు మెచ్చరు. నేల మీద భావితరాలు క్షమించవు. కాబట్టి మనిద్దరం ఉమ్మడిగా ఆలోచించవలసినవి కొన్ని ఉంటాయి. నేను అడుగు తున్నది ఈ ఆవును వదలి పెట్టమని మాత్రమే. ఈ గోమాత రక్షణ బాధ్యత సాక్షాత్తు నా కులగురువు, మా ప్రత్యక్ష దైవం నాకు ఇచ్చారు. పై లోకాలలో ఉన్న నా పితరుల ఆత్మలు కూడా క్షణక్షణం గోరక్షణ గురించే ఘోషిస్తూ ఉంటాయి. వారు వైతరిణీ నదిని దాటేదే గోమాత సాయంతో కదా! నాగరికత పెరిగిన కొద్దీ, కాలం గడచిన కొద్దీ కొన్నింటిలో కొత్త విలువలు బయటపడుతూ ఉంటాయి. వాటి పట్ల అప్పటిదాకా ఉన్న అభిప్రాయాలు మారుతూ ఉంటాయి. గోరక్షణ విషయంలో మాకు అలాంటి విలువ ఒకటి సంప్రాప్తించింది. నాగరికత లేని కాలంలో అన్నింటిని చంపి తిన్నాడు మనిషి. సకల జీవరాశులను భక్షించాడు. జంతువులు కూడా అంతే. కానీ కాలంతో పాటు జ్ఞానవంతుడైన మనిషి కొన్ని నియమాలు పాటించడం తన మనుగడకే అవసరమన్న నిర్ణయానికి వచ్చాడు. అదిగో, అక్కడ కనిపిస్తున్న ఆ మొక్క ఇవాళ ఒక పచ్చని భూజం. అంతే. రేపు ఆ మొక్కే ఒక ఔషధమని, మనిషికి స్వస్థత చేకూర్చే అమృతమని మనం గుర్తించ వచ్చు. ఆవు విషయంలో జరిగింది ఇదే. నా విన్నపానికి సహేతుకమైన కారణాలు ఉన్నాయి. అందుకే ఈ వాదన. దీనిని గుర్తించు, గౌరవించు!"

"రాజా! నీ వాదన అందంగానే ఉంది. కానీ మాంసాహారం తప్ప ఇతర ఆహారాన్ని ఎరుగని నన్ను ఈ ఆవును వదిలిపెట్టి ఆకులలములు, కంద మూలాలు తినమంటావా ఏమిటి? ఇదేం ధర్మం?" అంది సింహం, పరిహాసంగా.

"నీవు తిరుగులేని మాంసాహారివి. అది నాకు తెలియనిది కాదు. నేను కూడా ప్రస్తుతానికి శాకాహారిని కానీ, పుట్టుకతో మాంసాహారినే. మాంసమే తినాలంటే అనేక జంతువులు ఉన్నాయి. కానీ ఎంత త్యాగమైనా చేసి గోవును రక్షించుకోమని మా జాతి చరిత్ర ఆదేశిస్తోంది. పురాణాలు ఘోషిస్తున్నాయి. నా ధర్మం కోరుతోంది." అని అగాడు దిలీపుడు.

మళ్లీ కొన్ని లిప్తల తరువాత అన్నాడు.

"ఈ ఒక్క గోవే ఏల? వశిష్ఠుని ఆశ్రమానికి ఈ ఒక్క ఆవుకు బదులు లక్ష ఆవులు తరలించు అని నీవొక ప్రతిపాదన చేశావు. ప్రత్యామ్నాయాన్ని సూచించడానికి వీలు కల్పిస్తూ నీవే ఒక సందర్భాన్ని సృష్టించి ఇచ్చావు, మృగరాజా! కాబట్టి చొరవ చేస్తున్నాను. అన్యథా భావించవద్దు. నా రాజ్యంలో, నా అధీనంలో ఎన్నో ఇతర జాతి జంతువులు

**'కార్టూన్ పోటీ - 2023'లో సాధారణ ప్రచురణకు ఎంపికైనది**



ఉన్నాయి. నీవు మాంసాహారివి, అంతే. నీకు ఆవు ఒక్కటే ఆహారం కాదు. ఆవు మాంసంతోనే నీవు బతకాలన్నా అది సాధ్యంకాదు. నీ ఆహారంలో అది కూడా ఒకటి అంతే. అందుకే చెబుతున్నాను. పోతరించిన అడవిదున్నలు కావాలా? రుచికి మారుపేరయిన హరిణాలు కావాలా? కుందేళ్లు, కణుజులు కావాలా? మెత్తని పక్షుల మాంసం కావాలా? బళ్ల కొద్దీ మేకమాంసం కోరతావా? జలచరాలను రాశుల కొద్దీ పంపించనా! ఇందులో ఏదైనా పంపుతాను. మరేదైనా సరే, నీకు ఆహారంగా పంపిస్తాను. కానీ ఒక్క గోజాతికి మాత్రం చేటు చేయకు. ఒక అద్భుత ప్రయోజనం కోసం, ఈ నేల, ఈ ప్రకృతి మొత్తం క్షేమం కోసం గోవులను వదిలిపెట్టమని వేడుకుంటున్నాను." అన్నాడు మహారాజు, సజల నేత్రాలతో.

క్షణం ఆలోచనలో పడింది సింహం.

"నీ ప్రాణాలే ఇస్తానని, నిన్నే ఆహారంగా స్వీకరించమని క్షణం ముందే అన్నావు. ఇప్పుడు మళ్లీ అధికారం ఉంది కదా అని నిస్సహాయమైన జంతురాశిని నాకు నైవేద్యం పెడతానంటున్నావు! ఇదేం ధర్మం! ఇదేం నిరంకుశత్వం?" అంది హేళనగా.

"నన్నే ఆహారంగా స్వీకరిస్తే మంచిదే. ముందే విన్నవించినట్టు నీకు ఆహారం కావడానికి నేను సిద్ధం! కానీ అది విపరిణామాలకు దారి తీస్తుందని నేను భయపడుతున్నాను. ఒక మహా ఘర్షణకు మూలమవుతుందని నా బాధ. కానీ మాట ఇచ్చేశాను కాబట్టి ఇక ఆ విపరిణామాల సంగతి నాకు అనవసరం." అంటూనే ధనుర్బాణాలు అవతలికి విసిరి సింహం దగ్గరగా వచ్చి, తలవంచి మోకాళ్ల మీద కూర్చున్నాడు దిలీపుడు.

ఆ సింహం వాడి గోళ్లు తన శరీరంలోకి దిగితేనేమి! తన ప్రాణం అనంత వాయువులలో కలిస్తేనేమి? ఆ గోమాత ప్రాణం దక్కుతుంది. అది చాలు. ఇక్కడే ఉన్న గురుదేవునికీ, పై లోకాలలో ఉన్న తన పితరులకీ ఆగ్రహం రాకుండా చేయవచ్చు. ఈ గడ్డ మీద పుట్టే భావితరాలు కూడా తన నిర్ణయాన్ని హర్షిస్తాయి. ఈ నిర్ణయం ఒక గొప్ప సంప్రదాయానికి శ్రీకారం చుట్టగలిగితే అంతకంటే ఏం కావాలి! దానితో గోరక్షణ జరిగితే ఇంకేం కోరుకోవాలి! తన అంతిమ క్షణాలకు ఇంతటి ప్రయోజనం లభించబోతున్నందుకు తృప్తిగా నిట్టూర్చాడు మహారాజు.

కొన్ని లిప్తలు గడిచాయి.

వాడి గోళ్లు కాదు. సుకుమారమైన పూలరాశులు దిలీపుడి శరీరాన్ని తాకాయి. కాదు, పై లోకాల నుంచి వర్షిస్తున్నాయి. కళ్లు తెరిచాడు దిలీపుడు.

ఆ సింహం అక్కడ లేదు.

పైన దేవతలు పూల వర్షం కురిపిస్తున్నారు.

"రాజా! ఆశ్చర్యపడకు. ఆ సింహం ఒక భ్రమ. నిన్ను పరీక్షించడానికి దేవతలు సృష్టించారు. నీవే గెలిచావు. వరం కోరుకో!" అంది నందిని, మనిషి గొంతుతో.

"గోమాతా! సాక్షాత్తు ఆ కామధేనువు సంతానం నీకేం కావాలని కోరితే, ఇంకేం కోరగలను! నాకు సంతానయోగం కలిగించు!" అన్నాడు దిలీపుడు, చేతులు జోడించి.

"సంతోషం! నా క్షీరాన్ని కొద్దిరోజులు ఆకుదొన్నెతో నీ భార్య చేత తాగించు. మీకు కారణజన్ముడైన బిడ్డ పుడతాడు." అంది నందిని.

✻ ✻ ✻

ఆశ్రమానికి వెళ్లిన తరువాత జరిగిన కథంతా చెప్పాడు దిలీపుడు.

'నీవు ధన్యుడవు రాజా!' అని ఆశీర్వదించాడు రాజగురువు.

✻ ✻ ✻

సుదక్షిణాదేవి గర్భం దాల్చింది. మగబిడ్డకు జన్మనిచ్చింది.

సాక్షాత్తు వసిష్ఠుల వారే అయోధ్యకు వచ్చి ఆ శిశువుకు రఘువు అని పేరు పెట్టారు.

తరువాత ఆ వంశానికి రఘు వంశమని పేరు వచ్చింది. అంతటి కీర్తిమంతుడయ్యాడు రఘువు.

✻ ✻ ✻

అయోధ్య నుంచి తిరిగి వచ్చిన తరువాత అరుంధతి ఒకరోజు వసిష్ఠుల వారితో కలసి వనంలో విహరిస్తూ ఈ మాట అన్నది.

"మానవజాతి మనుగడకీ, గోవుల రక్షణకీ ఉన్న బంధాన్ని దిలీప మహారాజు అర్థం చేసుకున్న తీరు మహోన్నతంగా ఉంది. అంతేకాదు, దీనిని లోకానికి తెలియచేయడానికి అతడు నిర్మించుకున్న తత్త్వం వాస్తవికంగానూ ఉంది. దేవతలు కూడా మెచ్చగలిగే ఈ తత్త్వాన్ని ముందు తరాలు, యుగాలు కూడా అర్థం చేసుకుంటే ఎంత బావుంటుంది!"

"నాకేమనిపించిందో చెప్పనా విదుషీమణీ! ముందు అతడిలో ఒకింత ఆవేశం కనిపించినా, ఒక సాధు జంతువును రక్షించడానికి జరిగే ప్రయత్నంలో రక్తపాతం తగదన్న రీతిలో అతడు ఆ పరిస్థితి నుంచి బయటపడిన తీరు, ప్రదర్శించిన విజ్ఞత, అక్కడ దిలీపుని దృష్టి నాకు సంతోషం కలిగించాయి. సామదాన భేద దండోపాయాలన్నీ మహారాజు చేతిలోనే ఉన్నా, సింహానికి నచ్చ చెప్పి అంగీకరింప చేసిన తీరు పరమాద్భుతం. ఇది మానవజాతీ, సింహజాతీ కూడా అర్థం చేసుకోవలసిన విషయం. మనుషులమూ, నాగరికత తెలిసిన వారమూ అనుకుంటున్న వారికి కూడా ఇది చెప్పాలని ఎందుకు అనుకుంటున్నానంటే, యుద్ధాన్ని యుద్ధంతో ఆపలేం. రక్తపాతాన్ని రక్తపాతంతో నిరోధించలేం.

ఒక ధర్మాన్ని, ఒక విశ్వాసాన్ని రక్షించుకోవాలని మనసా వాచా కోరుకునే వాడు ఎవరైనా, అందుకు అతడు తన ప్రాణాన్ని పణంగా పెడితే లోకానికి నమ్మకం కలుగుతుంది. అంతేతప్ప తన విశ్వాసాన్ని తాను రక్షించుకోవడానికి ఎదుటివారి ప్రాణాలు అవసరమని చెబితే అది లోకం సహించే విషయం కాబోదు. ఏ ప్రాణినైనా ఈ పుడమి మీద దాని ఉనికే లేకుండా చేయాలన్నంతగా వ్యవహరించడం సరికాదు. అది అర్థం చేసుకోవాలి." అన్నారు వసిష్ఠ ముని.

"ఒక జాతి మనుగడకు పరోక్షంగా మీరు నిర్వహించిన భూమిక మహోన్నతం ఆర్యా! మీ వంటివారి ఆశీస్సులతో ధర్మం నాలుగు పాదాలపైనా నిలబడుతూనే, సమస్త జీవరాశి సుభిక్షంగా ఉండాలి!" అన్నది అరుంధతి ఆనందం ఉప్పొంగుతుండగా.

"తథాస్తు!" అన్నారు వసిష్ఠులవారు. ★

**'కార్టూన్ పోటీ - 2023'లో సాధారణ ప్రచురణకు ఎంపికైనది**



19వ ఆసియాక్రీడల్లో భారత పతకాల సాధనలో తెలుగు రాష్ట్రాల అథ్లెట్లు సైతం తమవంతు పాత్ర పోషించారు. షూటింగ్, బ్యాడ్మింటన్, ఆర్చరీ, బాక్సింగ్, చదరంగం అంశాలలో రాణించారు. చైనాలోని హాంగ్జు వేదికగా జరుగుతున్న ఈ క్రీడల్లో భారత్ పతకాలవేట స్థాయికి మించి సాగుతోంది. పోటీల 8వ రోజుకే 13 స్వర్ణాలు సహా 53 పతకాలతో సరికొత్త రికార్డుకు భారత అథ్లెట్లు గురిపెట్టారు.


జ్యోతి యర్రాజీ
ఈషాసింగ్

# ఆసియా క్రీడల్లో 'తెలుగు వెలుగులు!'

ఆసియాక్రీడల చరిత్రలోనే గతంలో ఎన్నడూ లేనంత భారీ (651 మంది అథ్లెట్ల)బృందంతో 38 రకాల క్రీడాంశాలలో పతకాల వేటకు దిగిన భారత్ మొదటి వారం రోజుల పోటీలలో అంచనాలకు మించి రాణించడం ద్వారా 60 పతకాలు సంపాదించింది. ఇందులో 13 స్వర్ణ, 24 రజత, 23 కాంస్య పతకాలు ఉన్నాయి. భారత్ గత క్రీడల్లో సాధించిన 70 పతకాల లక్ష్యాన్ని ప్రస్తుత క్రీడల్లో మించిపోదం ఖాయంగా కనిపిస్తోంది. భారత అథ్లెట్లు ఇప్పటి వరకూ సాధించిన మొత్తం 60 పతకాలలో షూటర్లు సాధించినవే 22 వరకూ ఉన్నాయి. ఈ పతకాల సాధనలో దేశంలోని మిగిలిన రాష్ట్రాల అథ్లెట్లతో పాటు మన తెలుగు రాష్ట్రాల క్రీడాకారులు సైతం తమవంతు పాత్ర పోషించారు.

### హైదరాబాదీ షూటర్ అరుదైన ఘనత...

మహిళల పిస్టల్ షూటింగ్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన ఈషా సింగ్ (19) నాలుగు పతకాలు సాధించడం ద్వారా తెలుగు రాష్ట్రాలకు గర్వకారణంగా నిలిచింది. గచ్చిబౌలిలోని షూటింగ్ రేంజ్‌లో ఓనమాలు దిద్దుకొని, మహారాష్ట్రలోని గగన్ నారంగ్ అకాడమీలో శిక్షణ పొందిన ఈషా సింగ్ 25 మీటర్ల పిస్టల్ టీమ్ విభాగంలో బంగారు పతకం సాధించింది.

ఇదే అంశం వ్యక్తిగత విభాగంలో రజత పతకం సాధించడం ద్వారా తన పతకాల సంఖ్యను రెండుకు పెంచుకొంది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్, వ్యక్తిగత విభాగాలలో రజత పతకాలు సొంతం చేసుకొంది. మొత్తం 4 పతకాలు గెలుచుకోడం ద్వారా తనకుతానే సాటిగా నిలిచింది.



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

### నిఖత్ జరీన్ చేజారిన స్వర్ణం....

మహిళల బాక్సింగ్ 50 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించడం ఖాయమనుకొన్న తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్.. సెమీఫైనల్ ఓటమితో కాంస్య పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం ప్రపంచ చాంపియన్‌గా ఉన్న ఆమెను ఆసియాక్రీడల సెమీస్‌లో దురదృష్టం వెంటాడింది. థాయ్ బాక్సర్ 3-2 పాయింట్లతో నిఖత్‌పై సంచలన విజయం సాధించడం ద్వారా బంగారు ఆశల్ని వమ్ము చేసింది.

### బ్యాడ్మింటన్ టీమ్ విభాగంలో అపూర్వ విజయం...

బ్యాడ్మింటన్ పురుషుల టీమ్ విభాగంలో భారత్ తొలిసారిగా గోల్డ్ మెడల్ రౌండ్ చేరుకోడంలో ఆంధ్రప్రదేశ్ ఆటగాళ్లు కిడాంబి శ్రీకాంత్, సాయి సాత్విక్ ప్రధానపాత్ర పోషించారు. దక్షిణ కొరియాతో జరిగిన సెమీస్ పోరులో భారత్ 3-2తో సంచలన విజయం సాధించడంలో సింగిల్స్ ప్లేయర్ కిడాంబి శ్రీకాంత్, డబుల్స్‌లో సాయి సాత్విక్- చిరాగ్ శెట్టి కీలకంగా వ్యవహరించారు.

రెండుజట్లు చెరో రెండుమ్యాచ్‌లు నెగ్గి 2-2తో సమఉజ్జీలుగా నిలిచిన సమయంలో జరిగిన నిర్ణయాత్మక ఆఖరి సింగిల్స్‌లో శ్రీకాంత్ అసాధారణ విజయంతో తన జట్టును తొలిసారిగా ఫైనల్స్ చేర్చగలిగాడు. బంగారు పతకం కోసం ఆతిథ్య చైనాతో జరిగిన పోరులో భారత్ 2-3తో పోరాడి ఓడి రజత పతకంతో సరిపెట్టుకొంది. డబుల్స్ లో సాయిసాత్విక్ జోడీ కీలక విజయం సాధించినా, ఆఖరి సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ పరాజయం పాలయ్యాడు. ఆసియాక్రీడల బ్యాడ్మింటన్ చరిత్రలో భారతజట్టు టీమ్ విభాగంలో రజత పతకం సాధించడం ఇదే మొదటిసారి. మహిళల టీమ్ విభాగంలో విఫలమైన పీవీ సింధు, సింగిల్స్ వ్యక్తిగత విభాగంలో ఏదో ఒక పతకం సాధించే అవకాశాలు లేకపోలేదు. పురుషుల డబుల్స్ విభాగంలో సైతం సాయి సాత్విక్ స్వర్ణపతకం సాధించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

### విశాఖ రన్నర్ జ్యోతికి రజతం...

తన కెరియర్‌లో తొలిసారిగా ఆసియా క్రీడల మహిళల 100 మీటర్ల హర్డిల్స్ బరిలోకి దిగిన విశాఖ కమ్ ఆంధ్రప్రదేశ్ రన్నర్ జ్యోతి యర్రాజీ రజత పతకంతో సరిపెట్టుకొంది. ఆసియా చాంపియన్ హోదాలో రేస్‌లో పాల్గొన్న జ్యోతికి అదృష్టం కలిసి వచ్చింది. వాస్తవానికి కాంస్య పతకం సాధించిన జ్యోతికి.. ప్రత్యర్థి చైనా రన్నర్ ఫౌల్ చేయడంతో..

మహిళల విలువిద్య టీమ్, వ్యక్తిగత విభాగాలలో విజయవాడ ఆర్చర్ జ్యోతి సురేఖ కాంపౌండ్ తరగతిలో పతకాలు సాధించడం ఖాయంగా కనిపిస్తోంది. చదరంగం పురుషుల, మహిళల విభాగాలలో తెలుగు రాష్ట్రాల గ్రాండ్ మాస్టర్లు పెంద్యాల హరికృష్ణ, అర్జున్ ఇరగేసి, కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక సైతం టీమ్, వ్యక్తిగత అంశాలలో పతకాలు సాధించే అవకాశం ఉంది. క్రీడారంగంలో తెలుగు రాష్ట్రాలు ఏమాత్రం వెనుకబడి లేవనడానికి రెండు తెలుగు రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న అథ్లెట్లు సాధించిన పతకాలే నిదర్శనం. ★

చొప్పరపు కృష్ణారావు

# భారత్‌కు అన్నీ మంచి శకునములే!

**భారతగడ్డపై ఐసీసీ వన్డే ప్రపంచకప్‌నకు నాలుగోసారి తెరలేచింది. రోహిత్ శర్మ నాయకత్వంలోని భారతజట్టు మూడో టైటిల్ వేట ప్రారంభించింది. ప్రపంచ నంబర్ వన్ ర్యాంక్ జట్టు హోదాలో, సకల హంగులకు స్థానబలాన్ని జతచేసి మరీ విజేతగా నిలవాలన్న పట్టుదలతో బరిలోకి దిగింది.**

2023-ఐసీసీ వన్డే ప్రపంచకప్ సంరంభానికి అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా అట్టహాసంగా తెరలేపింది. మొత్తం 10 జట్లు రౌండ్ రాబిన్ లీగ్ కమ్ సెమీఫైనల్స్ నాకౌట్ తరహాలో జరుగుతున్న ఈ టోర్నీలో ఆతిథ్య భారతజట్టు హాట్ ఫేవరెట్‌గా పోటీలో నిలిచింది.

**సకల హంగులతో...**

పోటీ విపరీతంగా ఉన్న నేటి అంతర్జాతీయ క్రికెట్లో విశ్వవిజేతగా నిలవాలంటే జట్టు ఏదైనా సకలహంగులు ఉండితీరాలి. ప్రత్యర్థి ఎవరైనా దూకుడుగా ఆడగల నేర్పు, బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాలలో సమతూకంతో ఉండి తీరాలి. దీనికితోడు ఓపెనర్ల నుంచి లోయర్ ఆర్డర్ వరకూ నిలకడగా రాణించే బ్యాటింగ్ లైనప్, పేస్, స్పిన్ బౌలింగ్ విభాగాలలో కుదురైన బౌలర్లు, పాదరసంలా కదిలే ఫీల్డర్లు జట్టుకు ఊపిరిగా ఉంటారు. వీటితో పాటు ప్రపంచకప్‌నకు తగురీతిలో సన్నద్ధంకావడం, మెరుగైన ర్యాంకింగ్.. ఈ హంగులకు తోడు స్థానబలం (అభిమానుల అండ) సైతం అత్యంత ఆవశ్యకం. ఈ హంగులన్నీ ఉన్నజట్లకు మాత్రమే ప్రపంచకప్ గెలుచుకొనే అవకాశం ఉంటుందని గత నాలుగు దశాబ్దాల అనుభవం, రికార్డులే చెబుతున్నాయి.

**ఆల్ రౌండర్ల బలంతో...**

రోహిత్ శర్మ నాయకత్వంలోని 15 మంది సభ్యుల భారతజట్టు అత్యంత పటిష్టంగా కనిపిస్తోంది. ఆటలోని ఏ విభాగంలో చూసినా మేటి జట్లలో ఒకటిగా ఉంది. రోహిత్ శర్మ- శుభ్ మన్ గిల్‌లతో కూడిన పవర్ ఫుల్ ఓపెనింగ్ జోడీకి.. విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్, ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్‌లతో కూడిన కుదురైన మిడిల్, లోయర్ ఆర్డర్లు కొండంత అండగా ఉన్నాయి.

రోహిత్, శుభ్ మన్, విరాట్, రాహుల్, శ్రేయస్, ఇషాన్ సహా ప్రధాన బ్యాటర్లు అందరూ సన్నాహక సిరీస్‌ల్లో పరుగుల మోత మోగించడం ద్వారా కళ్లు చెదిరే ఫామ్‌లో ఉండటం భారత్‌కు కలిసిరానుంది. పేస్ బౌలింగ్ విభాగంలో మహ్మద్ షమీ, జస్ ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ఆల్ రౌండర్లు హార్దిక్ పాండ్యా, శార్దూల్ ఠాకూర్, స్పిన్ బౌలింగ్‌లో జాదూ స్పిన్‌త్రయం కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ లతో భీతికొలిపేలా కనిపిస్తోంది.




**గాయాల నుంచి తేరుకొని.....**

భారతజట్టుకు వెన్నెముక లాంటి యార్కర్ల కింగ్ జస్ ప్రీత్ బుమ్రా, వికెట్ కీపర్ బ్యాటర్ కెఎల్ రాహుల్, నాలుగో నంబర్ ఆటగాడు శ్రేయస్ అయ్యర్ గాయాల నుంచి పూర్తిగా కోలుకొని నూటికి నూరుశాతం ఫిట్ నెస్ తో జట్టుకు అందుబాటులోకి రావడం, అపార అనుభవం కలిగిన రవిచంద్రన్ అశ్విన్ ఆఖరి నిమిషంలో జట్టులో చోటు సంపాదించడం భారత విజయావకాశాలను మరింతగా పెంచాయి.

**పుష్కరకాలంగా ఎదురుచూపులు...**

భారతజట్టు వన్డే క్రికెట్లో ప్రపంచకప్ అందుకొని పుష్కరకాలం గడచింది. 1983లో కపిల్‌దేవ్ భారత్‌కు తొలిసారిగా ప్రపంచకప్‌ను అందిస్తే.. మరో ప్రపంచ కప్ కోసం 2011 వరకూ వేచిచూడాల్సి వచ్చింది. మహేంద్ సింగ్ ధోనీ నాయకత్వంలో సొంతగడ్డపై జరిగిన 2011 ప్రపంచకప్‌లో భారత్ రెండోసారి విజేతగా నిలిచిన తరువాత నుంచి గత 12 సంవత్సరాలుగా మరో ప్రపంచకప్ కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవిచంద్రన్ అశ్విన్, మహ్మద్ షమీ లాంటి దిగ్గజ క్రికెటర్లకు ఇదే ఆఖరివన్డే ప్రపంచకప్ కావడంతో ఆరునూరైనా ట్రోఫీ నెగ్గితీరాలన్న పట్టుదలతో భారతజట్టు సిద్ధమయ్యింది.

**9 మ్యాచ్‌ల రౌండ్ రాబిన్ లీగ్ సమరం....**

తొలిదశ రౌండ్ రాబిన్ లీగ్‌లో ఒక్కోజట్టు తొమ్మిది మ్యాచ్‌లు చొప్పున ఆడనుంది. రౌండ్ రాబిన్ లీగ్ మొదటి నాలుగుస్థానాలలో నిలిచిన జట్లు సెమీఫైనల్స్ నాకౌట్ రౌండ్లో పోటీపడతాయి. 10 జట్ల రౌండ్ రాబిన్ లీగ్ దశలో భారత్ తన ప్రారంభ మ్యాచ్‌ను అక్టోబర్ 8న చెన్నై చెపాక్ స్టేడియం వేదికగా ఐదుసార్లు విన్నర్ ఆస్ట్రేలియాతో ఆడనుంది. అక్టోబర్ 11న అఫ్ఘనిస్థాన్, 14న పాకిస్థాన్, 19న బంగ్లాదేశ్, 22న న్యూజిలాండ్, 29న ఇంగ్లండ్, నవంబర్ 2న శ్రీలంక, 5న దక్షిణాఫ్రికా, నవంబర్ 12న నెదర్లాండ్స్ జట్లతో భారత్ పోటీపడనుంది. నవంబర్ 15న ముంబై వేదికగా తొలి సెమీఫైనల్స్, నవంబర్ 16న కోల్ కతా వేదికగా రెండో సెమీఫైనల్స్ నిర్వహిస్తారు. నవంబర్ 19న అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా టైటిల్ సమరం నిర్వహించ నున్నారు. సెమీఫైనల్స్ నుంచి ప్రతి మ్యాచ్‌కూ రిజర్వ్ డే సదుపాయం కల్పించారు.

నరేంద్ర మోదీ స్టేడియంలో మొదలై 46 రోజుల్లో 48వ మ్యాచ్‌గా నరేంద్ర మోదీ స్టేడియంలోనే నవంబర్ 19న ముగిసే ప్రపంచకప్ టైటిల్ పోరులో ఆతిథ్య భారత్ విజేతగా నిలవాలని శతకోటి అభిమానులు కోరు కొంటున్నారు. సకల శుభశకునాలతో పోటీకి దిగిన భారత్‌కు స్థానబలంతో పాటు కోట్లాది మంది అభిమానుల ఆశీస్సులు మెండుగా, దండిగా ఉన్నాయి.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# సమాజంలోని రుగ్మతలను తొలగించుకుందాం...

**అనంతపురం :** సమాజంలో సమరసతా భావాలు వెల్లివిరియాలని, ప్రతి ఇంటా ధర్మం ఆచరిం చాలని పూజ్య శ్రీ విరజానంద స్వామీ పేర్కొన్నారు. సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో అక్టోబర్ 1న అనంతపురంలోని పద్మావతి ఫంక్షన్ హాల్‌లో జరిగిన రాయలసీమ జిల్లాల సమతా సమ్మేళనంలో పూజ్య స్వామీజీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వందేళ్ల క్రితం 'ఆది ఆంధ్ర సమ్మేళనం' పేరుతో సమాజంలో సమరసత కోసం జరిగిన మహనీయుల ప్రయత్నాన్ని స్మరించుకుంటూ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాయలసీమ జిల్లాల నుండి పెద్ద మరుగయ్యాయని, వెయ్యేళ్ల పరాయిపాలన తర్వాత కూడా నిలిచి ఉన్న జాతి మనదని స్వామి అన్నారు. విదేశీయులు మతం మార్చడానికి అనేక ప్రయత్నాలు చేశారన్నారు. మతం మారండి లేదా మరుగుదొడ్లు కడగండి అంటే మరుగు దొడ్లు అయినా కడుగుతాం కానీ మతం మారము అన్న మహనీయుల వారసులం మనమని పేర్కొన్నారు. సమాజంలో ఏ కులం అంట రానిది కాదని, పుట్టుకతో ప్రతివాడు శూద్రుడేనని జ్ఞానం ద్వారానే విప్రుడు అవుతాడని అన్నారు. జ్ఞాని అయినవాడి పైనే భగవంతుని అనుగ్రహం ఉంటుందని డబ్బు, వయస్సు, విద్య, రూపం, వంశం ధర్మంలో అస్పృశ్యతకు చోటు ఉండరాదన్నారు. కాలానుగుణంగా మన సమాజంలో కొన్ని వికృతులు ప్రవేశించినా ఎప్పటికప్పుడు వాటిని సరి చేసుకునే సెల్ఫ్ రిపేరింగ్ మెకానిజం హిందూ ధర్మం లోనే ఉందన్నారు. సమాజంలోని అసమానతలను రూపు మాపేందుకు అన్నివర్గాల ప్రజలు కృషి చేశారన్నారు. అదే కోవలో రాయలసీమ జిల్లాల్లో ఎర్రమల కొండప్ప గట్టు వెంకటరమణప్ప ఐదుకల్లు సదాశివన్, దామోదరం సంజీవయ్య, సేవా మందిరం లింగన్న లాంటి మహనీయులెందరో కృషి చేశా రన్నారు. అన్నింటా భగవంతుణ్ణి చూసే మన సమాజం సాటి



సామాజిక సమరసత వేదిక కార్యక్రమంలో ప్రసంగిస్తున్న స్వామీజీ, పాల్గొన్న పురప్రముఖులు

ఎత్తున ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ సమాజంలో అసమానతలు ఉన్న మాట మనం ఒప్పుకోవాల్సిందేనని, సమరసత గొంతు చించుకుంటే రాదన్నారు. సమాజంలో చెడు ఉందని సమాజాన్ని ద్వేషించలేమన్నారు. సమర సతను సాధించాల్సిన బాధ్యత అందరిదీ అన్నారు. సామాజిక సమరసతకు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారు బ్రాండ్ అంబాసిడర్ అన్నారు. సమరసత వేదిక పవిత్ర గంగా ప్రవాహం లాంటిదని, తన ప్రవా హంతో ఎందరినో పునీతం చేస్తున్న గంగానదిలా సమాజాన్ని పునీతం చేస్తోందన్నారు. ఎక్కడ మలినం, అశుభ్రంఉన్నదో అక్కడికి వెళ్లి పవిత్రం చేసి సమరసతను సాధిస్తోందన్నారు. ప్రపంచంలో ఈజిప్టు,గ్రీకు మొదలైన నాగరికతలు కను చూసి కాదన్నారు. తీపిని బట్టి చెరకు,రూపాన్ని బట్టి వెదురుకు, బరువును బట్టి గొర్రెకు విలువ ఉన్నట్లే మానవత్వమే మనిషికి విలువని స్వామీజీ అన్నారు. సర్వభూతాలలో భగవంతుడిని చూడడం హిందూ ధర్మంలోని విశిష్టతగా పేర్కొన్నారు. ఎందరో మహ నీయుల త్యాగాల మీద నిలబడిన భూమి మనదని, అటువంటి మహనీయుల చరిత్రను మన పిల్లలకు చెప్పాలన్నారు. ప్రతి ఇంట ధర్మం ఆచరించేలా సమాజంలోని రుగ్మతలను తొలగించేలా దృఢ సంకల్పం చేయాలని స్వామీ పిలుపునిచ్చారు.

ప్రధాన వక్తగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ఆర్.ఎస్. ఎస్. సహ కార్యవాహ, యుగంధర్ మాట్లాడుతూ సాటి మనిషిలో భగవంతుని చూడడమే సమరసత అన్నారు, వసుధైక కుటుంబ భావనగల హిందూ మనిషిలో భగవంతుని చూడలేమా అని ప్రశ్నించారు. మార్పు మన హృదయాల్లో, కుటుంబంలో మొదలు కావాలన్నారు.

అనంతపురం జిల్లా సంఘచాలక్ హిమకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాల వికాస్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ కె.శ్యాంప్రసాద్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు మన్మథరావు, కార్యదర్శి నరసింగరావు, నాయుడు, మహిళా ప్రముఖ్ జయప్రద, ఎస్ ఎస్ ఎఫ్ ధర్మప్రచారక్ సాయిరాం సమరసత వేదిక ప్రముఖులు వివేకానంద, నాగేశ్వర రెడ్డి, కేతా గోపాల్, బాల రంగయ్య తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శనలు

# బాల జాగృతి

## తెలుసుకుందాం

## జలకంఠేశ్వరాలయం - రాయవెల్లూరు



తమిళనాడు రాష్ట్రంలోని రాయవెల్లూరులో కొలువుదీరిన పురాతన ఆలయమిది. ఈ ఆలయంలోని శిల్పకళ ఎంతో అద్భుతంగా ఉంటుంది. ఆలయంలోని స్తంభాలపై అష్ట దిక్పాలకుల చిత్రాలు, వినాయకుడు, విష్ణు, బ్రహ్మ, భూదేవి, శ్రీదేవి, సరస్వతి, పార్వతి మొదలగు దేవతామూర్తుల చిత్రాలు అద్భుతంగా చిత్రీకరించారు. ఏటా శివరాత్రి వేడుకలు ఇక్కడ ఘనంగా నిర్వహిస్తారు.

## కథ | పిల్లకాకి

అనగనగా ఒక అడవి. ఆ అడవిలో ఒక చెట్టుమీద ఒక కాకి ఉండేది. ఒకరోజు పెద్ద గాలివానవచ్చి వాటి గూడు కూలి పోయింది. దాంతో కాకి పెట్టిన గుడ్లన్నీ కిందపడి పగిలిపోయి ఒక గుడ్డు మాత్రమే మిగిలింది.

ఒక్కగానొక్క పిల్ల మాత్రమే మిగలడంతో తల్లికాకి దానిని గారాబంగా పెంచసాగింది. పిల్లకాకికి ఎగిరే వయసు వచ్చిన తర్వాత కూడా బయటకు వెళ్లనీయకుండా తనే ఆహారం తెచ్చి నోటికి అందించేది.

ఇలా ఉండగా ఒకరోజు తల్లికాకి రెక్కకి దెబ్బతగిలింది. దాంతో సరిగా ఎగరలేక ఆహారం కోసం బయటకు వెళ్లలేకపోయింది.

పిల్లకాకిని పిలిచి బయటకు వెళ్లి ఆహారం తీసుకుని రమ్మని చెప్పింది. అంతవరకు ఎప్పుడూ గూడు విడిచిపెట్టని పిల్లకాకి 'బయటకు ఎలా వెళ్లాలో తెలియదు' అన్నది. దాంతో తల్లి కాకి అవస్థపడి బయటకు వెళ్లి ఆహారం తీసుకువచ్చింది.

పక్కచెట్టు మీద ఉన్న మరో కాకి ఇదంతా గమనించి, ఆ తల్లికాకి దగ్గరకి వచ్చి, 'నువ్వు చేసిన అతిగారాబం వల్లనే నీ పిల్ల అలా తయారైంది. దాని తీరు మార్చే ప్రయత్నం చేయకపోతే భవిష్యత్తులో చాలా కష్టం.' అని చెప్పింది.



## పద్యము

**హీనగుణమువాని నిలు సేరనిచ్చిన**
**ఎంతవానికైన నిడుము గలుగు!**
**ఈగ కడుపు జొచ్చి యిట్టట్టు చేయదా?**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

భావం : చెడ్డవానికి ఆశ్రయమిచ్చి ఇల్లు చేర్చినచో, ఎంతటి వానికైననూ కడుపులో ఈగ, పురుగులు ప్రవేశించి బాధపెట్టు విధంగా ఆపదలు కలుగజేయును అని భావం.

## శ్లోకము

కోకిలానాం స్వరం రూపం

**కోకిలానాం స్వరం రూపం**
**నారీ రూపం పతివ్రతా**
**విద్యారూపంశ్చ విప్రాణాం**
**క్షమా రూపం తపస్వినాం!!**

భావం : కోకిల అందం దాని స్వరంలో ఉంది. స్త్రీ సౌందర్యం పతిని ఆరాధించడంలో ఉంటే విప్రులకు విద్యా అందానిస్తుంది. తమస్సంపన్నుల ఓర్పులోనే అందం దాగి ఉంటుంది.

## జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| మణిపూర్ | మోప్లా |
| కేరళ | గుర్జార్ |
| ఆంధ్రప్రదేశ్ | మైనా |
| రాజస్తాన్ | కుకీలు |
| నాగాలాండ్ | చెంచులు |
| గుజరాత్ | నాగాలు |

సమాధానాలు : మణిపూర్–కుకీలు; కేరళ–మోప్లా; ఆంధ్రప్రదేశ్–చెంచులు; రాజస్తాన్–మైనా; నాగాలాండ్–నాగాలు; గుజరాత్–గుర్జార్.

నిర్వహణ : నయనశ్రీ

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### ద్వారకనాథ్ తివారీ



బిహార్‌కు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, రాజకీయ నాయకుడు. ఈయన 1901లో జన్మించారు. స్వాతంత్ర్య సమరంలో ఎంతో ఉత్సాహంగా పనిచేశారు. అనేకసార్లు జైలు శిక్ష కూడా అనుభవించారు. క్విట్ ఇండియా, సహాయ నిరాకరణ ఉద్యమాల్లో కీలకంగా వ్యవహరించారు.

## జనరల్ నాలెడ్జ్

1. భారత అంతరిక్ష పరిశోధన పితామహుడు అని ఎవరిని పిలుస్తారు?
2. గాలిలో తేమశాతాన్ని కొలిచే సాధనాన్ని ఏమంటారు?
3. ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి ఎవరు?

సమాధానాలు :డాక్టర్ విక్రం సారాభాయ్; 2. హైగ్రోమీటర్; 3. టంగుటూరి ప్రకాశం పంతులు



తల్లి కాకి తాను చేసిన తప్పు తెలుసుకుంది. 'నా పిల్లను మార్చేందుకు నువ్వే ఏదైనా సలహా చెప్పు' అని ఆ కాకిని అడిగింది.

పక్క చెట్టు మీది కాకి సరేనంది. పిల్ల కాకికి వినిపించేలా వెంటనే తన పిల్లల్ని పిలిచింది. 'ఈరోజు మీ ఆహారాన్ని నేనే తీసుకొస్తాను. మీరు గూట్లోనే ఉండండి' అని చెప్పింది. 'మాకు రెక్కలు లేనప్పుడు నువ్వు ఆహారం తెచ్చి పెట్టావు.. ఇప్పుడు మాకు రెక్కలు ఉన్నాయి కదా! ఆహారం తెచ్చుకోకుండా ఉండటానికి మేం పనిచేతకాని వ్యక్తులం కాదు. బయటకు వెళితే సంతోషంగా ఉంటుంది. ఆహారంతో పాటు లోకంలో అనేక వింతలు కూడా కనిపిస్తాయి.' అని చెప్పాయి.

ఎప్పుడూ బయటకు వెళ్లని పిల్లకాకికి ఈ మాటలు విన్నాక బయటకు వెళ్లాలనే ఉత్సాహం కలిగింది. మిగిలిన కాకులతో పాటు బయటకు వెళ్లింది. ఎన్నో అందమైన దృశ్యాలను చూసింది. దాని ఆహారం అదే సంపాదించుకోవడమే కాదు, తల్లికాకికి కూడా ఆహారం తీసుకురావడం మొదలు పెట్టింది. పిల్లకాకిలో వచ్చిన మార్పును చూసి తల్లికాకి ఎంతో సంతోషపడింది. ★

## మెదడుకు మేత



తోకలేని పిట్ట తొంభై ఆమడలు పోతుంది.. ఏమిటది?

జవాబు : ఉత్తరం

## మంచిమాట



**అణకువ లేకపోతే అందం కూడా వికారంగా, అసహ్యంగా కనిపిస్తుంది!**






# వారఫలాలు

09-15 అక్టోబర్ 2023



సింహంభట్ల సుబ్బారావు
6300674054



**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

ముఖ్యమైన కార్యక్రమాలు కొంత శ్రమానంతరం పూర్తి చేస్తారు. శుభకార్యాల నిర్వహణతో సందడిగా గడుపుతారు. ఉద్యోగులకు విధుల్లో అవరోధాలు తొలగుతాయి. రాజకీయవేత్తలు సమస్యలను నేర్పుగా పరిష్క రించుకుంటారు. క్రీడాకారులు అవకాశాలు సద్విని యోగం చేసుకుంటారు. 9,10 తేదీల్లో లేనిపోని ఖర్చులు. విద్యార్థుల యత్నాలు మందగిస్తాయి. హనుమాన్ చాలీసా పఠించండి.



**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

అదనపు రాబడి దక్కి అవసరాలు తీరతాయి. సేవాకార్యక్రమాలు ఆసక్తి చూపుతారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు లభిస్తాయి. అప్రయత్నంగా కొన్ని కార్యక్రమాలు చేపడతారు. కొత్త వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. వ్యాపారులకు ఊహించనిరీతిలో లాభాలు రావచ్చు. కళాకారులకు అవకాశాలు కొన్ని దక్కే ఛాన్స్. 11,12 తేదీల్లో అనుకోని ఖర్చులు. దూరప్రయాణాలు. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.



**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

ముఖ్యమైన కార్యక్రమాలు నిదానంగా పూర్తి చేస్తారు. ఇంటి నిర్మాణాలలో కొంత జాప్యం. ఆదాయం తగ్గి రుణాలు చేస్తారు. ఆస్తి వివాదాలు చికాకు పరుస్తాయి. వ్యాపారులకు నిరుత్సాహం. ఉద్యోగులకు కొత్త చిక్కులు. పరిశోధకులు, వైద్యుల కృషి అంతగా ఫలించదు. 12,13 తేదీల్లో శుభవర్తమానాలు. ఆకస్మిక ధన, వస్తులాభాలు. సుబ్రహ్మణేశ్వరున్ని పూజించండి.



**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ఆశించిన విధంగా రాబడి ఉంటుంది. కార్యక్రమాలు సకాలంలో పూర్తిచేస్తారు. భూములు, వాహనాలు కొనుగోలు చేస్తారు. సమాజసేవలో పాల్గొంటారు. వ్యాపారులు లాభాలబాటలో నడుస్తారు. ఉద్యోగులకు హోదాలు పెరుగుతాయి. కళాకారులు స్వీయానుభవాలతో ముందడుగువేస్తారు. క్రీడాకారులు, వైద్యులసేవలకు గుర్తింపులభిస్తుంది. 14,15 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. శారీరక రుగ్మతలు. కనకధారా స్తోత్రాలు పఠించండి.



**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

ఆదాయం కొంత మెరుగుపడి అవసరాలు తీరతాయి. ఆశ్చర్యకరమైన సంఘటనలు ఎదురు కావచ్చు. కార్యక్రమాలు విజయవంతంగా సాగుతాయి. భూములు, ఇళ్లు కొనే వీలుంది. పారిశ్రామికవేత్తలు విదేశీ పర్యటనలు చేస్తారు. కళాకారులు, రచయితలకు ముఖ్య సమాచారం రాగలదు. 9,10 తేదీల్లో వృథా ఖర్చులు. అనారోగ్యం. శ్రీరామ రక్షా స్తోత్రాలు పఠించండి.



**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

దీర్ఘకాలిక రుణబాధలు తొలగుతాయి. ఆస్తి వివాదాలను అత్యంత నేర్పుగా పరిష్కరించుకుంటారు. విద్యార్థులకు విదేశీ విద్యావకాశాలు లభిస్తాయి. వ్యాపారులు సంస్థల విస్తరణలో ముందడుగు. ఉద్యోగులు విధుల్లో ప్రతిబంధకాలు అధిగమిస్తారు. క్రీడాకారులు, పరిశోధకులకు నూతనోత్సాహం. 12,13 తేదీల్లో వ్యయప్రయాసలు. కనకధారాస్తోత్రం పఠించండి.



**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

ఆశించిన ఆదాయం సమకూరి అవసరాలు తీరతాయి. కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. దైవకార్యాలలో పాల్గొంటారు. కొన్ని వివాదాలు పరిష్కరించుకుంటారు. ఉద్యోగులకు కీలక సమాచారం రాగలదు. పారిశ్రామికవేత్తలు స్వయంకృషితో విజయాలు సాధిస్తారు. కళాకారులు, వైద్యరంగాల సేవలకు గుర్తింపు పొందుతారు. 13,14 తేదీల్లో బంధువిరోధాలు. దత్తాత్రేయ స్తోత్రం పఠించండి.



**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

దీర్ఘకాలిక సమస్యలు కొన్ని పరిష్కారమవుతాయి. భూములు, వాహనాలు కొంటారు. కాంట్రాక్టులు లభిస్తాయి. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగులు స్వల్పమేర ఇంక్రిమెంట్లు. రాజకీయవేత్తలకు అనూహ్యమైన పదవులు. కళాకారులు, రచయితలు సమర్థతను చాటుకుంటారు. 9,10 తేదీల్లో అనారోగ్యం. శివపంచాక్షరి పఠించండి.



**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

రావలసిన సొమ్ము సమయానికి అందుకుంటారు. ముఖ్య కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి చేస్తారు. వ్యాపారులు ఆశించినరీతిలో లాభాలు అందుకుంటారు. ఉద్యోగులు విధుల్లో ప్రతిబంధకాలు తొలగుతాయి. పారిశ్రామికవేత్తలకు అనూహ్య అవకాశాలు. రచయితలు, క్రీడాకారుల ఆశలు ఫలిస్తాయి. 10,11తేదీల్లో అనుకోని ఖర్చులు. అనారోగ్యం. శివాలయ దర్శనాలు చేయండి.



**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

కార్యక్రమాలు సజావుగా పూర్తి చేస్తారు. బంధువులతో తగాదాలు తీరిఊరట చెందుతారు. భూవివాదాలు ఏర్పడవచ్చు. సమాజసేవలో భాగస్వాములవుతారు. ఉద్యోగులకు సేవలు విస్తృతమవుతాయి. రాజకీయవేత్తలకు కొత్త పదవులు. రచయితలు, పరిశోధకుల యత్నాలు ఫలిస్తాయి. 11,12 తేదీల్లో వివాదాలు. మానసిక ఆందోళన. బంధువుల నుంచి ఒత్తిడులు. హయగ్రీవస్తోత్రాలు పఠించండి.



**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

దీర్ఘకాలికంగా వేధిస్తున్న కొన్ని ఇబ్బందులు తీరతాయి. అనుకోని కాంట్రాక్టులు దక్కించుకుంటారు. ముఖ్యనిర్ణయం తీసుకోవలసిన అవసరం. వ్యాపారులకు అనుకున్న విధంగా పెట్టు బడులు సమ కూరతాయి. ఉద్యోగులకు విధుల్లో ప్రతి బంధకాలు తొలగుతాయి. క్రీడాకారులకు ఉత్సాహవంతమైన కాలం. 14,15తేదీల్లో ఆస్తి వివాదాలు. మానసిక ఆందోళన. అంగారక స్తోత్రాలు పఠించండి.



**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

కొత్త కార్యక్రమాలను ప్రారంభిస్తారు. అందరికీ ఆదర్శవంతంగా నిలుస్తారు. విద్యార్థులు ఆశించిన అవకాశాలు. భూ వివాదాలు తీరి ఊరటలభిస్తుంది. ఇంటి నిర్మాణాలకు శ్రీకారం చుడతారు. వ్యాపారులు కొత్త సంస్థలు ప్రారంభిస్తారు. పారిశ్రామికవేత్తలు ఇంతకాలం ఎదుర్కొన్న ఇబ్బందుల నుంచి బయట పడతారు. కళాకారులు, రచయితలు సంతోష దాయకంగా గడుపుతారు. 9,10తేదీల్లో దూర ప్రయాణాలు. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

# పదరసం-436

## ఆధారాలు

**అడ్డం**

1. విజయనగర సామ్రాజ్య స్థాపనలో కీలకమైన గురువు(5)
5. అటు నుంచి మొదలు
7. ఈ పువ్వులు శివునికి చాలా ప్రీతి (4)
8. గజ కర్ణ, గోకర్ణ.... విద్య (5)
9. తిరగబడ్డ ఢంకా (2)
10. .... విక్రమార్క కథలు లోక విదితం (2)
12. బంధుత్వం సరిగా లేదు (2)
14. వెలుతురులోనే ఉంటుంది! (2)
15. సమ్మతి, అంగీకారం (4)
17. కైపు (2)
18. ఒక చిన్న, గొప్ప దేశం (3)
19. ఆజ్ఞ, ప్రమాణం (3)
21. దారిచూపువాడు (4)
22. పురాణాలలోని విమానం (6)
24. ప్రముఖ శతకకారుడు (3)
25. సాధారణంగా కొంటె తర్వాత వచ్చేది (3)
26. చిక్కులాంటిది (3)

**నిలువు**

1. తెనాలి రామలింగని బిరుదు (5)
2..... దమనకుల పాత్రలు ప్రముఖమైనది (అటూ ఇటూగా) (4)
3. విషయ వ్యామోహం కూడదనే భాగవత కథలోని ఈయన లేడిగా పుట్టాడు(పైకి) (6)
4. పూర్తి (3)
6. మిత్రబేధంలో దేవశర్మను మోసం చేసిన శిష్యుడు. నమ్మక ద్రోహిని ఇలా అనడం రివాజు (5)
11. మతిలేని దుర్యోధనుని భార్య (2)
13. ఒక పురాణం (6)
15. సందేహం (4)
16. తగవులు తీర్చే ఈయన కథలు ప్రముఖమైనవి (6)
20. గోరుచుట్టుపై... పోటు అని సామెత (3)
23. ఇంద్రుని రథసారథి (3)

**మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27**

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | 3 | ✠ | 4 | ✠ | 5 | 6 |
| | ✠ | | ✠ | 7 | | | | ✠ | |
| 8 | | | | | ✠ | | ✠ | 9 | |
| | ✠ | | ✠ | 10 | | ✠ | 11 | ✠ | |
| 12 | 13 | ✠ | 14 | | ✠ | 15 | | 16 | |
| ✠ | 17 | | ✠ | 18 | | | ✠ | | ✠ |
| 19 | | ✠ | 20 | ✠ | ✠ | 21 | | 26 | |
| ✠ | 22 | | | | 23 | | ✠ | | ✠ |
| ✠ | | ✠ | | ✠ | | ✠ | 24 | | |
| 25 | | | ✠ | 26 | | | ✠ | | ✠ |

**పదరసం - 436**

పేరు : ..........................................................................................

చిరునామా:..........................................................................................

..........................................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ..........................................................

**సమాధానాలను** పైగడులలో పూరించి,కత్తిరించి కవర్‌పై పదరసం నెం.వేసి 2023 అక్టోబర్ 23 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

## పదరసం - 432 సమాధానాలు



**విజేతలు:** వై.హనుమంతరావు, నకిరెకంటి రాజేష్, చుక్కల సత్యకార్తికేయ, వేదాంతం పద్మారంగనాథ్, రాయపెద్ది అప్పాశేషశాస్త్రి, డా. రోహిణీ పులికంటి, బి.రామచంద్రమూర్తి, కె.వి.ఎస్.ఎన్. గణేశ్ కుమార్, నాగశ్రీసోమిత్ర, చెరుకు మహేశ్వరశర్మ, జి.యశోదా ప్రీతి, రాయవరపు శేషు, ఎ.ప్రదీపుకుమార్, ఎ.ప్రదీప్, టాగూర్ ఉపేందర్ సింగ్, ఎస్.పి.మంజురి, కె.విమలాదేవి, కొండపర్తి కాంతామణి, ఆర్.అంజనీదేవి, కల్లూరి వెంకటరమణమూర్తి, ఆర్.ఎస్.పి.కౌముది, చింతపల్లి గీతాస్రవంతి, టి.సుబ్రహ్మణ్యం, కె.అల్లీరాణి వై.రాధాకిషన్, రుద్రభిల్లు సుగుణరాజారాం, కాశీభట్ల సూర్యప్రభ, వి. రూపలావణ్య, తల్లావఝల అనన్యశర్మ, యాలాల చంద్రిక, యస్.లక్ష్మీదేవి, బి.ఇందుశేఖర్, ఎస్.బాలశైలజ, ఉడాలి భాస్కరయ్య, బి. విజయలక్ష్మి, మత్స్యరాజ హరగోపాల్

**ఈ వారం విజేత : గండ్లూరి ప్రసన్న, హైదరాబాద్**




# రాబోయే సంక్రాంతి మహా రంజుగా...

తెలుగు వారికే కాదు తమిళ చిత్రసీమకూ సంక్రాంతి సీజన్ అంటే సమ్‌థింగ్ స్పెషల్. దీపావళితో పాటు పొంగల్ బరిలో దిగే చిత్రాలను ముందుగానే ప్రకటించడం అక్కడ అలవాటు. అయితే ప్రకటించిన అన్ని సినిమాలు సంక్రాంతి బరిలో దిగుతాయని అనుకోవడానికి లేదు. భారీ బడ్జెట్ చిత్రాలు కొన్ని అనివార్యంగా వాయిదా పడే ఆస్కారం కూడా ఉంటుంది. చిత్రం ఏమంటే... రాబోయే సంక్రాంతికి స్ట్రయిట్‌తో పాటు అనువాద చిత్రాలు కూడా భారీ అంచనాలతో తెలుగునేలపై సందడి చేయబోతున్నాయి.

సంక్రాంతి కానుకగా విడుదలయ్యే తెలుగు సినిమాల జాబితా ఇప్పటికే వచ్చేసింది. ప్రభాస్ 'కల్కి'తో పాటు మహేశ్‌బాబు 'గుంటూరు కారం', రవితేజ 'ఈగల్', నాగార్జున 'నా సామిరంగ', తేజ సజ్జా 'హనుమాన్', ఇంకా పేరు నిర్ణయించని విజయ్ దేవరకొండ సినిమా సంక్రాంతి బరిలో దిగుతాయనేది అధికారిక సమాచారం. ప్రభాస్ నటించిన 'సలార్' మూవీ డిసెంబర్ 22కు వాయిదా పడిన నేపథ్యంలో 'కల్కి' కూడా కచ్చితంగా వెనక్కి వెళుతుందని అంటున్నారు. అది వేసవి సీజన్‌కు వెళ్లినా ఆశ్చర్యపోనవసరం లేదు. ఇదే సమయంలో మహేశ్ బాబు, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'గుంటూరు కారం' విడుదల మీద కూడా నీలినీడలు అలముకుంటున్నాయి. ఈ సినిమా షూటింగ్‌లో విపరీతమైన జాప్యం జరుగుతుండటం, ప్రధాన తారాగణంతో పాటు సాంకేతిక నిపుణులూ మారిపోతుండటంతో ఇది కూడా సమయానికి పూర్తయ్యి, సంక్రాంతికి రావడం కష్టమే అని అంటున్నారు.

రవితేజ నటిస్తున్న 'టైగర్ నాగేశ్వరరావు' మూవీ అక్టోబర్ 20న విడుదల కాబోతోంది. దీని తర్వాత రవితేజతో సినిమాటోగ్రాఫర్ కార్తీక్ ఘట్టమనేని తెరకెక్కిస్తున్న 'ఈగల్' రావాల్సి ఉంది. దీనిని సంక్రాంతి కానుకగా విడుదల చేస్తామని నిర్మాతలు చాలా ముందుగానే తెలిపారు. దానికి అనుగుణంగానే ప్రచారమూ ప్లాన్ చేశారు. ఈ మధ్య కాలంలో సంక్రాంతి సీజన్‌లో విడుదలైన రవితేజ సినిమాలు 'క్రాక్', 'వాల్తేరు వీరయ్య' మంచి విజయాన్ని అందుకున్నాయి. సో... 'ఈగల్'కు ఇది కలిసొస్తుందని అనుకోవచ్చు.

అక్కినేని నాగార్జునకు సంక్రాంతి సీజన్ ఈ మధ్య బాగానే కలిసివస్తోంది. సంక్రాంతికే వచ్చిన 'సోగ్గాడే చిన్నినాయనా' సక్సెస్ అయ్యింది. ఆ తర్వాత దాని సీక్వెల్ 'బంగార్రాజు' కూడా అదే టైమ్‌లో వచ్చి ప్రేక్షకులను మురిపించింది. ఇక మిగిలిన సినిమాలేవీ నాగార్జునకు హిట్‌ను అందించలేక పోయాయి. దాంతో నాగార్జున సైతం ఈసారి సంక్రాంతి బరిలో 'నా సామిరంగ'తో తన సత్తా చాటాలని అనుకుంటున్నాడు.

విజయ్ దేవరకొండ తొలి పాన్ ఇండియా మూవీ 'లైగర్' పరాజయం తర్వాత వచ్చిన 'ఖుషీ' ఫర్వాలేదనిపించింది. కానీ ఆశించిన స్థాయిలో మాత్రం సక్సెస్ కాలేదు. దాంతో తన ఆశలన్నీ పరశు రామ్ దర్శకత్వంలో దిల్‌రాజు నిర్మిస్తున్న సినిమాపై పెట్టుకున్నాడు. విజయ్ దేవరకొండ, పరశురామ్ కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'గీత గోవిందం' మంచి విజయాన్ని అందుకోవడం దానికో కారణం. ఈ కొత్త సినిమాలో 'సీతారామం' ఫేమ్ మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాలతో పాటే తేజ సజ్జాతో దర్శకుడు ప్రశాంత్ వర్మ తెరకెక్కిస్తున్న తొలి ఇండియన్ సూపర్ హీరో మూవీ 'హనుమాన్' రావాల్సి ఉంది. దీనిని జనవరి 12న పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయబోతున్నట్టు ఇప్పటికే ప్రకటించారు. అత్యధికంగా ఉన్న వి.ఎఫ్.ఎక్స్. కారణంగా మూవీ విడుదల తేదీ ఇప్పటికే వాయిదా పడింది. మరోసారి వాయిదా పడినా ఆశ్చర్యం లేదని అంటున్నారు.

ఈ యేడాది సంక్రాంతికి నందమూరి బాలకృష్ణ 'వీరసింహారెడ్డి', చిరంజీవి 'వాల్తేరు వీరయ్య', సంతోష్ శోభన్ 'కళ్యాణం కమనీయం' సినిమాలు వచ్చాయి. వీటితో పాటు తమిళ అనువాద చిత్రాలు అజిత్ 'తెగింపు', విజయ్ 'వారసుడు' వచ్చాయి. రాబోయే సంక్రాంతికి కూడా తమిళనాడుకు సంబంధించి సీన్ రిపీట్ కాబోతోంది. దీపావళికి వస్తుందని అనుకున్న శివ కార్తికేయన్ 'అయలాన్' చిత్రం ఇప్పుడు సంక్రాంతికి వాయిదా పడింది. అలానే తాజాగా రజనీకాంత్ 'లాల్ సలామ్'ను కూడా సంక్రాంతికే విడుదల చేయబోతున్నట్టు మేకర్స్ ప్రకటించారు. రజనీకాంత్ ప్రత్యేక పాత్ర పోషిస్తున్న ఈ సినిమాలో విష్ణు విశాల్, విక్రాంత్ హీరోలుగా నటిస్తున్నారు. దీనిని రజనీకాంత్ కూతురు ఐశ్వర్య డైరెక్ట్ చేస్తోంది.

మొత్తం మీద వచ్చే సంక్రాంతి బరిలో అనువాద చిత్రాలతో కలిపి ఐదారు కచ్చితంగా ప్రేక్షకుల ముందుకు వస్తాయని అంటున్నారు. చిత్రం ఏమంటే... ఈ యేడాది క్రిస్మస్ సీజన్‌లో రావాల్సిన కొన్ని సినిమాల విడుదల తేదీలోనూ మార్పులు జరిగే ఆస్కారం ఉంది.

ఎప్పుడైతే 'సలార్'ను డిసెంబర్ 22కు పోస్ట్ పోన్ చేశారో ఆ సమయంలో రావాల్సిన 'హాయ్ నాన్న', 'సైంధవ', 'హరోంహర', 'ఎక్స్‌ట్రా' సినిమాలలో కొన్ని ముందుకో వెనక్కో వెళ్లక తప్పనిపరిస్థితి ఏర్పడింది. అలానే పవన్ కళ్యాణ్‌తో సుజిత్ తెరకెక్కిస్తున్న అవుట్ అండ్ అవుట్ యాక్షన్ మూవీ 'ఓజీ' కూడా సంక్రాంతికే వస్తుందనే వార్తలూ వస్తున్నాయి. దాంతో రాబోయే సంక్రాంతి బరిలో రంజైన పోటీ నెలకొనడం ఖాయంగా కనిపిస్తోంది.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# అలౌకికం.. మార్మికం...



మోనాలీసా చిత్రం గురించి, ఆమె మార్మికమైన చిరునవ్వు గురించి, వినని వారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో! కానీ, మన పొరుగుదేశం శ్రీలంకలో ఉన్న 'సమాధి బుద్ధ' విగ్రహం గురించి తెలిసినవారు చాలా తక్కువమందే ఉంటారు. క్రీ.శ. 4–6వ శతాబ్దాల మధ్యకాలంలో చెక్కిన, అనురాధపుర ప్రాంతంలో నిలిచిన ఈ విగ్రహం సమాధి స్థితిలో బుద్ధుడి ముఖంలోని ఆనందానికి, కరుణకి అద్దం పడుతూ ఉంటుంది. చిత్రాన్ని పరిశీలించి చూసినప్పుడు పెదవులు ఒకవైపు పైకి వచ్చి చిరునవ్వును చిందిస్తున్నట్టుండగా, మరొకవైపు దయను వర్షిస్తూ కనిపిస్తుంది. లియొనార్డో డావిన్సీ మొనాలీసాను గీయడానికి పది పన్నెండు శతాబ్దాల ముందే ఈ విగ్రహాన్ని చెక్కారు!

ఫోటోగ్రాఫర్: జయంత, సెంట్రల్ కల్చరల్ ఫండ్, అనురాధపుర, శ్రీలంక

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 75 Issue : 51


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు



వెల : ₹.220/-



వెల : ₹.200/-



వెల : ₹.390/-



వెల : ₹.250/-



వెల : ₹.250/-




వెల : ₹.360/-




వెల : ₹.100/-



వెల : ₹.200/-




వెల : ₹.100/-




వెల : ₹.150/-




వెల : ₹.799/-




వెల : ₹.499/-




వెల :₹.495/-




వెల : ₹.799/-




వెల : ₹.549/-

పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!
సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.
040-27563236, 9290127329
సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 8333812687